1993-2013 నడుస్తున్న చరిత్ర

తెలుగుజాతి పత్రిక

# అమ్మనుడి

నుడి నాడు నెనరు

డిసెంబరు 2016

సంపుటి : 2
సంచిక : 10
రు.20/-లు
తెనాలి






కీ.శే.మంగళంపల్లి బాలమురళీకృష్ణ

సంగీత ప్రపంచంలో
యుగపురుషుడు,
తెలుగువారి కీర్తిపతాక,
మంగళంపల్లి
బాలమురళీకృష్ణ
'అంతటివాడు
ఈ లోకంలో
ఇక పుట్టడు...'

## మాతృభాషల పట్ల బాధ్యత వహించని నూతన జాతీయ విద్యావిధానం



## 'నామవిజ్ఞాని'కి శ్రద్ధాంజలి

# యార్లగడ్డ బాలగంగాధరరావు

**త**న ఆలోచనను కుండబద్దలు కొట్టినట్లు చెప్పే ముక్కు సూటి తనం. ఏ విషయాన్ని గురించి అయినా లోతుగా అన్వేషించే నైజం. కొత్త దనాన్ని లోకానికి పరిచయం చెయ్యాలనే తపన మూర్తీ భవించిన వ్యక్తి ఆచార్య యార్లగడ్డ బాలగంగాధరరావు గారు. సాధారణ స్థాయి వ్యక్తి కూడా పట్టుదల, కృషి ఉంటే అసాధారణ వ్యక్తిగా రూపొందు తాడని చెప్పటానికి ప్రత్యక్ష సాక్ష్యం గంగాధరరావుగారు. బడిపంతు లుగా జీవితాన్ని ప్రారంభించి విశ్వవిద్యాలయ శాఖాధిపతిగా ఎదిగిన వ్యక్తి యార్లగడ్డ. వీరి జీవితం ఎంతో మందికి స్ఫూర్తి దాయకం.

విశ్వవిద్యాలయంలో అధ్యాపకునిగా తమకు ఒక ప్రత్యేక స్థానాన్ని ఏర్పరచుకున్న విశిష్ట బోధకులు యార్లగడ్డ. ప్రాచీన పద్య సాహిత్యాన్ని చెప్పే తీరులోగాని, పద్యాన్ని పఠించేరీతిలో గాని ఆయనకు ఆయనే సాటి. తరగతి గదిలోనే గాదు, సమావేశ మందిరాల్లో కూడా కొంచెం శబ్దాన్ని కూడా సహించని తత్త్వంవారిది. యార్లగడ్డ వారి పరిశోధన అనంతపురం గ్రామనామాల మీద. గ్రామనామాలను గూర్చి వీరి కంటే ముందు కొంతమంది పరిశోధన చేసినవారు ఉన్నా వారందరూ వారి పరిశోధనలకు మాత్రమే పరిమితమయ్యారు. ఆ తర్వాత ఆ రంగంలో వారి కృషి కొనసాగలేదు. కానీ యార్లగడ్డ వారి పరిశోధ నాంశం వారికి ఉచ్ఛ్వాస నిశ్వాసాలుగా మారిపోయింది. ఏ వ్యక్తి కనిపించినా ఇంటి పేరుతో సహా వారి పేర్లు తెలుసుకొని వారు ఏ ప్రాంతానికి చెందినవారో చెప్పటం వారి ప్రత్యేకత.

వీథుల పేర్ల మీద, ఊళ్ల పేర్ల మీద, వ్యక్తి, గోత్రనామాల మీద పరిశోధన చేసేవారిని మొదటి దశలో చాలా చులకనగా చూసేవారు. అది కూడా ఒక పరిశోధనమేనా అని ఎద్దేవా చేసేవారు. కానీ గ్రామ నామాల పరిశోధనకు ఒక విధమైన విలువను సమకూర్చిన వారు యార్లగడ్డవారు. ఎంతోమంది విద్యార్థులచేత నామ విజ్ఞాన పరిశోధన చేయించారు. విశ్వవిద్యాలయ స్థాయిలో నామ విజ్ఞానాన్ని ఒక పాఠ్యాం శంగా ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో పెట్టించిన ఘనత యార్లగడ్డ వారిదే. అంతటితో ఆగకుండా 'నామవిజ్ఞానం' అనే పుస్త కాన్ని తెలుగులో మొట్టమొదటగా రచించిన కీర్తిని పొందారు. నామ విజ్ఞానానికి సంబంధించిన అన్ని విషయాలు ఒకే చోట చేర్చిన యార్లగడ్డవారికి ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపు లభించింది. 'ప్లేస్‌నేమ్స్ సొసైటీ ఆఫ్ ఇండియా'లో కీలక బాధ్యతల్ని నిర్వహించి జాతీయ సదస్సులు నిర్వహించారు. అంతర్జాతీయంగా నామవిజ్ఞానం మీద కెనడాలో జరిగిన సదస్సుకు హాజరై తెలుగు వారి ప్రత్యేకతను చాటి చెప్పారు.


ఏ పదాన్ని గూర్చి అయినా కూలంకషంగా పరిశోధించేతత్త్వం యార్లగడ్డ వారిది. తెలుగు పదాలకు కూడా వ్యుత్పత్తులు చెప్పవచ్చని సోదాహరణంగా వివరించేవారు. వీరు రచించిన ఒక ఊరికథ, ఇంటిపేర్లు అనే గ్రంథాలు తెలుగువారి ప్రత్యేకతల్ని ప్రతిబింబించాయి. ఊరి పేరు మీద పరిశోధన చెయ్యటమంటే కేవలం ఆ ఊరిపేరు ఎలా వచ్చిందో చెప్పటం కాదు, దాని చారిత్రక, భౌగోళిక, నైసర్గిక పరిస్థితుల్ని అంచనా వెయ్యటమేనని చెప్పేవారు. ఆయా గ్రామ నామాలు భాషా సంస్కృతులకు ప్రతీకలుగా నిలుస్తాయని వివరించే వారు.

యార్లగడ్డవారు రచించిన 'మాట– మర్మం' అనే గ్రంథం తెలుగు భాషాభిమానులకు పదాల విందును అందిస్తుంది. ఇందులో 101 పదాల, పదబంధాల విశ్లేషణ ఉంది. అప్పడాలు, ఒడియాలు, వదినె, మరదలు, కొడుకు, కోడలు యోగక్షేమాలు, ఇద్దెనలు– ఉద్దెనలు, ఊహాగానం, ఐట్వా, పాతా మొదలైన పదాలను ఎంతో ఆసక్తికరంగా తెలిసిన తెలుగు భాషోద్యమకారుడు యార్లగడ్డ.

యార్లగడ్డ వారు రచించిన అక్షరయజ్ఞం ఒక మహత్తర రచన. ఇందులో సాహిత్య సామాజిక, భాషాశాస్త్ర సంబంధమైన 26 వ్యాసా లున్నాయి. ఇంటి పేర్లను గూర్చి ఇందులో ఆసక్తికరమైన వ్యాసాలు న్నాయి. స్త్రీల ఇంటి పేర్లు వివాహం తర్వాత మారటంలేదని, ఆ ప్రక్రియ మనకు ఇటీవల కాలంలో అంటే చదువు సంధ్యలు మొదలైన తర్వాత సర్టిఫికేట్లలో నమోదు చేసే విషయంలో మొదట తండ్రి ఇంటి పేరు నమోదై అనంతరం వివాహం తర్వాత అది మారుతోందని భావిస్తున్నామని, నిజానికి స్త్రీకిగాని, పురుషునికిగాని, వ్యక్తులుగా వివా హానికి ముందు ఇంటిపేరు లేదని ఫలానా వారి సంతానంగా మాత్రమే గుర్తింపు అని, వివాహానంతరం అంటే వారు కుటుంబీకులైనప్పుడే వారికి ఇంటిపేరు స్థిరీకరింపబడుతోందని, వివాహం తర్వాత స్త్రీకి పుట్టింటితో సంబంధం లేదని, తనదైన ప్రత్యేక కుటుంబానికి అధినేత్రి అవుతోందని, అలా భర్త ఇంటిపేరు ఆమెకు సంక్రమిస్తోందని, వాస్తవానికి వివాహకాండలో ఇంటిపేరుకు ప్రాధాన్యం లేదని, గోత్రాలకే ప్రాధాన్యముందని వివరించారు. మారుతోందనే అపోహకు లోనై దాన్ని వ్యతిరేకిస్తున్న వివాహిత స్త్రీలు తమ పేరు చివర భర్తపేరు చేర్చుకోవటం విడ్డూరమని, ఈ ప్రక్రియ ఇతర భాషాప్రాంతాల నుంచి సంక్రమించిందని చెప్పారు. బుద్ధుని విషయాన్ని చర్చిస్తూ ఆంధ్రులు ఉత్తరాదివారని, వారు బుద్ధుని బోధనల్ని అనుసరించారని ఆయన నిర్యాణానంతరం దక్షిణాదికి తరలి వచ్చారని సోపపత్తికంగా నిరూపిం చారు. ఇంకా శ్రీనాథుని జన్మస్థలాన్ని గూర్చి పలు అంశాల్ని చర్చించి ఆయన స్వగ్రామం 'పాకల' అని చెప్పారు. భోజరాజీయమనే కథా కావ్యాన్ని రచించిన అనంతామాత్యుని స్వగ్రామం 'పెనుమకూరు' అని నిర్ధారించారు. యార్లగడ్డవారు 2004లో కృష్ణాపుష్కరాల సందర్భంగా 'వాసిరెడ్డి వెంకటాద్రి నాయుని చరిత్ర'ను రచించారు.

యార్లగడ్డవారు పదవీ విరమణ తర్వాత పలుగ్రంథాలు రచించి ప్రచురించారు. రచనను ఒక తపస్సుగా కొనసాగించారు. ఆంధ్రమహో

(తరువాయి 51వ పుటలో..)



**రామ్‌మనోహర్‌లోహియా**
(1910-1967)

"చదువుకొన్న వారి చేత పని చేయిం చాలంటే చదువురానివారు కర్రపుచ్చుకొని వారి తలల మీద నిరంతరం స్వారీ చేస్తూ వుండవలసిందే" అంటారు కీ.శే.రామ్ మనో హర్ లోహియా. ప్రజాస్వామ్యంలో ప్రజల భాషల్లోనే పరిపాలన జరగాలి. ప్రజల భాషల్లోనే వారికి చదువు చెప్పాలి. అప్పుడే ప్రజలు తమ ప్రభుత్వాలను నాయకులను నిలదీయగలుగుతారు. తమ హక్కులను కాపాడుకోగలుగుతారని అన్నాడు లోహియా.

ఆంగ్లభాషను స్వాతంత్ర్యానంతరం కూడా మన పాలకులు నెత్తిన పెట్టుకోవడాన్ని ఆయన వ్యతిరేకించాడు. అట్లాగని ఒక భాషగా ఇంగ్లీషు అంటే ఆయనకేమీ ద్వేషం లేదు. ఆంగ్లంలో ఇంగ్లీషులో ఆయన ప్రసంగించినా, వ్రాసినా అది చాలా గొప్పగా, ప్రత్యేకంగా వుంటుంది. అయితే మాతృభాషలను అణచివేసి ప్రజల నెత్తిన ఆంగ్లాన్ని రుద్దడాన్ని ఆయన తీవ్రంగా వ్యతిరేకించాడు. వివిధ సందర్భాల్లో ఆయన ఏమన్నారో చూడండి.

0 ఆంగ్లభాష ధనికులు, విద్యావంతుల మధ్య, విద్యకు నోచుకోలేనివారి మధ్య ఎంత అగాధాలను సృష్టించిందంటే ఆ భాషొక్కటే మన దేశంలోని అన్ని అసమానతలకు కారణమేమో.


0 ఇంగ్లీష్, ఇంగ్లీష్ బాషైనందువల్ల గొప్పది కాలేదు; ధనవంతుల భాషైనందున, అగ్రకులాలవారి భాషైనందున తప్ప.

0 ఆంగ్లభాషకు కళ్ళెం వేయకుండా అనుకున్నంతమేరకు మీరు ఆకలిని అరికట్టలేరు. ఆర్థిక అసమానతను కూడా.

భాషల అణచివేతకు మూలాల్ని గుర్తించిన జాతీయనాయకుడు లోహియా. అందుకే ఆయన "సంపన్నులు లేదా సామంతుల భాషలో విద్యాబోధన, పరిపాలన కొనసాగడాన్ని వ్యతిరేకిస్తున్నాను. ఒక విదేశీ భాషను వాడుతూ ఈ దేశ ప్రజలలో నవజీవనాన్ని పాదుకొల్పడం అసాధ్యం" అని స్పష్టంగా ప్రకటించాడు.

భారతదేశ పునర్నిర్మాణానికి సప్తవిప్లవాలను నిర్దేశించాడు లోహియా. అందులో ఒకటి-'భాషల మధ్య వ్యత్యాసాలు తొలగి, మాతృభాషలకు ప్రాధాన్యం లభించాలి'అని.

సంగీత ప్రపంచంలో యుగపురుషుడు, తెలుగువారి కీర్తిపతాక, పద్మవిభూషణ మంగళంపల్లి బాలమురళీకృష్ణ నవంబరు 22న దివంగతులయ్యారు.
***అంతటివాడు ఈ లోకంలో ఇక పుట్టడు*** అని ఇళయరాజా అన్నాడు. త్యాగరాజును తమిళులకు అప్పగించిన మనం బాలమురళీకృష్ణనైనా తెలుగునాట నిలుపుకుందాం!
ఆయన గురించిన వ్యాసం 50వ పేజీలో...



## లోపలి పుటలలో....


| | | | |
|---|---|---|---|
| **సంపాదకహృదయం :** | నూతన జాతీయ విద్యావిధానం | -డా॥సామల రమేష్‌బాబు | 7 |
| **అమ్మనుడి :** | తెలుగు చదువులకు సాధికారత | -డా॥సామల రమేష్‌బాబు | 8 |
| **అమ్మనుడి :** | సృజనాత్మకతే అసలైన విద్యాబోధన | -ఎడమ శ్రీనివాసరెడ్డి | 9 |
| **ప్రాచీనభాష:** | ప్రాచీనభాషగా గుర్తింపు-పూర్వాపరాలు | -డా॥కస్తూరి విశ్వనాథం | 11 |
| **సాహిత్యరంగం:** | ఒక సాహిత్య పత్రిక కోసం | -డా॥మధురాంతకం నరేంద్ర | 14 |
| **తెలుగు ప్రాచీనత :** | తెలుగే ప్రాచీనం | -కీ.శే.ఎస్.మలయాండి | 16 |
| **కంప్యూటర్ :** | తెలుగులో గూగుల్ సేవలు | -రహ్మానుద్దీన్ షేక్ | 22 |
| **న్యాయవ్యవస్థ :** | సమాచారాన్ని వెల్లడించకపోవడం.... | పెండ్యాల సత్యనారాయణ | 30 |
| **వికేంద్రీకరణ :** | తెలంగాణ జిల్లాల పునర్విభజన..మార్పులు | -సంకేపల్లి నాగేంద్రశర్మ | 33 |
| **పిట్టచూపు :** | తెలంగాణ జిల్లాల పునర్విభజన..మార్పులు | -చలసాని నరేంద్ర | 39 |
| **మన రాజులు -బిరుదులు :** | బాదామీ (తొలి పశ్చిమ)చాళుక్యులు | -డా॥ఈమని శివనాగిరెడ్డి | 41 |
| **చిరస్మరణీయుడు:** | మద్దూరి వేంకట సుబ్బారావు గారూ నేనూ... | -డా॥ఇమ్మానేని సత్యసుందరం | 43 |
| **పత్రికల్లో భాష :** | పత్రికల పదసృష్టి | -గోవిందరాజు చక్రధర్ | 45 |
| **తెలుగులెంక సూక్తులు : :** | | -డా॥నాగభైరవ ఆదినారాయణ | 47 |
| **పుస్తక సమీక్ష :** | | | 48 |
| **గ్రంథాలయం :** | | | 49 |
| **శ్రద్ధాంజలి :** | యుగపురుషుడు మంగళంపల్లి బాలమురళీకృష్ణ | -టి.ఎస్.రామచంద్రరావు | 50 |
| **బయటి తెలుగు కతల మాలిక :** | ఓ సంచారి అంతరంగం | -రంగనాథ రామచంద్రరావు | 26 |
| **గుంటూరు కత :** | నాయనమ్మ | -పి.హరిపద్మరాణి | 37 |
| **కవితలు** | ద్రావిడసూక్తం | -డా॥ఎన్.గోపి | 13 |
| | అక్షరవేణి | -అమ్మిన వెంకట అమ్మిరాజు | 21 |
| | కవితా సుందరి | -డా॥వి.నాగరాజ్యలక్ష్మి | 25 |
| | నిలబడాలంటే... | -పి.లక్ష్మణ్‌రావ్ | 25 |
| | మేలుకొలుపు | -పచ్చా పెంచలయ్య | 35 |
| | చీకటినే గమ్యంగా | -నల్లపనేని విజయలక్ష్మి | 38 |
| | మన తెనుగు | శ్రీమతి ఎస్.కాశింబి | 44 |



కైసేత, ముఖచిత్ర అలంకరణ : **కలిమిశ్రీ**
ఫొటోలు : **తమ్మా శ్రీనివాసరెడ్డి**
కథలకు బొమ్మలు : **చిదంబరం** పకపకలు : **సరసి**

ముఖపత్రంపై బాలమురళీకృష్ణ
రేఖాచిత్రం : **సరసి**



రచనలు, ఉత్తరాలు పంపుటకు చిరునామా
**డాక్టర్ సామల రమేష్‌బాబు**, సంపాదకుడు, **అమ్మనుడి,**
జి-2, శ్రీ వాయుపుత్ర రెసిడెన్సీ, హిందీ కళాశాల వీధి, మాచవరం, విజయవాడ-520004.
దూరవాణి: కార్యాలయం : *0866-2439466* సంపాదకుడు : *9848016136*
e-mail : editorammanudi@gmail.com



పత్రికలో రచయితలు వ్యక్తం చేసే అభిప్రాయాలు వారి స్వంతం.
వారితో పత్రిక యాజమాన్యం, సంపాదకుడు ఏకీభవించవలసిన అవసరం లేదు.

తెలుగుజాతి పత్రిక
# అమ్మనుడి
మాసపత్రిక
• నుడి • నాడు • నెనరు

సంపాదకుడు డా॥ సామల రమేష్‌బాబు

శాలివాహన శకం 1938 : దుర్ముఖినామ సంవత్సర మార్గశిర *(ఈరాపి) శుద్ధవిదియ గురువారం మొదలు పుష్య*(తైందాపి) శుద్ధవిదియ శనివారం వరకు

* ఈరాపి * తైందాపి : తెలుగు నెలలు

## చందా వివరాలు

| | | వ్యక్తులకు | సంస్థలకు | విదేశీయులకు |
|---|---|---|---|---|
| శాశ్వత చందా | : | రూ.5000 | రూ.7500 | -- |
| 5 సం॥ | : | రూ.1000 | రూ.1500 | 150 డాలర్లు |
| 3 సం॥ | : | రూ. 700 | రూ.1000 | 75 డాలర్లు |
| 1 సం॥ | : | రూ. 240 | రూ. 400 | 25 డాలర్లు |

ఎం.ఓ. లేదా తెనాలిలో చెల్లునట్లు బ్యాంకు డి.డి.ని **'అమ్మనుడి'** పేర పంపాలి. చెక్కు పంపేట్లయితే దయచేసి అదనంగా రు.30 లు చేర్చి పంపండి.

ఆన్‌లైన్ ద్వారా చందాను పంపేవారు NEFT / RTGS ద్వారా **'అమ్మనుడి'**-యాక్సిస్ బ్యాంకు, తెనాలి శాఖకు పంపాలి.

**AMMA NUDI - AXIS BANK, TENALI**

అక్కౌంట్ నెం. **915020010550189**

**IFSC Code : UTIB0000556**

ఆన్‌లైన్‌లో చందాను పంపినవారు, ఆ వెంటనే దయతో - చిరునామా, ఫోన్ నెం. తదితర వివరాలను జాబుద్వారాగాని, ఫోన్ మెసేజి ద్వారాగాని తెలుపగలరు.

చందాలు పంపడం, దానికి సంబంధించిన ఉత్తర ప్రత్యుత్తరాలకు చిరునామా

**డా॥ సామల లక్ష్మణబాబు,** ప్రచురణకర్త, 'అమ్మనుడి' 8-386, జీవక భవనం, అంగలకుదురు పోస్టు, **తెనాలి** గుంటూరు జిల్లా - 522 211. ఫోన్ : 9440448244

ఇ-మెయిల్ : ammanudi@gmail.com

**చందాదారులు కోరినట్లయితే ఆన్‌లైన్‌లో కూడా పత్రికను పంపగలము. ఇందుకోసం మీ ఇ-మెయిల్ ఐడిని తప్పక తెలుపగలరు.**

### చందాదారులకు సూచనలు

1. చందా కాలం ముగింపు తేదీ - పత్రిక కవరుమీద మీ చిరునామా పై భాగంలోనే ఉంటుంది. గమనించండి.
2. చందా పూర్తయ్యేందుకు ఒక నెల ముందే దయచేసి మీ చందాను పంపించండి.
3. మీ ఇంటి నెంబరుతో పూర్తి చిరునామాను, పిన్‌కోడ్ నెంబరుతో సహా తెలియపరచాలి. మీ ఫోన్ నెంబరును, వుంటే మీ మెయిల్ ఐడి ని తెలపాలి.
4. మీ చిరునామా మారినట్లయితే దయచేసి వెంటనే తెలియజేయండి.



## సంగీతశేషుడు

నోబెల్ శాంతి బహమతి మహాత్మాగాంధీ స్థాయికి చేర లేకపోయింది. 'భారతరత్న' బిరుదం బాలమురళీకృష్ణ గారి స్థాయిని అందుకోలేకపోయింది.

ఆ గౌరవ సత్కారాలు వారి జోలికి రాకపోవటమే మంచిది.

అంతకన్నా ఉన్నతమైన గౌరవాలు ప్రజల హృదయాల్లో వున్నాయి. ఆయన సంగీతలోక జీవి. తన స్వస్థానానికి వెళ్ళి పోయారు.

ఇపుడు ప్రభుత్వం నాలుక కరుచుకొని ఆయనకు భారత రత్న ఇస్తారేమోనని జంకుగా వుంది.

'ఇళైరాజా' గారు అన్న మాట జ్ఞాపకం వుంచుకోదగినది. 'అంతటివారు లోకంలో ఇక పుట్టరు' అన్నారు.

త్యాగరాజును తమిళదేశానికి అప్పగించాము. బాలమురళీ కృష్ణ నయినా ఇక తెలుగునాట నిలుపుకుందాం.

**-వావిలాల సుబ్బారావు**, 98664 02973

**నడుస్తున్న చరిత్ర** (2013 నవంబరు వరకు)

**అమ్మనుడి** (2015 మార్చి నుండి...)

**పాత సంచికలు విడిగా గాని, సంపుటి (వాల్యూం) బౌండులుగా గాని కావలసినవారు సంప్రదించండి.**

అమ్మనుడి, జి-2, శ్రీ వాయుపుత్ర రెసిడెన్సీ, హిందీ కళాశాల వీధి, మాచవరం, విజయవాడ-4.

ఫోన్ : 98480 16136, 0866-2439466

# డిట్రాయిట్ తెలుగు సాహితీ సమితి (యుఎస్ఏ)

# తెలుగు సాహిత్య విమర్శపై వ్యాసరచన పోటీకి ఆహ్వానం

**డిట్రాయిట్** తెలుగు సాహితీ సమితి (Detroit Telugu Literary Club) ఏర్పాటై సుమారు 18 సంవత్సరాలు కావొస్తోంది. తెలుగు సాహిత్యాన్ని చదవడం, చదివించడం, చదివిన పుస్తకాన్ని (ఇక్కడ కథ, కవిత, వ్యాసం, నవల, నాటకం, మొదలైన సాహిత్య ప్రక్రియలన్నిటిని కలిపి పుస్తకం అని సంబోధిస్తున్నామని గమనించగలరు) చర్చించడం, వీలైనంతలో పుస్తకాలు ప్రచురించడం, వంటివి మా కార్యకలాపాలు. వీటిలో భాగమే, ఈ పోటీ నిర్వహణ కూడా.

తెలుగు మాట్లాడేవారూ, చదివేవారూ, రోజురోజుకీ తగ్గిపోతున్నారని మనం వింటున్నదే. కానీ తెలుగులో వస్తున్న పుస్తకాల సంఖ్యలో పెద్ద మార్పు ఉన్నట్టు లేదు. అంటే తెలుగు సాహిత్య ఉత్పత్తిలో అంతగా మార్పు లేదన్నమాటే! ఇంత విరివిగా ప్రచురించబడుతున్న తెలుగు సాహిత్యంలో మంచి చెడ్డలు బేరీజు వేసే ప్రయత్నాలు ఎలా ఉన్నాయో, ఎలా ఉండాలో చర్చకు తీసుకురావడానికి చేసే ప్రయత్నమే ఈ పోటీ ఉద్దేశం.

ఏ సాహిత్యమైనా, సరైన విమర్శకు నోచుకోకపోతే ఎదుగుదల ఉండదు. ప్రచురించబడిన ప్రతీ పుస్తకాన్నీ అందరూ చదవరు. ఎవరో ఒకరు పరిచయం చేస్తేనేగాని, అది చదవాలన్న కుతూహలం కలగదు చాలామందికి. ఈ పరిచయం అనేక రకాలుగా జరుగుతుంది. అది కేవలం ఆ పుస్తకానికి రచయిత పెట్టిన పేరు కావచ్చు, ముందుమాట కావచ్చు, ప్రచురణ కర్త వ్రాసిన సంగ్రహం కావచ్చు, లేక ఎవరైనా చదివి వ్రాసిన సమీక్ష కావచ్చు. వీటిలో సమీక్ష ఒక్కటే నిష్పాక్షికంగా ఉండే అవకాశం ఉంది. మంచి చెడ్డలు బేరీజు వేస్తూ పుస్తకంలోని వస్తువుకు, భాషకు, శైలికి మాత్రమే పరిమితమయ్యే సమీక్షే విమర్శ. అంటే సాహిత్యాన్ని ప్రజాబాహుళ్యానికి పరిచయం చేసే గురుతర బాధ్యత విమర్శకులది.

**ఈ వ్యాస రచన పోటీకి ఎన్నుకోదగిన అంశాలు**

(ఈ అంశాలకు మాత్రమే పోటీ పరిమితం కాదు)

1. సృజనాత్మక సాహిత్యంపై విమర్శ ఎలా ఉండాలి?
2. సాహిత్య విమర్శకు కావలసిన పరిజ్ఞానం ఏమిటి?
3. విమర్శ ఎవరు వ్రాయాలి? ఎవరు వ్రాయకూడదు? (ఉదాహరణకు, విమర్శకులకు సాహిత్య ప్రక్రియలలో అభినివేశం ఉండాలా?)
4. ప్రస్తుత తెలుగు సాహిత్య విమర్శ స్థితి ఎలా ఉంది? మెరుగు పరచవలసిన ఆవశ్యకత ఉందా?
5. ఇతర భాషా సాహిత్య విమర్శకు తెలుగు సాహిత్య విమర్శకు పోలికలు, భేదాలు?
6. విమర్శ ఉద్దేశమేమిటి? ఎందుకు? ఎవరికి? ఏవిధంగా ఉపయోగం?
7. విమర్శపై రాజకీయ, సాంఘిక, సామాజిక పరిస్థితుల ప్రభావం ఎంతవరకు, ఎలా, సమంజసం?

పోటీలో పాల్గొనదల్చుకున్నవారు, తమకు నచ్చిన, అనువైన, అభినివేశం ఉన్న, స్పష్టత ఉన్న, లేదా ప్రవేశం ఉన్న, ఏ కోణం నుండైనా, ఏ పరిమితులలోనైనా, ఈ వ్యాసరచన చేయవచ్చు. ఎన్నుకున్న పరిధిలో విషయాన్ని ఎంత కూలంకషంగా, ఎంత విస్తృతంగా పరిశీలించి, ఎంత సరళంగానూ, క్లుప్తంగానూ విశ్లేషించారన్న వాటి పైనే బహుమతి నిర్ణయం ఉంటుంది కానీ, కేవలం వస్తువు పరిమాణ విస్తృతి ఒక్కటే బహుమతికి అర్హత కాజాలదు.

**నిబంధనలు:**

1. వ్యాసాలు తెలుగులోనే, తెలుగు సాహిత్య విమర్శ పైనే, వ్రాయాలి.
2. వ్యాసాలను చేతి వ్రాతలో కాకుండా కంప్యూటరులో టైపు చేసి, పిడిఎఫ్ ఫైలుగా మార్చి పంపాలి. (కంప్యూటరులో టైపు చేయ డానికి వెసులుబాటు లేనివారు, గడువు తేదీకి కనీసం 30 రోజులు ముందుగా వ్యాసరచన పూర్తి చేసి మమ్మల్ని సంప్రదిస్తే వీలును బట్టి సహాయం చేయడానికి ప్రయత్నిస్తాము.)
3. మొదటి పేజీలో వ్యాసం పేరు, రచయిత పేరు, చిరునామా, ఫోన్ నంబరు, ఈమెయిల్, వ్యాసం మొత్తం ఎన్ని పేజీలు, వివరాలు మాత్రమే ఉండాలి. పోటీకి పంపిన వ్యాసం ఇంతకు ముందెప్పుడూ, ఎక్కడా, ఏ భాషలోనూ, ఏ రూపంలోనూ, ప్రచురణ కాలేదని, వేరే ఏ వ్యాసానికి ఇది నకలు కాదని హామీ కూడా మొదటి పేజీలోనే ఇవ్వాలి. తరువాతి పేజీలలో వ్యాసం పేరు, వ్యాసం తప్ప వేరే వివరాలు ఉండకూడదు. న్యాయనిర్ణేతలకు రచయిత వివరాలు తెలియరాదు కనుక వ్యాస రచయితకు సంబంధించిన వివరాలేవీ వ్యాసంలో (అంటే రెండవ పేజీ మొదలుకొని) ఉండకూడదు.
4. వ్యాసం నిడివి 5 పేజీలు మించకూడదు. (పేజీ పరిమాణాలు: 7.5 x 9 అంగుళాలు లేదా 19 x 23 సెంటీమీటర్లు. వాడే లిపి పరిమాణం 12 points కు తక్కువగా ఉండకూడదు). తీసుకున్న వస్తువును విశదీకరించి, విశ్లేషించడానికి అవసరమైనంత మేరకే వ్యాసం ఉండాలి గానీ, గరిష్ఠ నిడివి వరకు వ్యాసాన్ని పొడిగించనవసరంలేదు.
5. వ్యాసాన్ని ఈమెయిల్ ద్వారా dtlcvyasamu@gmail.com కు పంపాలి. వ్యాసాన్ని పంపినవారి ఈమెయిల్ తో, వ్యాస రచయితను, వ్యాస కర్తృత్వాన్ని, ఈ వ్యాసరచన పోటీ నిబంధనల్ని, చట్టరీత్యా ధృవీకరిస్తున్నట్టు, అంగీకరిస్తున్నట్టు, భావిస్తాము. వేరే ధృవీకరణల అవసరంలేదు.
6. వ్యాసాలు మాకు చేరవలసిన ఆఖరు తేదీ: జనవరి 31, 2017.

7. న్యాయనిర్ణేతల దృష్టిలో ఉత్తమమైనవిగా ఎంపికైన మొదటి మూడు వ్యాసాలకు బహుమతులు (రు. 27,321, రు. 17,132, రు. 11.213 లేదా సమానమైన విలువలో రచయిత నివశించే దేశపు ద్రవ్యంలో) ఉంటాయి. బహుమతి పొందిన వ్యాసాలతో పాటు, మిగిలిన వాటిలో ఎన్నదగినవాటిని ప్రచురించే హక్కులు నిర్వాహక వర్గానివే.

8. న్యాయనిర్ణేతల అభిప్రాయంలో ఏ వ్యాసానికీ తగిన అర్హతలు లేవని తోస్తే బహుమతిని ఇవ్వడానికి, ప్రచురించడానికి, నిరాకరించే హక్కులు కూడా నిర్వాహకవర్గానివే. ఈ నిబంధన కేవలం ఆషామాషీగా వ్యాస రచన పోటీలో పాల్గొని బహుమతులను ఆశించే వారిని నిరుత్సాహ పరచడానికి; నిబద్ధతతో, క్రమశిక్షణతో, చేసిన రచనలకు తగిన విలువను ఆపాదించడానికి మాత్రమేనని మనవి.

ఈ పోటీకి సంబంధించినంత వరకు సర్వహక్కులు, బాధ్యతలు, తుది నిర్ణయాలు డిట్రాయిట్ తెలుగు సాహితీ సమితి (Detroit Telugu Literary Club, 1659 Squirrel Valley Drive, Bloomfield Hills, MI- 48302) వారివే. ఈ పోటీకి సంబంధించి ఏమైనా సందేహాలు ఉన్నా, సంప్రదింపులు చెయ్యవలసివచ్చినా, dtlcvyasamu@gmail.com కు ఈమెయిలు చెయ్యండి. ❋


# తెలుగుజాతి (ట్రస్టు) విన్నపం

'నడుస్తున్న చరిత్ర' ప్రోత్సాహంతో ఆంధ్రప్రదేశ్‌లోనే కాక, పొరుగు రాష్ట్రాల్లోనూ నివసిస్తున్న తెలుగువారి శ్రేయస్సుకు, తెలుగు భాషోద్యమ నిర్మాణానికి కృషి జరిగింది. దక్షిణ భారతదేశమంతటా చిక్కగా అల్లుకొని, మొత్తం దేశంలోనేకాక, అనేక ఇతర దేశాల్లో కూడా భాషా సాంస్కృతిక మూలాలను విస్తరించుకొనివున్న తెలుగుజాతిలో చైతన్యాన్ని పెంపొందించి, వారిలో సంఘీభావాన్ని, భావసమైక్యతను బలపరచవలసిన అక్కరను గుర్తించిన కొందరు కార్యకర్తలు అందుకోసం పనిచేస్తున్నారు. అయితే, అనివార్య కారణాల వల్ల నడుస్తున్న చరిత్ర పత్రికను 2013 నవంబరు నుంచి నిలిపి వేయవలసి వచ్చింది. మళ్ళీ పత్రికను ప్రచురించడంతోపాటు తెలుగు నుడి, చరిత్ర, జాతి ముందడుగుకు అవసరమైన పుస్తకాల ప్రచురణను, ప్రచార కార్యక్రమాలను చేపట్టాలని తలపెట్టాము. ఇందుకోసం 'తెలుగుజాతి' పేరిట ఒక ట్రస్టును నమోదు చేయించాము. (92/2014). తెలుగు అమ్మనుడిగా కలిగినవారు ఎక్కడ నివసిస్తున్నా, వారి శ్రేయస్సు కోసం ఈ సంస్థ పనిచేస్తుంది.

2015 మార్చి నుంచి **అమ్మనుడి** పత్రికను ప్రచురిస్తున్నాము. పుస్తకాల ప్రచురణ కార్యక్రమంలో భాగంగా తొలుత స.వెం.రమేశ్ వ్యాసాల సంకలనం **'ఎల్లలు లేని తెలుగు'**ను విడుదల చేశాము. త్వరలోనే మరికొన్ని ప్రత్యేకమైన పుస్తకాలను వెలువరించ బోతున్నాము. ఈ ట్రస్టును బలమైన పునాదులపై, తగినన్ని వనరులతో బలపరచటానికి మీ అందరి చేయూత కావాలి. ట్రస్టు నిర్మాణంలో తోడ్పడాలని విన్నవిస్తున్నాము.

**ట్రస్టుకు విరాళాలనిచ్చి తోడ్పడ గోరుతున్నాము.**

| | |
|---|---|
| రాజ పోషకులురు. 1,00,000/–లు | పోషకులు రు. 25,000/–లు |
| విశిష్ట పోషకులు రు. 50,000/–లు | ప్రోత్సాహకులు రు. 10,000/–లు |

**దాత ఫొటోను, క్లుప్తంగా పరిచయాన్ని 'అమ్మనుడి' పత్రికలో ప్రచురిస్తాము.**
**దాతలందరినీ శాశ్వత చందాదారులుగా పరిగణించి పత్రికను ప్రతినెలా పంపిస్తాము. ట్రస్టు ప్రచురించే పుస్తకాలను కూడా ఉచితంగా పంపిస్తాము.**
సొమ్మును చెక్ / డ్రాఫ్టుగా / ఆన్‌లైన్‌లో 'TELUGUJAATHI' పేర పంపాలి. యాక్సిస్ బ్యాంక్, సికిందరాబాదు.
అక్కౌంట్ నెం. 914020020387880 I.F.S.C.Code : UTIB0000068
**డా॥ సామల రమేష్‌బాబు,** మేనేజింగ్ ట్రస్టీ, 9848016136 ట్రస్టీలు : **పారుపల్లి కోదండరామయ్య** 9505298565, **డా॥వెన్నిసెట్టి సింగారావు** 9393015584, **స.వెం.రమేశ్** 8500548142, **సామల లక్ష్మణబాబు** 9440448244


## మీరు 'అమ్మనుడి' చందాదారులేనా?

'అమ్మనుడి' పత్రికకు చందాదారులు పంపే చందా సొమ్మే ఆధారం. కనుక–

1. తాము చందాదారులైతే మీకు పంపే పత్రికపై చందా ఏ నెల వరకు ఉన్నదీ పేర్కొని వుంటుంది. దయచేసి దానిని గమనించి, సకాలంలో మీ చందా సొమ్మును పంపించి పత్రికను ఎల్లప్పుడూ అందుకోండి.
2. తాము చందాదారులు కాకపోయినా, తమకు గౌరవప్రతిగా (కాంప్లిమెంటరీగా) ఉచితంగా అందుతూ వుండవచ్చు. అటువంటి మిత్రులకు పత్రిక నచ్చితే, దయచేసి చందాను పంపించి తోడ్పడగలరు. పత్రిక నచ్చకపోయినా, మీకు ఆసక్తి లేకపోయినా 'పత్రికను పంపవద్దు' అని దయచేసి ఒక కార్డుపైగాని, ఎస్.ఎం.ఎస్/మెయిల్ గాని పంపించి సహకరించగోరుతున్నాము.
3. పత్రికకు చందాను చెల్లించేవారు తమ ఇష్టాన్ని బట్టి శాశ్వత చందా (రు.5000/లు) గాని, 5 సం॥ల చందా (రు.1000/లు) గాని, 3 సం॥ల చందా (రు.700/లు) గాని పంపి పత్రికకు ఆర్థికంగా తోడ్పడగలరు. వీలుగాకపోతే సం॥చందా రు.240/లు పంపించి ఏటా పునరుద్ధరించుకొనవచ్చు.

**–ప్రచురణకర్త,** అమ్మనుడి

సంపుటి : 2 సంచిక : 10

అమ్మనుడి

డిసెంబరు 2016

సంపాదకీయం

# మాతృభాషలపట్ల బాధ్యత వహించని నూతన జాతీయ విద్యావిధానం

**నూ**తన జాతీయ విద్యావిధానాన్ని రూపొందించడం కోసం కేంద్రప్రభుత్వం నియమించిన సుబ్రమణియన్ కమిటీ ఇచ్చిన నివేదికను చెత్తబుట్టలో వేసి, కేంద్ర మానవవనరుల శాఖ స్వయంగా కొన్ని ప్రతిపాదనలతో 43 పుటల ముసాయిదా పత్రాన్ని ప్రజాభిప్రాయానికి పెట్టిన సంగతి మనకు తెలిసిందే. దానిపై వామపక్షాలకు చెందిన ఉపాధ్యాయ సంఘాలు, విద్యారక్షణ వేదికలు తీవ్రంగా ధ్వజమెత్తాయి. కేంద్రంలో ఇప్పుడున్న జాతీయవాద ప్రభుత్వానిది 'హిందుత్వ', 'కాషాయీకరణ' విధానమని , విద్యారంగాన్ని కాషాయీకరించేందుకు ఈ ముసాయిదా పూనుకొంటున్నదని వామపక్షవాదులు విమర్శిస్తున్నారు. జాతీయ వాదమంటే కాషాయీకరణే కానక్కరలేదు. జాతీయవాదుల్లో ప్రజాస్వామ్యవాదులూ, సంస్కరణవాదులూ కాషాయీకరణను బలపరచబోరన్న నిజాన్ని గుర్తించాలి. అదే సమయంలో వామపక్షవాదుల్లో ప్రజాస్వామ్య జాతీయవాదుల ప్రాతినిధ్యాన్ని కూడా విస్మరించరాదు. ఒకే ఆశయలక్ష్యాలు కలిగినవారు కూడా వేర్వేరు పార్టీలలో ఉన్నప్పుడు ఒకరికొకరు శత్రువులుగా భావించుకొంటూ ఏ అంశంలోనూ ఏకీభావం ప్రదర్శించలేని విచిత్ర ప్రజాస్వామ్యంలో ఇప్పుడు మనం ఉన్నాం.

అయితే- మనం పార్టీల దృక్పథాలను పక్కనబెట్టి కేవలం ప్రజల హితాన్ని, దేశహితాన్ని లక్ష్యంగా చేసుకొని, హేతువాదబుద్ధితో ఆలోచిస్తే-ఈ జాతీయ విద్యావిధానం ముసాయిదాలో కొన్ని ప్రమాదకరమైన అంశాలు స్పష్టంగా కనపడతాయి.

1. విద్యావిధానం అనగానే, అందులో బోధనాభాష విషయం(మీడియం) లోను, భాషలుగా నేర్పవలసిన ఇతర భాషల విషయంలోను స్పష్టత ఉండాలి. ఈ విధమైన స్పష్టత-జాతీయ విధానంలో లేకపోవడం ఈ ముసాయిదాలో ఒక ప్రధానమైన తప్పు. రాజ్యాంగంలో గుర్తింపబడిన 22 భాషలూ (8వ షెడ్యూలు) సమాన ప్రతిపత్తి కలవే. భాషారాష్ట్రాలు ఏర్పడి నిలదొక్కుకొని ఉన్నాయి. విద్య (7వ షెడ్యూలు) ఉమ్మడి జాబితాలో ఉంది. ఈ స్థితిలో జాతీయ విద్యావిధానంలో మాతృభాషల స్థానం ఏమిటో స్పష్టం చెయ్యాల్సిన బాధ్యత కేంద్ర ప్రభుత్వానికి ఉంది. దీన్ని విస్మరించి కేవలం మాతృభాషల విషయంలో నీతులు బోధిస్తూ, ఎటువంటి నిర్ణయమూ లేకుండా గాలికి వదిలెయ్యడమేమిటి? సంస్కృతాన్ని, హిందీని, ఇంగ్లీషును వాటి నెత్తిన రుద్దే ప్రయత్నాలెందుకు చేస్తున్నట్లు?

2. పాఠశాల విద్య లేదా కనీసం ప్రాథమిక విద్యను మాతృభాషలో నేర్చుకొనేందుకు రాజ్యాంగంలో ఇచ్చిన హక్కును (347, 350ఎ అధికరణాలు) తప్పనిసరి చెయ్యకుండా, ఎటువంటి రక్షణ లేకుండా ఆ అంశాన్ని ప్రభుత్వాల నిర్ణయానికి వదిలివేయడంలో ఆంతర్యం ఏమిటి?

3. ఒకపక్క విద్యాహక్కును ఇస్తున్నామంటూ అందరికీ ఒకేరకమైన విద్యను కనీసం పాఠశాల స్థాయివరకైనా ప్రభుత్వం అందించడానికి ముందుకు రాలేక పోవడం, విద్యారంగాన్ని స్వదేశీ, విదేశీ విద్యావ్యాపారుల దోపిడీకి వదిలివేయడం ఏ విధంగా జాతీయవాదం అవుతుంది? దాన్ని ప్రజాద్రోహ విధానంగా, ప్రజాస్వామ్య వ్యతిరేక విధానంగా అర్థం చేసుకోక ఏమనుకోవాలి? కార్పొరేట్ రంగానికి, విదేశీ శక్తులకు ప్రభుత్వం లొంగిపోవడం గాక మరేమవుతుంది? ఈ ధోరణి మాతృభాషల అణచివేతకూ, ధనస్వామ్యాన్ని పెంచి పోషించడానికీ తప్ప దేశప్రజలకు ఏ విధంగా మేలు చేకూరుస్తుంది?

తమది జాతీయవాద ప్రభుత్వం అని చెప్పుకొనే వారు ఇలాంటి జాతివ్యతిరేక విద్యావిధానాన్ని ముందుకు తెస్తున్నారంటే ఈ పాలకవర్గాలకూ ఇంతకు ముందున్నవారికీ ఏమిటి తేడా? ఇంకా లోతుగా చర్చించవలసిన అంశాలున్నా, కనీసం మాతృభాషలకు సంబంధించిన ఈ మూడు అంశాలను ప్రధానంగా తీసుకొని పరిశీలిస్తే- ఈ ప్రభుత్వం ఏ సిద్ధాంతాలమీద నిలబడుతున్నదో స్పష్టం అవుతున్నది. పాలక పార్టీలు మారినాయి తప్ప వారి విధానాలు మాత్రం ఒక్కటేనని తెలిసిపోవటం లేదా!

బహుశా త్వరలో ఈ ముసాయిదాయే అధికారపత్రం కాబోతున్నది. ముసాయిదాకు భిన్నంగా వచ్చే సూచనలను ప్రభుత్వం స్వీకరిస్తుందని నమ్మకం లేదు. అయినా నిజమైన జాతీయ ప్రజాస్వామ్యవాదులు ప్రభుత్వాన్ని పునరాలోచించేట్లు చేయాలి. శాస్త్రీయతను, హేతువాదాన్ని పక్కనపెట్టి ప్రభుత్వం ఏ పోకడ పోయినా అసంతృప్తి, సంఘర్షణ తప్పదు. ప్రజల్లో చైతన్యాన్ని తేవడానికి ప్రజాస్వామ్య వాదులూ, మేధావులు, ఉద్యమకారులు ముందుకు రావాలి.

**1-11-2016**

సామల రమేష్ బాబు

–డాక్టర్ సామల రమేష్ బాబు,
98480 16136


# తెలుగు చదువులకు సాధికారత

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో రాష్ట్ర అధికార భాష తెలుగు. ఇప్పుడు రెండు రాష్ట్రాలైనా రెండు రాష్ట్రాల అధికార భాష తెలుగే. రెండో అధికార భాషగా కొన్ని జిల్లాల్లో ఉర్దూ ఉంది. అధికార భాషల్లోనే పరిపాలనంతా జరగాలి. అంటే ప్రజల భాషలో పరిపాలన జరగాలి. అదే ప్రజాస్వామ్యం. కానీ, ఇంగ్లీషులోనే అత్యధికంగా పాలన సాగుతోంది. ఇప్పుడు తెలుగులో ఫైళ్ళు రాయాలన్నా ఉత్తర ప్రత్యుత్తరాలు జరపాలన్నా జంకే ఉద్యోగులు రెండు రాష్ట్రాల్లోనూ పాలనా వ్యవస్థలో ఉన్నారు. దీన్నంతా చక్కదిద్దే ప్రయత్నాలు అప్పుడప్పుడు ఏదో ఒక స్థాయిలో జరుగుతూనే ఉన్నాయి. దానికి కారణం పట్టుదల కలిగిన అధికారులే. రాజకీయ నాయకులకు ఈ విషయంపై శ్రద్ధ లేకపోవడం ప్రజల దౌర్భాగ్యం. భాషోద్యమకారులు ఎంత మొత్తుకొన్నా ప్రజల భాషలో పూర్తిగా పాలనను సాగించేందుకు నేతలు దీక్ష వహించలేదు. ముఖ్యమంత్రి స్థాయిలో సంకల్పించితే కొద్ది నెలల్లో పూర్తిగా పాలనను తెలుగులోకి తేవచ్చు. ఇప్పుడు కంప్యూటర్స్‌లో ఇందుకు కావలసిన సాంకేతికత అంతా సిద్ధంగా ఉంది. కావలసిన విధంగా దీన్ని అభివృద్ధి చేసేందుకు నిపుణులైన యువకులూ సిద్ధంగా ఉన్నారు. కావలసింది రాజకీయ సంకల్పమే!

ఇప్పుడు ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల ముఖ్యమంత్రులిద్దరూ పాలనను తెలుగులోకి పూర్తిగా తేవడానికి విముఖులు కాదు. అందుకు కట్టుబడి ఉన్నట్లు ఇద్దరూ పలుమార్లు ప్రకటించారు. ఆ దిశగా కొంతపని జరుగుతున్నట్లు కూడా తెలుస్తోంది. ఇప్పుడు వారి సంకల్పశుద్ధికి పరీక్షగా ఒక అవకాశం వచ్చింది. రెండూ రాష్ట్రాల్లోనూ కొన్ని వేల ప్రభుత్వోద్యోగాలు ఖాళీగా ఉన్నాయి. వీటిలో గ్రూప్ 2, గ్రూప్ 3లకు చెందిన ఉద్యోగాలను భర్తీచేయడానికి రెండు రాష్ట్రాల్లోనూ కసరత్తు మొదలుపెట్టారు.

ఈ రెండు గ్రూపుల్లో – మునిసిపల్ కమిషనర్, ఏసీటీవో, సబ్ రిజిస్ట్రారు, డిప్యూటీ తహసీల్దారు, అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్, అసిస్టెంట్ డెవలప్‌మెంట్ ఆఫీసరు, ఎక్స్‌టెన్షన్ ఆఫీసర్, ఎక్సయిజ్ సబ్ ఇన్‌స్పెక్టర్, అసిస్టెంటు సెక్షన్ ఆఫీసర్, సీనియర్ అకౌంటెంట్, జూనియర్ అకౌంటెంట్, జూనియర్ అసిస్టెంట్, గ్రామ పంచాయతీ సెక్రెటరీ లాంటివి వున్నాయి. ఇవన్నీ ఐఏఎస్, ఐపీఎస్ లాంటి ఉన్నతోద్యోగాలు కావు. తెలుగు ప్రజలతో మమేకమై వారితో ముఖాముఖీ వారి భాషలోనే మాట్లాడుతూ, వారి మధ్యే నివసిస్తూ సేవలందించే

*(తరువాయి 10వ పుటలో)*



–ఎడమ శ్రీనివాసరెడ్డి
ఫోన్ : 99499 05069

# సృజనాత్మకతే అసలైన విద్యాబోధన

ప్రస్తుతం మనం గతంలో ఎన్నడూ లేని విధంగా ఆర్థిక, నైతిక, పర్యావరణ, నిరుద్యోగ సంక్షోభాలను ఎదుర్కోవలసి వస్తున్నది. సంప్రదాయ విద్యావిధానాలు యధాతథ స్థితినే స్థిరపరుస్తాయి. ఈ సంక్షోభాలను నివారించాలంటే పిల్లల్లో భిన్నంగా, నవ్యంగా ఆలోచించగలిగిన (సృజనాత్మక) సామర్థ్యాలను పెంపొందించే విధానాలు ఎంతో అవసరం. సరైన విద్యా విధానాలతోనే ఈ సమస్యలను ఛేదించగలుగుతాం. అందుకనే ముప్పై ఏళ్ల తర్వాత ప్రస్తుత నూతన విద్యా విధానం–2018పై చాలా చర్చలు జరుగుతున్నాయి. సుబ్రమణ్యం కమిటీ సిఫార్సుల ఆధారంగా కేంద్రం విడుదల చేసిన ముసాయిదా కీలకమైన అంశాలను గుర్తించడంలోనూ, గుర్తించిన అంశాల్లో సరైన పరిష్కారాలను సూచించడంలోనూ ప్రస్తుత సంక్లిష్ట సామాజిక పరిస్థితులను ఎదుర్కొనేందుకు దీటైన విధానాలను రూపొందించడంలో విఫలమైంది. విద్యా సమస్యలకు సంబంధించిన సవాళ్లను ఎత్తిచూపడంలో చూపిన శ్రద్ధ పరిష్కారాలను చూపడంలో లోపించింది. ఫలితంగా యధాతథ స్థితిని కాపాడే విధానమే రూపొందబోతున్నది.

పారిశ్రామిక విప్లవం ఫలితంగా భారీ ఉత్పత్తి అవసరాలకు కావలసిన కార్మికుల తయారీ ధ్యేయంగా కలిగిన ఫ్యాక్టరీ నమూనాయే ఇంకా చాలా దేశాల్లో విద్యానమూనాగా కొనసాగుతున్నది. కాలం చెల్లిన ప్రవర్తనావాద మానసిక శాస్త్ర సిద్ధాంతాలను, సరుకుల ఉత్పత్తిలో వినియోగించే పోటీ సూత్రాలను, క్రమశిక్షణను విద్యలో ఉపయోగించడం కొనసాగుతున్నది. మన దేశంలో కూడా ఇవే విధానాల పరంపర ఎక్కువ తీవ్రతతో అమలవుతున్నది. సమాజ మార్పుకు, విద్యకూ మధ్య గతితార్కిక సంబంధాలను అర్థం చేసుకోవడంలో ఆ దిశగా విద్యావిధానాలను రూపొందించుకోవడంలో ఇప్పటివరకు రూపొందించబడిన విద్యావిధానాలన్నీ విఫలమయ్యాం. రాజ్యాంగం నిర్దేశిస్తున్న సామాజిక న్యాయం, సమానత్వం, లౌకిక భావనల ప్రాతిపదిక కొరవడింది. ఈ క్రమంలో సామాజిక అభివృద్ధికి దారితీసే విద్యకు సంబంధించిన మౌలికాంశాలు విస్మరించబడుతున్నాయి. ఈ నేపథ్యంలో సృజనశీలతను కలిగించే విద్యావిధాన అవశ్యకత ఎంతో ఉన్నది.

చాలామంది సృజనాత్మకత అనేది ఒక ప్రత్యేక సామర్థ్యం, అది కొందరిలోనే వుంటుంది, అందరిలో వుండదు అని భావిస్తారు. కొంతమందికి ఆర్ట్, మ్యూజిక్, డ్రామా, డాన్సులలో ఉండే ప్రతిభను చూసి అలా అనుకుంటాం. ఇది సృజనాత్మకతకు సంబంధించి సంకుచిత అభిప్రాయం. ఆధునిక భావనల ప్రకారం తెలివితేటలతో రూపొందించే ప్రతి భావనలో, చేసే ప్రతిపనిలో సృజనాత్మకత ఇమిడి ఉంటుంది. మనకున్న సృజనాత్మక సామర్థ్యాలను చాలా సందర్భాల్లో గుర్తించలేకపోవడం, ఏసందర్భాల్లో ఉపయోగించుకోవాలో తెలుసుకోలేకపోవడమే పెద్ద సమస్య. వంగుతూ, లేస్తూ చెత్తను ఏరుకోవడం కష్టమవుతుంది. కాబట్టి కర్రకు ఒక చివర నీడిల్ ను మరొక చివర మ్యాగ్నెట్ను ఏర్పాటుచేసుకునే ర్యాగ్‌పిక్కర్ పని సృజనాత్మకతతో కూడుకున్నదే. కొత్త ఆలోచనతో ఆధునిక టెక్నాలజీని ఆవిష్కరించే శాస్త్రవేత్త పనీ సృజనాత్మకమైనదే. పనులను సృజనాత్మకంగా చేయడం అంటే ఇదివరకు లేని కొత్త జ్ఞానాన్ని నైపుణ్యాలను తప్పనిసరిగా సృష్టించడమని కాదు. ఇదివరకున్న జ్ఞానాన్ని నైపుణ్యాలను, దృక్పథాలను అర్థవంతంగా వినియోగించడం. ఈ ప్రక్రియలో చేసినపనికి ఆర్థిక, సామాజిక విలువ ఏర్పడితే అది ఒక ఆవిష్కరణ అవుతుంది. ఇది గతంలో కలుపబడని విషయాలను కలుపుతుంది. దానికొక ఆర్థిక, సామాజిక విలువ ఏర్పడుతుంది. ఈ ప్రక్రియ ఒక వ్యక్తి లేదా వ్యక్తుల సమూహం పనుల ఫలితం కావచ్చు. విడిగా వ్యక్తుల్లో కంటే సమూహాల్లోనే ఎక్కువ సృజనకు అవకాశం ఉంటుందని చాలా మంది భావిస్తారు. అందుకే విద్యావ్యవస్థలు సమూహాల సహకార భావనను పెంపొందించేవిగా ఉండాలి. ఈ భావనను పెంపొందించాలంటే చదువుల్లో పోటీ స్థానంలో సహకారం చేరాలి. ప్రతి వారిలోనూ ఎంతోకొంత సృజనాత్మక సామర్థ్యాలుంటాయని గుర్తించడం, వాటిని బయటపెట్టే పరిస్థితులను కల్పించడం విద్యావ్యవస్థలో ఉండాలి. సృజనాత్మకత కొందరికే పరిమితమనే భావనను విడనాడాలి. పిల్లలంతా కళాకారులే కాని, పెద్దయ్యాక కూడా అలా ఉండలేకపోవడమే సమస్య అన్న పికాసో మాటలను స్మరించడం సందర్భోచితం.

పిల్లలు చేసే పనుల పట్ల న్యాయ నిర్ణయాలు చేయకుండా, వారిని ఇతరులతో పోల్చకుండా ఉన్నట్లయితే వాళ్లు స్వేచ్ఛగా ఆలోచిస్తారు, స్పందిస్తారు, పనులు చేస్తారు. సాధారణంగా పిల్లలు చేసిన ఒప్పులనే ప్రోత్సహిస్తాం, తప్పులు చేసినప్పుడు నిరుత్సాహపరుస్తాం. దీంతో పిల్లలు తమ ఆలోచన ఎక్కడ తప్పవుతుందోననే భయంతో ఆలోచించడమే మానుకుంటారు. ఆలోచించడమే మానితే నూతన విషయాల సృజనకు అవకాశమే ఉండదు. పిల్లల విద్యాభ్యాసం తమది కాని పరాయి భాషలో సాగుతున్నప్పుడు తమ వ్యక్తీకరణలో భాష ఎక్కడ తప్పుగా ఉంటుందోననే భయంతో కూడా స్పందించడమే మానుకుంటారు. ఈ విషయాన్ని విద్యాసంస్థల్లో చాలా స్పష్టంగా చూడవచ్చు. ఒకటి, రెండు తరగతుల్లో ఉన్నపిల్లలను ఏదైనా ప్రశ్న అడిగితే మీద పడి ధైర్యంతో సమాధానాలు చెబుతారు. తమ సమాధానాలు తప్పవుతాయనే భయం వారికి ఉండదు, దాంతో అలా స్పందిస్తారు. ఈ రకమైన స్పందన పరాయి భాషలో విద్యాభ్యాసం జరుగుతున్నపిల్లల్లో కంటే మాతృభాషలో విద్యాభ్యాసం జరుగుతున్న వారిలో ఎక్కువ పాళ్లలో గమనించవచ్చు. పెద్ద పిల్లల క్లాసులో ఈ రకమైన వాతావరణం ఉండదు. ఒక ప్రశ్నను పదిసార్లు అడిగినా వాళ్లు సరిగా స్పందించరు. దీనికి కారణం వారి సమాధానం ఎక్కడ

తప్పవుతుందోననే భయం.

ఇలా ఎందుకు జరుగుతుంది? పెద్దపిల్లల క్లాసులో టీచర్ అడిగే ప్రశ్నలకు స్పందన కరువు అవుతుంటుంది. సృజనాత్మకతను దెబ్బతీసే ఒక ప్రమాదకర పరిణామం ఇది. పిల్లలను విశ్వసించకుండా భిన్నంగా ఆలోచించే స్వేచ్ఛను ఇవ్వకపోతే కళా రూపాల విషయాల్లో సాధన కూడా యాంత్రికంగా మారుతుంది. సంప్రదాయ సంగీత, నృత్యకళారూపాల్లో విపరీతమైన అభ్యాసం, అనుకరణలే ఉంటాయి. కొత్త ఆవిష్కరణలు చాలా అరుదుగా జరుగుతాయి. కాబట్టి సృజనాత్మకతను పెంపొందించాలంటే బహుళ మార్గాల ద్వారా క్రియాత్మకంగా జ్ఞానసృష్టి జరిగే విద్యావిధానాలు, దానికి తగిన విద్యా నమూనా ఉండాలి. విద్యార్థులను విశ్లేషించాలి. వాళ్ళు భయం లేకుండా స్వేచ్ఛగా ఆలోచించే వాతావరణం వుండాలి. వాళ్ళ స్పందనల పట్ల న్యాయ నిర్ణయాలు చేయకుండా వుండాలి. వారు నేర్చుకునే ప్రక్రియలో ఆనందాన్ని పొందాలి కానీ అగ్రగణ్యులుగా వుండాలని కోరుకోకూడదు. అంటే ఎలాంటి పోటీ వాతావరణం వుండకూడదు. స్వేచ్ఛతో, సహకారంతో నేర్చుకునే వాతావారణం వుండాలి. టీచర్లు క్రమశిక్షణ పేరుతో పిల్లలపై పెత్తనం చెలాయించే పరిస్థితులు వుండకూడదు. పిల్లల్ని గౌరవించే పరిస్థితులు వుండాలి. టీచర్ల పనితీరును పిల్లల పరీక్షా ఫలితాలతో ముడిపెట్టకూడదు. బోధనలో వారికి తగిన స్వేచ్ఛ వుండాలి. అలాంటి పరిస్థితుల్లోనే సృజనాత్మకత విలసిల్లుతుంది.

పరీక్షలకు అధిక ప్రాధాన్యం ఇచ్చే ప్రతిపాదనలు, టీచర్, విద్యార్థి సంబంధాలను దెబ్బతీసే పెర్ఫార్మెన్స్ ఆధారిత టీచర్ల పదోన్నతులకు సంబంధించిన సిఫార్సులు, నిర్ణీతస్థాయి వరకు విద్య మాతృభాషలోనే తప్పనిసరిగా ఉండాలనే నిపుణుల అభిప్రాయాలకు ఊతమిచ్చే ప్రతిపాదనలు లేకపోవడం సృజనాత్మకతను పెంపొందించడంలో విఘాతాలుగా ఉంటాయి. **సృజనశీలతను పెంపొందించవలసిన అవసరంపై గాని దానికి పెంపొందించడానికి కావలసిన పరిస్థితులను ఏర్పరిచే సిఫార్సులు కానీ జాతీయ విద్యావిధానం -2016 ముసాయిదాలో కనపడవు. యధాతథస్థితిని కాపాడే కాలం చెల్లిన, ఫ్యాక్టరీ విద్యా నమూనానే ప్రతిపాదిస్తున్న జాతీయ విద్యావిధానం-2016 ముసాయిదా వల్ల పెను ప్రమాదం జరుగబోతున్నది.**

సొసైటీ ఫర్ చేంజ్ ఇన్ ఎడ్యుకేషన్-SCIE)

---

**తెలుగు చదువులకు సాధికారత** (8వ పుట తరువాయి)

ఉద్యోగాలివి. ప్రజల సమస్యలను సరిగ్గా విశ్లేషించాలి. గ్రామ సామాజిక, ఆర్థికవ్యవస్థపై తగిన అవగాహన తెచ్చుకోవడం, పాలనా పరిజ్ఞానాన్ని పెంచుకోవడం, వాటిని రాయగలిగిన నైపుణ్యాలుండాలి. ఈ నైపుణ్యాలన్నీ ప్రజల భాషలో తెలుగు మాధ్యమంలో చదివిన వారికే ఎక్కువ ఉంటాయి. అందువల్ల ఈ ఉద్యోగాల్లో తెలుగు మాధ్యమంలో చదివినవారికి ప్రాధాన్యమివ్వాలి. ఇందువల్ల తెలుగు మాధ్యమంలో పాఠశాల విద్య/డిగ్రీ చదివిన వారిలో మిగిలివున్న నిరుద్యోగులకు ఉద్యోగాన్నివ్వడంతో పాటు సమర్థులైన వారిని పాలనలో బాధ్యులుగా చేసినట్లవుతుంది.

తెలుగు మీడియంలో చదివినవారికి ఈ పోటీ పరీక్షల్లో ప్రోత్సాహకాలు ఇవ్వాలి. ఆ ప్రోత్సాహకాలు రెండురకాలుగా ఉండవచ్చు. 1. ఉమ్మడి రాష్ట్రంలో 1985 వరకు ఇచ్చినట్లు పోటీ పరీక్షల్లో 5 శాతం ప్రోత్సాహక మార్కులు ఇవ్వాలి. అప్పట్లో సాంకేతిక కారణాల వల్ల ఆ ప్రోత్సాహం ఆగిపోయింది. ఇప్పుడు అటువంటి లోపాలు లేని జీవోను ఇచ్చి మరలా ఆ ప్రోత్సాహకాల్ని ప్రవేశపెట్టాలి. 2. తెలుగు మాధ్యమంలో చదివినవారికి తమిళనాడులో వలే 20శాతం ఉద్యోగాల రిజర్వేషన్ ఇవ్వాలి. ఈ విషయంలో తమిళనాడులో జరిగిందేమిటో చూద్దాం. కోయంబత్తూరులో జరిగిన ప్రపంచ తమిళ మహాసభల్లో తమిళ మాధ్యమ విద్యార్థులకు ప్రభుత్వ ఉద్యోగాలు సులభంగా లభించేందుకు కొన్ని తీర్మానాలను చేశారు. తమిళ మీడియం అభ్యర్థులకు ఉద్యోగాలు దొరకకపోతే ప్రజలు పిల్లల్ని తమిళ మాధ్యమంలో చదివించరనీ, ఎవరూ చదవని భాష నశిస్తుందనీ, తమిళం పదికాలాల పాటు బతకాలంటే ఆ భాషలో మాత్రమే చదివినవారికి, వెనుకబడిన కులాల వారికి ఇస్తున్నట్లుగా ఉద్యోగాల్లో కూడా రిజర్వేషన్ ఇవ్వాలని తీర్మానం చేశారు. అందుకోసం అత్యవసరంగా ఒక ఆర్డినెన్సు తెచ్చారు. శాసనసభల్లో, స్థానిక సంస్థల్లో ప్రభుత్వ కార్పొరేషన్లు, కంపెనీలలో తమిళ అభ్యర్థులకు 20 శాతం ఉద్యోగాలు ఇవ్వాలని శాసించారు. తమిళనాడు ప్రభుత్వం జీవో ఎం.ఎస్. నంబర్ 145 పీ అండ్ ఏ.ఆర్.(ఎస్) డిపార్ట్‌మెంట్, తేదీ 30.9.2010 ద్వారా తమిళ మీడియంలో డిగ్రీ వరకు చదివిన అభ్యర్థులకు రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగాలలో 2016 ఫిబ్రవరి 23న ఈ చట్టాన్ని సమర్థించింది. ప్రమోషన్లలో కాకుండా ప్రభుత్వోద్యోగాలకు మొదటిసారిగా నేరుగా జరిపే నియామకాలకు తమిళ మాధ్యమంలో చదివిన అభ్యర్థులకు 20 శాతం ఉద్యోగాలను రిజర్వు చేయడంలో ఎలాంటి తప్పూ లేదని తేల్చిచెప్పింది.

పొరుగున ఉన్న తమిళనాడు అనుభవాన్ని ఆదర్శంగా తీసుకొని ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల ముఖ్యమంత్రులు కూడా వెంటనే తగు ఉత్తర్వులనిచ్చి తెలుగు మాధ్యమంలో చదివి నిరుద్యోగులుగా ఉన్నవారికి ప్రభుత్వ ఉద్యోగాల్లో 20 శాతం రిజర్వేషన్ ఇవ్వడంతో పాటు 5 శాతం మార్కుల ప్రోత్సాహకాన్ని కూడా అధికారిక ఉత్తర్వుల ద్వారా వెంటనే ప్రకటిస్తే వారు తెలుగులో పాలనదిశగా పెద్ద నిర్ణయాన్ని తీసుకున్నవారవుతారు. తెలుగులో చదువుకొన్నా, నిరుద్యోగులుగా ఉన్న పట్టభద్రుల సేవలను ప్రజలకు అందించినవారూ అవుతారు.

అంతేకాదు, ఈ చర్య వల్ల - మరొక గొప్ప మార్పుకు వారు కారకులవుతారు. తెలుగులో చదివిస్తే ఉద్యోగాలు రావు అన్న ఆలోచన నుంచి ప్రజలను మళ్లించి, తెలుగులో చదివిన వారికి ప్రభుత్వోద్యోగాలు లభిస్తాయన్న నమ్మకం కలిగించినట్లవుతుంది. తెలుగు చదువులకు సాధికారత కలిగించే దిశగా ఈ చర్య ఒక ముందడుగూ అవుతుంది.

చివరగా ఒకమాట. **తెలుగుపై పట్టులేనివారికి, పరిపాలనా వ్యవహారాలను తెలుగులో నిర్వహించలేనివారికి తెలుగు ప్రభుత్వాల పాలనకు సంబంధించిన ఉద్యోగాలనెందుకు ఇవ్వాలి? తెలుగు మీడియంలో చదువుకొన్నవారికే ప్రభుత్వ ఉద్యోగాలనివ్వాలనే నిబంధనను ఎందుకు తీసుకురాకూడదు?**

తొలి చర్యగా కనీసం గ్రూప్2, గ్రూప్ 3 అభ్యర్థుల్లో తెలుగు మీడియం వారికి పైన కోరిన ప్రోత్సాహకాలనివ్వడం ద్వారా **పబ్లిక్ సర్వీసు కమిషన్‌వారూ, ప్రభుత్వనేతలూ ముందుకు వస్తారని** ఆశిద్దాం.

(ఆంధ్రజ్యోతి దినపత్రిక సౌజన్యంతో)

డా॥ కస్తూరి విశ్వనాథం, మైసూరు.
9480770557

# ప్రాచీనభాషగా గుర్తింపు పూర్వాపరాలు, కర్తవ్యం

**ప్రాచీనభాషకు సాహిత్య అకాడమీ వారు నిర్దేశించిన అర్హతలు కార్యక్రమాలు ఏమిటి అనేది ఇప్పుడు ఆ విషయం మీద మాట్లాడుతున్న చాలామందికి తెలియదు. అది ఈనాటి తెలుగు అభివృద్ధి కోసం గాని, పాఠ్యగ్రంథాల ఆధునీకరణ కోసం గాని మరేదైనా విషయం కోసం గాని కాదు. ఈనాడు కాలక్రమేణా మరుగుపడిన, పడిపోతున్న తెలుగు భాషా సాహిత్యాలను భావితరాల వారి కోసం పరిరక్షించుకోవటం ఇందులోని ముఖ్యోద్దేశం.**

తమిళభాషను ప్రాచీనభాషగా గుర్తిస్తూ కేంద్రప్రభుత్వం 2004వ సంవత్సరం అక్టోబరు 12వ తేదీన అధికార ప్రకటన వెలువరించింది. ఆ విషయం నేను వెంటనే తెలుగు భాషోద్యమ సమాఖ్య ప్రధాన కార్యదర్శి (ఇప్పుడు అధ్యక్షుడు) డా॥ సామల రమేష్ బాబుగారితో చర్చించి తెలుగుకు తీరని అన్యాయం జరిగిందని, ఈ విషయాన్ని తెలుగువారు తీవ్రంగా పరిగణించాలని తెలుగు భాషకు కూడా ఆ అర్హతలన్నీ ఉన్నాయని వివరించాను. ఆయన నన్ను ఈ విషయంమీద ఒక వ్యాసం వ్రాసి పంపమన్నారు. ఇది జరిగింది 2004 అక్టోబరులోనే. నేను పంపిన వ్యాసం డిసెంబరు 'నడుస్తున్న చరిత్ర'లో ప్రచురితమయ్యింది. మెల్లమెల్లగా ప్రజలలోను చైతన్యం రావటం మొదలై, సభలలోను, సమావేశాలలోను, విద్యాలయాలలోను ఈ విషయం మీద చర్చలు జరిగాయి. ఆ తర్వాత వివిధ పత్రికలలో వ్యాసాలు వచ్చాయి. అందరికంటే ముందుగా స్పందించినవారిలో ఆర్.వి.ఎస్. సుందరం గారున్నారు. ఈ ప్రకటన సాహిత్య అకాడమీ వారి అజమాయిషీలోని భాషాశాస్త్రజ్ఞుల కమిటీలో చాలాసార్లు చర్చించిన మీదట వారి సిఫారసుతోనే జరిగింది. ఆ కమిటీలో ఇద్దరు అరవవాళ్ళు ఇద్దరు తెలుగువాళ్లు ఒక ఒడియా భాషాశాస్త్రజ్ఞుడు, ఇద్దరు ఉత్తరదేశీయులు వున్నారు. సభ్య కార్యదర్శి(ఈయన మలయాళీయుడు) కాక, అరవంతో సమానంగా ఇద్దరు తెలుగువాళ్లున్నా తెలుగు తరఫున వాదించి న్యాయం చేయలేకపోయారు. అటువంటి పరిస్థితులలో సామల రమేష్‌బాబు గారి సలహాతో నేను, అప్పుడు ఎం.ఎల్.ఏగా వున్న మండలి బుద్ధప్రసాద్ గారు ఢిల్లీకి వెళ్ళి ఆనాటి సాంస్కృతిక శాఖామాత్యులను కలిసి (సాహిత్య అకాడమీ సాంస్కృతిక శాఖ క్రింద వస్తుంది కాబట్టి) తెలుగుకు జరిగిన అన్యాయాన్ని వివరించి తెలుగును కూడా ప్రాచీనభాషగా ప్రకటించే ప్రయత్నం చేయమని కోరాము. ఆ మంత్రిగారు (జైపాల్‌రెడ్డి గారు) కూడా తెలుగువారే అయినా ఈ విషయం మీద పెద్దగా ఉత్సాహం చూపించకపోవటమే కాక అది రాజకీయ నిర్ణయమనే అభిప్రాయం కలిగించారు. ఆ తర్వాత పలువురు ప్రముఖులు, పండితులు కేంద్రప్రభుత్వ నిర్ణయాన్ని గర్హిస్తూ, తెలుగుకు కూడా ఆ హోదా ఇవ్వాలని కోరుతూ వ్యాసాలు ప్రచురించారు. సమావేశాలలో ప్రకటించారు. అందరి లాగే నేను కూడా ఈ విషయం మీద పలుచోట్ల మాట్లాడటమే కాక కొన్ని వ్యాసాలు ప్రచురించాను– ముఖ్యంగా నడుస్తున్న చరిత్ర పత్రికలో.

ఎట్టకేలకు 2008లో కర్నాటక అసెంబ్లీ ఎన్నికలను, 2009లో ఆంధ్రప్రదేశ్ ఎన్నికలను దృష్టిలో వుంచుకొని తెలుగు కన్నడాలను ప్రాచీన భాషలుగా గుర్తిస్తూ అక్టోబరు 31వ తేదీన ప్రకటన వెలువడింది. ఈ గుర్తింపు విషయంలో తెలుగువారికంటే కన్నడిగులే ఎక్కువ పాటుపడ్డారని గుర్తుంచుకోవాలి.

ఈ లోపల ప్రభుత్వం ఏమీ చేయక ముందే కె.గాంధీ అనే ఒక న్యాయవాది మద్రాసు ఉన్నత న్యాయస్థానంలో తెలుగు కన్నడాలకు ఆ హోదా ఇవ్వటం సరికాదని, ఆ భాషలకు అర్హత లేదని, వాటికాహోదా ఇచ్చేటప్పుడు అనుసరించిన విధానం సరిగా లేదని వ్యాజ్యం వేశాడు. ఇది అరవవాళ్ళకు ఇతర భాషాసంస్కృతులపట్ల వున్న ఈర్ష్యాసూయలను, సంకుచిత స్వభావాన్ని వెల్లడిస్తుంది. కేసు వేసిన తర్వాత కొంతకాలం ప్రభుత్వం స్తబ్దంగా వుంది. కేసులో పస లేదని గ్రహించిన తర్వాత నాయకుల, పండితుల ఒత్తిడితో 2011 నుంచి కొంత మొత్తాన్ని తెలుగు కన్నడాలకు కలిపి మంజూరు చేయటం ప్రారంభించింది. ఆ సంవత్సరమే డిసెంబరులో మైసూరులోనే కేంద్ర భారతీయ భాషా సంస్థ (సి.ఐ.ఐ.ఎల్)లో శాస్త్రీయ కన్నడ భాషాధ్యయన ప్రాశస్త్య కేంద్రం అనే సంస్థ ప్రారంభోత్సవం జరిగింది. ఎందుకంటే ఇది భాషావిషయం కాబట్టి, అప్పటికే మైసూరులో కేంద్ర ప్రభుత్వాధీనంలో ఒక భాషాసంస్థ వుంది కాబట్టి. ప్రారంభోత్సవం కన్నడ, తెలుగు రెండింటికి చేయాలని తలపెట్టినా కొన్ని పలుకుబడిగల శక్తుల ప్రమేయంతో తెలుగు కేంద్రాన్ని హైదరాబాదులో నెలకొల్పాలనే ఉద్దేశంతో ప్రారంభోత్సవంలో తెలుగును తొలగించారు. దీని వెనుక కొందరు ఎం.పిలు మరికొందరు రాజకీయ నాయకులు వున్నారు. ఆ సందర్భంలో కేంద్రమంత్రి (పురంధ్రేశ్వరి) గారిని 'తెలుగు కెప్పుడు?' అని ప్రశ్నిస్తే ఆమె 'తెలుగుకు కూడా త్వరలోనే ప్రారంభోత్సవం వుంటుంది' అన్నారు. ఈ లోపల కరుణానిధి గారి ప్రోద్భలంతోను, ఒత్తిడితోను తమిళ సంస్థను చెన్నైకి మార్చటం జరిగింది. మైసూరులో వున్న 3,4 సంవత్సరాలు బాగా నిర్వహింపబడిన తమిళ సంస్థ రాజకీయాలలో చిక్కుకొని చెన్నైకి పోయిన తర్వాత నిర్వీర్యమై కార్యక్రమాలు సరిగా జరగటం లేదు. అది చెన్నైకి మారినా 2,3 సంవత్సరాలు బిల్లులు ఆమోదించటం సంస్థకు చెందిన త్రైమాసపత్రిక ప్రచురణ మొదలైనవన్నీ మైసూరు నుంచే జరిగాయి. ఇవి రాష్ట్రప్రభుత్వం ద్వారా చేయటానికి వీలు

లేదు కనుక.

కన్నడ సంస్థ (Centre for Excellence for the study of classical Kannada) కు సంబంధించి మైసూరులో ఏమీ జరగటం లేదు, కాబట్టి బెంగుళూరుకు మార్చామని, బెంగుళూరు విశ్వవిద్యాలయంలో చోటు ఇస్తామని కన్నడ, సంస్కృతి శాఖామంత్రి (Minister for Kannada and Culture)కేంద్ర మానవవనరుల సెక్రటరీకి జాబు పంపిన తర్వాత ఇక్కడా ప్రాంతీయ నాయకుల ఒత్తిడితో మైసూరులోనే ఆ సంస్థ కోసం కొన్ని నియామకాలు జరిగాయి. ఒక సంచాలకుడు (డైరెక్టరు), ఒక కార్యాలయాధికారి (ఆఫీసు సూపరింటెండెంటు), ఒక అకౌంటెంటు, ఒక యూడీసీ, ఒక ఎల్‌డీసీ, అటెండరు లాంటి పోస్టులకు నేను చైర్మన్‌గా వున్న ఇంటర్వ్యూలో సెలెక్షన్లు జరిగి నియామకాలు జరిగాయి. ఆ తర్వాత మరికొన్ని చిన్నస్థాయి ఉద్యోగులను కూడ నియమించారు. ఉద్ధృతంగా కాక పోయినా కొంతవరకు కార్యక్రమాలు జరుగుతూనే వున్నాయి.

**తెలుగుకోసం ఏం జరుగుతున్నది?**

తెలుగు విషయానికి వస్తే ఏమీ జరగటం లేదు కాబట్టి నేను, ఆర్వీయస్ సుందరం గారు, మరికొందరు కలిసి కన్నడం వాళ్ళతో కలిగిన ప్రేరణతో ఏదో ఒకటి చేయాలని మూడుసార్లు సమావేశమై ప్రాచీనభాషపై ఒక 3 వారాల కోర్సు నిర్వహించటానికి నిర్ణయించి ద్రావిడ విశ్వవిద్యాలయ సహకారంతో పోయిన డిసెంబరు-జనవరి నెలల్లో విశ్వవిద్యాలయ కళాశాలల పాఠశాలల అధ్యాపకులకు ఒక ప్రత్యేక కోర్సు నిర్వహించాము. అందులో 80 మంది పాల్గొన్నారు. ఆంధ్ర తెలంగాణ రాష్ట్రాల నుంచి దానికి మంచి స్పందన లభించింది. ఇటువంటివి మరికొన్ని కోర్సులు చేయాలనుకొన్నా పరిస్థితులు అనుకూలించక చేయలేకపోయాం. ఆర్వీయస్ సుందరంగారు, మరొక పెన్సిల్వీనియా ఆచార్యులు కలిసి 'ఆంధ్రశబ్ద చింతామణి' గ్రంథాన్ని ఆంగ్లంలోనికి అనువదించారు. దాన్ని ప్రాచీన తెలుగు భాషా విభాగపు పైకంతోనే సి.సి.ఐ.ఎల్. సంస్థ ప్రచురించింది. మరి కొన్ని గ్రంథాలు మరికొందరికి కేటాయించబడి అనువాద కార్యక్రమం జరుగుతూనే వుంది ప్రస్తుతం.

ఈ లోపల కొందరు వ్యక్తులు ప్రాచీనభాషా విషయంలో వాళ్ళకేమీ తెలియకపోయినా సంస్థను ఆంధ్రకు తీసుకురావాలని ప్రభుత్వ పెద్దలతో మంతనాలు జరుపుతూ వున్నారు. అడపాదడపా ఈ విషయం మీద పత్రికలలో వ్యాసాలు వార్తలు పడుతూనే వున్నాయి. ఈ విషయంలో నేను 'ప్రాచీన భాషగా తెలుగుకు గుర్తింపు వచ్చిన తర్వాత చేయవలసిన దేమిటి?' అనే శీర్షికతో 2008 నడుస్తున్న చరిత్రలో సవివరంగా ఒక వ్యాసం ప్రచురించాను. దానిలో ఇచ్చిన వాటికి మరికొన్ని చేర్చవలసి వున్నది. అందులో సూచించినవి అన్నీ కాకపోయినా వాటిలోని చాలా విషయాలు అవసరమైన కార్యక్రమాలే.

అసలు ప్రాచీనభాషకు సాహిత్య అకాడమీ వారు నిర్దేశించిన అర్హతలు కార్యక్రమాలు ఏమిటి అనేది ఇప్పుడు ఆ విషయం మీద మాట్లాడుతున్న చాలామందికి తెలియదు. అది ఈనాటి తెలుగు అభివృద్ధి కోసం గాని, పాఠ్యగ్రంథాల ఆధునీకరణ కోసం గాని మరేదైనా విషయం కోసం గాని కాదు. ఈనాడు కాలక్రమేణా మరుగు పడిన, పడిపోతున్న తెలుగు భాషా సాహిత్యాలను భావితరాల వారి కోసం పరిరక్షించుకోవటం ఇందులోని ముఖ్యోద్దేశం. అందుకే భాషాశాస్త్రజ్ఞుల కమిటీవారు పరిరక్షణకు (to preserve) పరిపోషణకు (to promote) ప్రవర్ధనానికి (to propagate) అవి సూచించారు. అంటే శాసనకాలం నుంచి కొన్ని వందల యేండ్ల సంవత్సరాలు వర్ధిల్లి ప్రస్తుతం మరుగున పడుతున్న మన భాషను పరిరక్షించుకొని, వృద్ధి చేసి ప్రచారం లోనికి తీసుకురావటమన్నమాట.

కానీ, కేంద్రప్రభుత్వం వారు నూరు కోట్లిస్తామన్నారనే గాలి వార్తను పట్టుకొని దాని కోసం ప్రాకులాడటం జరుగుతున్నదిప్పుడు. ఆ మాట అధికారికంగా ఎవరూ అనలేదు. పరిశోధనలు జరుపుకోవటానికి కావలసిన ధనం మాత్రం ప్రతియేడు కేటాయించబడుతుంది. 2011 నుంచి ఇస్తూనే వున్నా తెలుగు, కన్నడాలకు ఆ ధనం ఉపయోగింపబడలేదు-కొన్ని అనివార్య కారణాల వల్ల. నూరుకోట్లు ఒక్కసారిగా లాటరీ తగిలినట్లు వస్తుందనేమో తెలుగు విశ్వవిద్యాలయం వారు ప్రాచీనతెలుగులో ఎం.ఏ.అని ఒక కోర్సును కూడా ప్రతిపాదించటమే కాక విశ్వవిద్యాలయాన్ని యు.జి.సి. నుంచి తొలగించి కొంతకాలం సాంస్కృతిక శాఖ క్రింద చేర్చారు. కేంద్రప్రభుత్వం ప్రాచీన భాషల గుర్తింపు సాంస్కృతిక శాఖ ద్వారా ప్రకటించబడింది కాబట్టి. అంటే ఇది కేవలం నూరు కోట్ల రూపాయల మహత్యం అని తేటతెల్లమవుతున్నది. ఇలాగా ప్రాచీన తెలుగు భాషాధ్యయన ప్రాశస్త్య కేంద్రం వస్తే ఏదేదో జరుగుతుందని అనుకోవటం ఊహా లోకంలో విహరించటమే.

అసలు విషయానికొస్తే రాబోయే సంస్థ నిర్మాణం ఇలా వుంటుంది. ఒక సంచాలకుడు (Director) 62 యేండ్ల వయసు దాటి వుండకూడదు. కానీ దరకాస్తుదారులు దొరకక ప్రభుత్వం కన్నడ భాషా విషయంలో 62ను 65 గా మార్చింది. ఇది తెలుగుకు కూడా వర్తించగలదు. అంటే డైరెక్టరు పోస్టుకు 65 యేండ్లు నిండిన వారు అర్హులు కారు. డైరెక్టరుకిచ్చే పారితోషికం నెలకు 70 వేల రూపాయలు. అలాగా ఈ నియమాలలోనే ఒక ఆఫీసు ముఖ్యాధికారి (ఆఫీసు సూపరింటెండెంట్), ఒక అకౌంటెంటు వుంటారు. వీళ్లు కాక ఒక అప్పర్ డివిజన్ క్లర్కు, ఒక లోయరు డివిజన్ క్లర్కు, ఒకరిద్దరు అటెండర్లు వుంటారు. ఈ పోస్టులన్నీ కూడా తాత్కాలికమైనవే. ఇందులో ఏదీ శాశ్వత నియామకం కాదు. దీనికొక ప్రాజెక్టు మానిటరింగ్ బోర్డు (Project Monitoring Board) వుంటుంది. దానికి ఛైర్మను, కేంద్ర మానవ వనరులశాఖ మంత్రి, కొందరు అధికారిక, అనధికారిక సభ్యులుంటారు. వీళ్ళ ఆధ్వర్యంలో సంస్థ నడుస్తుంది. ప్రాజెక్టులను కార్యక్రమాలను ఈ బోర్డు ప్రతిపాదిస్తుంది. వాటిని సమర్థులు, అర్హులు అయిన పండితులకు, అధ్యాపకులకు ఇచ్చి వాళ్ళకు పారితోషికాలను నిర్ణయించి కేటాయిస్తారు. ఇవి కాలపరిమితి కలిగిన ప్రాజెక్టులు.

ప్రస్తుతం కొందరు భావిస్తున్నట్లు, కోరుతున్నట్లు ఈ సంస్థ కేంద్రప్రభుత్వ అజమాయిషీ నుంచి తొలగి రాష్ట్ర ప్రభుత్వపు చేతిలోకి వస్తే అది రాజకీయాలు పుట్టగా తయారై ఎన్నో ఉన్నతాశయాలతో నెలకొల్పబడిన తెలుగు అకాడమీ, తెలుగు విశ్వవిద్యాలయంల లాగా నిర్వీర్యమై నిరాదరణకు గురై పతనం అయిపోవచ్చు.

కొత్త వార్తల ప్రకారం మునుపటి కేంద్రవనరుల మంత్రి స్మృతి ఇరానీ గారు ఈ సంస్థను ఆంధ్రలో నెలకొల్పటానికి అంగీకరించారని, దానికి ముఖ్యమంత్రిగారు 1000 గజాల స్థలం నాగార్జున విశ్వవిద్యా

# ద్రావిడసూక్తం

డా॥ఎన్.గోపి
93910 28496

కవిత

**ప**దహారు సంవత్సరాల తర్వాత
ఉక్కిరిబిక్కిరౌతూ
మళ్ళీ ఈ ప్రాంగణంలో అడుగుపెట్టాను.
గాలిలో మిగిలి వున్న
ఆనాటి కాలవీచికలు కాస్త కదిలాయి.
ఏవో జ్ఞాపకాలు
మఫ్లర్ మడతల్లా
చెంపలను నిమురుతున్నాయి.

ఆకాశం అదే
మేఘాల్లోనే తేడా.
చెట్లు నాలుగు భాషలు
మాట్లాడుతున్నట్టు
ఒక మణిప్రవాళ స్ఫురణ,
కాస్త తెలుగు, స్వల్ప కన్నడం
కొంజెం తమిళం, కొంచెం మలయాళం
ఒకేచోట దర్శనమిస్తున్న
దక్షిణాపథం

వేమన్న, బసవన్న
పెరియార్ల భవనాలు
నన్ను గుర్తుపట్టినట్టే వున్నాయి.
సీతాకోకచిలుకలు
వారి సూక్తుల్లా ఎగురుతున్నాయి.



ఆ రోజుల్లో
వేమన భవనం దగ్గర
ఓ మొక్క నాటాను
ఈ మహావృక్షాల్లో
ఏదీ ఆనాటి నా చిట్టితల్లి!

ఏపుగా పెరిగిన
ఈ తరు మరకతాల్లో
నీలమణుల్లాంటి
ఈ పువ్వుల సితాసిత ప్రకాశనాల్లో
గురువుల ఆశీస్సుల్లాంటి
ఈ కొమ్మల గొడుగుల నీడల్లో
ఎక్కడుందో నా హరిత స్వప్నం!

మరపుల మడతల్లోంచి
కొన్ని ఆకులు రాలిపడ్డట్టు
ఓ చెట్టు నన్ను చూసి
ఆప్యాయంగా నా వైపు ఊగింది.
ఎప్పటిదో పులకింతల శ్వాస
పురాతన పరిచిత స్పర్శ
హమ్మయ్య!
ఎప్పుడో పోగొట్టుకున్న కవిత
ఇక్కడ దొరికినట్టయ్యింది.

*(ప్రొఫెసర్ ఇ.సత్యనారాయణ గారికి ప్రేమతో..)*

*(2001లో కుప్పం ద్రావిడ విశ్వవిద్యాలయానికి కొంతకాలం ఇంచార్జ్ వి.సి.గా వున్నాను.
2016లో ఇటీవల ఓ సదస్సు కోసం వెళ్ళినప్పటి అనుభూతి ఈ కవిత)*

లయంలో ఇవ్వటానికి అంగీకరించారని వినికిడి. ఒకవేళ ముందటి మంత్రి అటువంటి నిర్ణయం తీసుకొని వుంటే– అది వాస్తవ పరిస్థితులను బేరీజు వేయకుండా అనాలోచితంగా తీసుకున్న నిర్ణయమే అవుతుంది. ప్రతి చిన్న విషయానికి రెండు తెలుగు రాష్ట్రాలు కీచులాడుకుంటున్న పరిస్థితులలో ఇది జరుగదు. జరుగవలసిన పనులు జరుగవలసిన రీతిలో జరుగక రాజకీయాలు స్వైరవిహారం చేస్తున్నాయి. కార్యక్రమాలు జరుగక సంస్థ దురపయోగమౌతుంది.

ఈమధ్య కేంద్రప్రభుత్వం ప్రాచీన భాషలకు సంబంధించి కొన్ని పురస్కారాలను ప్రకటించి, దానికి జులై 16వ తేదీలోపల రికమెండేషన్లు పంపమని రాష్ట్రప్రభుత్వానికి లేఖ వచ్చింది. ఆ పురస్కారాలకు వ్యక్తులు అప్లై చేసుకోకూడదట. ప్రభుత్వంగాని, సంస్థలు గాని రికమెండ్ చేయాలట. మరి ఎవరు ఈ రంగంలో పనిచేశారో చేస్తున్నారో రాష్ట్రప్రభుత్వంలోని ఎవరికెరుక? కాబట్టి అది అనామకులకు, అసమర్థులకు రాజకీయ పైరవీల పాలుకావటం మాత్రం ఖాయం. చివరితేదీ దాటిపోయింది కనుక ఇటువంటి పరిస్థితులలో నెలకొల్పబోయే ప్రాచీన తెలుగు భాషా ప్రాశస్త్య కేంద్రం రాష్ట్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో వుంటే అది ఇంకొక తెలుగు విశ్వవిద్యాలయం లాంటిది కావటం తథ్యం.

అంతేగాక ఈ కేంద్రాన్ని నాగార్జున విశ్వవిద్యాలయంలో నెలకొల్పితే తెలంగాణవారు ఒప్పుకుంటారా? ఒకే రాష్ట్రంగా వున్నప్పటి విషయం వేరు. ఇప్పుడు దీని విషయంలో తగాదాలు తప్పకుండా వస్తాయి. ఒక భాషకు ఒకే రకపు కార్యకలాపాలకు రెండు సంస్థలుండలేవు. పోనీ రెండు ప్రాంగణాలుగా చేస్తే మరి వాటి నిర్వహణ కేంద్రప్రభుత్వం నుంచి తొలగితే ఎవరు నిర్వహిస్తారు? ఇవన్నీ మునుముందు ఎదుర్కోబోయే సమస్యలు. ఇవి సంబంధిత కేంద్రమంత్రి గానీ మరొకరు గానీ కేంద్రంలో ఊహించని సమస్యలు.


**కనుక కేంద్రప్రభుత్వం ముందు తలచినట్లే ఈ సంస్థను– అన్ని హంగులతోను, భవనాలతోను, ప్రయోగశాలలతోను, స్టూడియోలతోను, ఆధునిక ముద్రణాలయంతోను, సమగ్రమైన గ్రంథాలయంతోను వున్న కేంద్ర భారతీయ భాషా సంస్థ(సిఐఐఎల్)లోనే నెలకొల్పి 2,3 సంవత్సరాల తర్వాత అప్పటి పరిస్థితులను బట్టి వేరే చోటుకి అవసరమైతే మార్చటం సమంజసం.**

*డా॥ కస్తూరి విశ్వనాథంగారు*
*మైసూరులోని సి.సి.ఐ.ఎల్ పూర్వ ఆచార్యులు, ఉప సంచాలకులు*

-డా॥మధురాంతకం నరేంద్ర
సెల్ : 98662 43659

# ఒక సాహిత్య పత్రిక కోసం

**నా**లుగేళ్లక్రితం నా రచయిత మిత్రుడొకడు పదహైదుపేజీల కథొకటిరాశాడు. 'యింతపెద్దకథను మేము ప్రచురించలేము' అంటూ కొన్ని పత్రికలు దాన్ని తిప్పిపంపేశాయి. మరికొన్ని పత్రికలు మాండలికంలో రాసిన కథలు ప్రచురించలేమని చెప్పేశాయి. విసిగిపోయిన ఆ రచయిత ఆకథను తన కథల సంకలనంలో ప్రచురించుకున్నారు. ప్రతి సంవత్సరమూ వచ్చే కథల్లో మంచి కథల్ని యెంపిక చేసి ప్రచురించే వార్షిక కథాసంకలనమొకటి ఆ కథను తమ సంకలనంలో ప్రచురించుకుంది. తరువాత చాలామంది కథకులూ, విమర్శకులూ ఆ కథ గొప్పతనాన్ని గుర్తించి సంబరపడిపోయారు. యిదంతా జరిగిన కొన్నినెలల తర్వాత ఆమిత్రుడు కాస్త అనారోగ్యానికి గురయ్యారు. ఆ సమయంలో మరేమీ చేయరానికి పాలుబోక అతను ఆ కథను తమిళంలోకి అనువాదం చేసి దాదాపు పదివేల ప్రతుల అమ్మకముండే వో మాసపత్రికకు పంపాడు. వెంటనే ఆ పత్రికవాళ్లు ఆ కథను ప్రచురించి ఆరువేలరూపాయల పారితోషికం గూడా పంపారు. దళితుల జీవితం గురించిన ఆ కథను చదివిన తమిళ దళిత సంఘాలవాళ్ళు ఆ రచయితను అభినందించడంతో బాటూ సన్మానాలు చేయడంలో పోటీపడ్డారు.





మూడేళ్ల క్రితం మరోరచయిత వో కథ రాశాడు. బాగా ప్రాచుర్యముండే వో తెలుగు పత్రికే దాన్ని ప్రచురించింది. రాయికట్టి నీళ్లల్లోకి వదిలిన కాగితాలకట్టలా ఆ కథ మన తెలుగు సాహిత్య ప్రపంచంలో మునిగిపోయింది. ఆ కథ ఆ తరువాత ఆ రచయిత కథా సంకలనంలో చేరింది. ఆ కథనప్పుడు చదివిన వుత్తరభారతదేశంలో వుండే సాహితీ ప్రేమికుడొకాయన దాన్ని హిందీలోకి అనువదించి అక్కడ బాగా ప్రాచుర్యముండే సాహిత్య పత్రికకు పంపాడు. మరో వారం రోజుల్లో ఆపత్రికతో బాటూ అయిదు వందల రూపాయల చెక్కు గూడా ఆ రచయిత కందింది. ఉత్తరభారత దేశపు హిందీ ప్రాంతాలనుంచీ డజనుమంది రచయితలు ఆ కథ తమకు భలే నచ్చిందని ఆ రచయితకు ఫోనుచేసి మరీ మెచ్చుకున్నారు.


యిదీ యిప్పటి మనతెలుగు సాహిత్యపు పరిస్థితి. మన తెలుగు రచయితలు పదిమంది యెప్పుడు యెలా కలుసుకున్నా 'ప్రపంచంలో సాహిత్య పత్రికంటూ లేని భాష తెలుగొక్కటే' అని వాపోవడం అలవాటైపోయింది. మూడుదశాబ్దాల క్రితం యిటువంటి విపత్కరమైన పరిస్థితి తెలుగులో లేదు. ఆ రోజుల్లో యే రచయితయినా- కుర్రవాడైనా, ప్రసిద్ధులైనా- కథ రాసి యే పత్రికకైనా పంపితే, రెండు మూడు నెలల్లో ఆ పత్రికనుంచీ ఆ రచయితకు ఉత్తరం వచ్చేది. ప్రచురించడానికి వర్తమానం వచ్చేది. ప్రచురించలేక పోతున్నందుకు విచారిస్తున్నామని వర్తమానం వచ్చేది. ప్రచురించలేక పోయిన కథల్నీ, యితర రచనల్నీ తిరిగి పోస్టులో పంపేవాళ్ళు. ప్రచురణకు అర్హమైన కథల్ని వరసక్రమంలో ప్రచురించే వారు. తీసుకోని రచనలను గౌరవంగా రచయితకు పంపేవాళ్ళు. మరికొద్ది రోజుల్లో ఆ రచనకు పారితోషికం గూడా అందేది. ఆ రోజుల విలువతో చూస్తే ఆ పారితోషికం పెద్దదే! యిప్పుడు పై విషయాలను చెబితే, యిప్పుడిప్పుడే రచనలు మొదలుపెట్టిన రచయితలు 'అభూతకల్పన' గానే భావిస్తారు.

ఇటీవలే విజయవాడలో కేంద్రసాహిత్య అకాడమీ అధ్వర్యంలో 'ఆంధ్రపత్రిక'ను గుర్తు చేసుకునే వుత్సవాలు జరిగాయి.

నా సాహిత్యయాత్ర అయిదు దశాబ్దాల క్రితం వో మారుమూల పల్లెటూరి గుడిసెలోంచి ప్రారంభమయ్యింది. ఆ యింట్లో పెద్ద భోషాణం వుండేది. పైన తలుపు మూసేస్తే అదే మంచం. ఆ భోషాణం నిండా వుస్తకాలుండేవి. ప్రతి పుస్తకానికీ అట్టలు గూడా వేసి వుండేవి. అవన్నీ భారతి మాసపత్రికలూ, ఆంధ్రపత్రిక ఉగాది సంచికలు. 1996లో తనకు కేంద్రసాహిత్య అకాడమీకి మా నాన్నగారు తనని యిలా పరిచయం చేసుకున్నారు- "1947నుంచీ నేను ఆంధ్రపత్రిక పాఠకుడ్ని. ఆ తరువాత 'భారతి' పత్రిక పరిచయమైంది. భారతి పాత పత్రికలు గూడా చదవడం మొదలు పెట్టాను. పాత రోగేవైద్యుడైనట్టుగా కాలక్రమంలో పాఠకుడ్నయిన నేను క్రమంగా రచయితగా మారినట్టున్నాను. 'కథలన్నీ కంచికి చేరాయి' అని తెలుగులో సామెత. అయితే నేను రచయిత నయినప్పుడు మాత్రం కథలన్నీ 17, తంబుచెట్టివీధి, మదరాసు అనే చిరునామాకే చేరేవి. తాము ప్రచురించే కథల ద్వారా మంచివేవో నిరూపిస్తూ, తిప్పిపంపడం ద్వారా కథలెలా వుండగూడదో తెలుపుతూ, పాఠకులు యెదురు చూస్తున్నారు కథలు పంపమని వుత్తరాలు రాస్తూ, వారపత్రికకు పంపిన కథను భారతిలో ప్రచురించదగినదని ప్రోత్సహిస్తూ, ప్రత్యేక సంచికకు కథ పంపమని కోరుతూ, మీ కథవల్ల మా పత్రిక గౌరవం పెరిగిందని వినయంగా రాస్తూ- యిలా ఆంధ్రపత్రికా కుటుంబం కొత్తరచయితల్ని తయారు చేయడమన్న ప్రయోగంలోంచి కథకుడినేనని చెప్పుకోడానికి గర్విస్తున్నాను".

శివలెంక శంభుప్రసాద్‌గారి సంపాదకత్వంలో ఆంధ్రపత్రిక వారపత్రిక, భారతి వెలువడిన కాలం తెలుగు పత్రికా సాహిత్య కాలంలో గొప్ప స్వర్ణయుగం. తన కలల్ని సాకారం చేయగల గొప్ప అల్లుడ్ని పొందడం కాశీనాధుని నాగేశ్వరరావుగారి అదృష్టం. 1930-32 ప్రాంతాల్లో శంభుప్రసాద్‌గారు శాంతినికేతనంలో చదువుకున్న




ప్పుడు విశ్వకవి రవీంద్రనాథ టాగూరు అక్కడే వున్నారు. ఆయన సాహిత్యాభిరుచులపైనా, చదువూ సంస్కారాలపైనా రవీంద్రుడి ప్రభావం తప్పకుండా పడే వుంటుంది. కాశీనాథుని నాగేశ్వరరావుగారి కుమార్తెను పెళ్ళాడిన తర్వాత, 1938లో శంభుప్రసాద్‌గారు భారతి, ఆంధ్రపత్రికల బాధ్యతను తీసుకున్నారు. తమ మామగారి దాతృత్వం వల్ల జరిగిన ఆర్థిక లోటును పూడ్చడంతోపాటు, పత్రికల స్థిరత్వానికి కూడా ఆయన కృషి చేయవలసిన పరిస్థితి అది. రెండవ ప్రపంచ యుద్ధం జరుగుతున్న సమయంలో మదరాసులో బాంబులు పడవచ్చు నన్న భయంతో తన కుటుంబాన్ని విజయవాడకు పంపవలసివచ్చినా శంభుప్రసాద్‌గారు మాత్రం అక్కడే వుండి పత్రిక ఆగిపోకుండా రావ డానికే ప్రాముఖ్యత నిచ్చారు. తూర్పు, పడమటి ప్రపంచ దేశాల గొప్ప రచనలనంతా శ్రద్ధగా చదువుకున్న గొప్ప సాహితీ ప్రేమికుడా యన. ఆయనకు సంగీతమంటే గూడా యిష్టం. సితారు వాయించే వారట!

ఒక ఆంధ్రపత్రిక ఉగాది ప్రత్యేక సంచిక సంపాదకీయంలో శంభుప్రసాద్‌గారు "సాహిత్యం రాజకీయాల గురించి పట్టించుకుం టుంది గానీ అది రాజకీయాల కోసం కాదు. విస్తృతమైన సార్వజనీయ మైన అంశాలను వట్టించుకునే సాహిత్యాన్ని సమకాలీన సంకుచిత తాత్కాలిక విలువలకు బంధించడం తప్పు. అది బానిసత్వం కింద లెక్క" అని రాశారు. చాలా సహనంగా వినయంగా వుండే శంభు ప్రసాద్‌గారు 'భారతి'ని విమర్శిస్తే మాత్రం మండిపడేవారు. సాధారణ పాఠకుల్ని గూడా ఉత్తమ సాహిత్యకారులుగా తీర్చిదిద్దేలా ఆయన తన పత్రికల్ని తీర్చిదిద్దారు. సాహిత్యాన్ని గురించి మాత్రమే గాకుండా, లలితకళలు, చరిత్ర, ఆర్థికశాస్త్రం, భౌతిక రసాయన శాస్త్రాల వంటి అనేక ముఖ్యమైన విషయాలను గురించిన వ్యాసాలను ఆయారంగా లలో సుప్రసిద్ధులైన వాళ్ళచేత రాయించి ప్రచురించేవాడాయన.

తెన్నేటి సూరి 'చంఘిజ్‌ఖాన్' శారద నవలలూ, మార్క్‌ట్వయిన్ నవలల తెలుగు అనువాదాలూ ఆంధ్రపత్రిక వారపత్రికలోనే వచ్చాయి. భారతి, ఆంధ్రపత్రిక ఉగాది సంచికలు లేకపోయి వుంటే వసుంధరాదేవి, బుచ్చిబాబు వంటి రచయితలకు సరైన పత్రికే వుండేదిగాదు. ఓ సారి శంభుప్రసాద్ గారు వో రచయితకిలా ఉత్తరం రాశారు– "ప్రతినెలా భారతికి కావల్సిన అనేకరకాల రచనల్ని సంపా దించుకోవడం చాలా కష్టంగా వుంది. ఒకోసారి భారతికి నేను తగిన సంపాదకుడ్ని గానేమోనని పిస్తోంది. అయితే యితర పత్రికల్లో సైతం నాకు విలువైన రచనలేవీ కనిపించడం లేదు" గొప్ప సాహిత్యాభినివేశం వున్న వ్యక్తి మాత్రం ఆ మాటలు అనగలడు.

ఆర్.ఎస్.సుదర్శనంగారి "సాహిత్యంలో దృక్పథాలు" శంభుప్రసాద్‌గారే అడిగి రాయిం చుకున్న వ్యాసాలని వసుంధరా దేవిగారు చెప్పారు. రాయవలసిన అంశాన్ని సూచించిన తర్వాత, వరసగా ఆ వ్యాసాలన్నీ రాసేలా సుదర్శనం గార్ని చివరి వరకు ప్రోత్సహిస్తూనే వచ్చారాయన. మొదటి వ్యాసాన్ని ప్రచురించిన తర్వాత "మీరు విశ్వనాథ పైన రాసిన వ్యాసం చాలా నిర్మోహతతో బాటూ సమతూకంగా వుందని విజ్ఞులు భావిస్తు న్నారని తెలియజేయడానికి సంతోషిస్తున్నారు" అని సుదర్శనంగారికి ఉత్తరం రాశారు. తాను చలం గురించి రాసిన వ్యాసాన్ని చలంగారికి పంపమని సుదర్శనంగారు శంభుప్రసాద్ గారిని కోరారట. వెంటనే శంభుప్రసాద్‌గారు "చలంగారు భారతిని క్రమం తప్పకుండా చదవక పోతే ఆయనకే నష్టం. మీరుగానీ నేను గానీ ఆ విషయాన్నాయనకు ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు. ఆయన మిత్రులెవరైనా ఆయనకు తప్పకుండా చెప్పేవుంటారు" అని సుదర్శనం గారికి రాశారు. భారతి రజతోత్సవ సంచికకు చలంగారిని కథ పంపమని కోరుతూ శంభు ప్రసాద్‌గారు ఉత్తరం రాశారు. "భారతికి యిన్నాళ్ళవరకూ అవసరం లేని చలం యిప్పుడవసరమొచ్చాడే?" అని సమాధానమిచ్చారట చలం. "అవును, భారతికిప్పుడు మీ రచన తప్పకుండా కావాలి" అని మళ్ళీ శంభుప్రసాద్‌గారు ప్రత్యుత్తరం రాశారట! అప్పుడు రాసిన కథే "ఓ పువ్వుపూసింది."

తన "సాహిత్యంలో దృక్పథాలు" పుస్తకాన్ని సుదర్శనంగారు శంభుప్రసాద్‌గారికి అంకితమివ్వాలనుకున్నారు. కానీ శంభుప్రసాద్ గారు "నేనా గౌరవానికి తగిన వాడినని అనుకోవడం లేదు. ఎందు కంటే భారతిని తీసేస్తే నాలో మిగిలేదేమీ వుండదు. కావాలంటే మీరు భారతికి అంకితమివ్వడమే సబబుగా వుంటుంది" అని సమా ధానమిచ్చారు. శంభుప్రసాద్‌గారు కీర్తిశేషులైన తర్వాత సుదర్శనం గారు పుస్తకాన్ని శంభుప్రసాద్‌గారికే అంకిత మిచ్చారు.

విద్వాన్ విశ్వం, పురాణం సుబ్రహ్మణ్యశర్మ, వాకాటి పాండు రంగారావు, ఎం.రాజేంద్ర వంటి సంపాదకులు పత్రికల్ని చూస్తున్న కాలంలో తెలుగు కథానిక పూర్తి వికసనాన్ని పొందింది. అయితే "ఏవి తల్లీ నిరుడు కురిసిన హిమసమూహములు?"

ఆ మధ్య వొక ప్రముఖ భారతీయాంగ్ల నవలా రచయిత 'నవల' చనిపోయిందని దుమారం లేవదీశాడు. నవలల పుట్టుక పత్రికల పుట్టుకతో సమాంతరంగా సంభవించింది. తొలినాటి నవలలన్నీ సశేష నవలలుగా పత్రికల్లో చాలా నెలలపాటూ ప్రచురించబడినవే! ప్రముఖ యింగ్లీషు నవలా రచయిత చార్లెస్ డికెన్స్ తన నవలల్ని ప్రచురించుకోవడం కోసం తానే వొక పత్రికను స్థాపించుకున్నారు.

*(తరువాయి 21వ పుటలో..)*

-కీ.శే. ఎస్.మలయాండి

# తెలుగే ప్రాచీనం



అవును. తెలుగే ప్రాచీనం. తుంగభద్రలోయ సంస్కృతి మీద విశేష పరిశోధన చేస్తే ఈ సంగతి ధృవపడుతుంది. కాని, భాష, చరిత్ర, మన సంస్కృతి పట్టని మనకు, మన ప్రభుత్వాలకు పరిశోధన చేసేంత ఓపిక ఉందా? పాఠశాలల్లో, కళాశాలల్లో తెలుగు పట్ల నిబద్ధత లేని మనం, ఇంత పనిని చేపట్టగలమా? తెలుగువారి చరిత్ర పూర్వాపరాలను శోధించి, గ్రంథస్థల చేయవలసిన విశిష్ట కార్యక్రమం సంగతి అటుంచి, కనీసం తెలిసిన చరిత్ర నయినా విద్యార్థులకు బోధించే ప్రయత్నం ఎంతవరకు చేస్తున్నాం మనం? ఇప్పుడు వీస్తున్న కొత్తగాలులు ఈ అంశాన్ని కూడా స్పృశించాలి. అందుకే **1981 ఏప్రిల్ 14-18లలో** కొలాలంపూర్ (మలేసియా)లో జరిగిన రెండవ ప్రపంచ తెలుగు మహాసమ్మేళనం సందర్భంగా ప్రచురించిన ప్రత్యేక సంచిక నుండి ఒక విశిష్టమైన వ్యాసాన్ని ఇక్కడ ప్రచురిస్తున్నాం. ఎస్.మలయాండి ఆంగ్ల వ్యాసానికి తెలుగులో డా॥దుగ్గరాజు శ్రీనివాసరావు సంక్షిప్తీకరణ ఇది. ఇరవై రెండేళ్ల క్రితం ప్రచురితమైన యీ వ్యాసాన్ని భాషా పరిశోధకులు ఎందరు చదివారు? చదివినవారు పట్టించుకున్నారా? ఏమో!.... -సంపాదకుడు

**మ**నిషి పుట్టుక. పరిణామం గురించి పరిశోధన చేసిన ఛార్లెస్ డార్విన్‌తో కలిసి పనిచేసిన థామస్‌హక్స్లే, మానవుడు (జంతు శాస్త్రనామం హోమోసెపెయన్) ఒక జీవజాతిగా సముద్రంలో మునిగి పోయిన లెమూరియా ఖండంలో పరిణమించాడని భావించాడు (ది రిడిల్స్ ఆఫ్ త్రీ ఓషన్స్, ఎలెక్సాండర్ కోంద్రటోన్, పుట 128) ఈ అభిప్రాయాన్నే ఫ్రిడ్రిక్ ఏంజల్స్ తన పుస్తకం 'ది రోల్ ప్లేయడ్ బై లేబర్ ఇన్ ది ట్రాన్సిషన్ ఫ్రమ్ ఏప్ ఇన్‌టు మ్యాన్'లో ఇలా ప్రస్తావించాడు. "అనేకవందల వేల సంవత్సరాల క్రితం (ప్రస్తుతానికి దాని కాలం నిర్ధారణ కానియుగం) భౌగోళిక శాస్త్రవేత్తలు టెర్షియరీ కాలంగా చెప్పే యుగాంతంలో, ఒక బాగా అభివృద్ధి చెందిన వానరుల వంటి మానవులు- నేటి హిందూ మహా సముద్రంలో మునిగిపోయి వున్న ఉష్ణమండల ఖండం గోండ్వానా/లెమూరియాలో వివసించారు. సర్ టి.డబ్ల్యు. హోల్డర్‌నెస్ తాను రాసిన పీపుల్స్ అండ్ ప్రాబ్లమ్స్ ఆఫ్ ఇండియా ఛాప్టర్ 1.పుట 23లో ఈ విషయాన్ని ధృవీకరిస్తూ యిలా వ్రాశాడు.

"దక్కను పీఠభూమి గంగానదీ ప్రాంతంకన్నా హిమాలయాల కన్నా భౌగోళికంగా భిన్నమైనది. ఒకనాడు ఆఫ్రికాఖండం వరకు విస్తరించివున్న గోండ్వానా/లెమూరియా ఖండంలోని మిగిలిన భాగం ఈ దక్కను పీఠభూమి. నేడు హిందూ మహాసముద్రం విస్తరించిన మేర ఈ ఖండం వుండేది. మిగిలిన ఖండం మునిగిపోయింది కాని దక్కన్ పీఠభూమి ఒక్కసారి కూడా ముంపుకు గురి కాలేదు. అనేక ప్రాంతాలలో ఈ పీఠభూమి మీద నల్లని బ్లాక్‌ట్రాప్‌రాక్ లేదా బసాల్ట్‌గా వుంది. ఇది ఒకనాడు ప్రవహించిన అగ్నిపర్వతాల లావా. కాబట్టి దక్కను పీఠభూమి భూగోళపు అతి పురాతన ప్రాంతం. జీవుల ఆవిర్భావానికి ముందు నుండి వున్నటువంటిది. నాటినుండి నేటివరకు పెద్దగా మార్పు చెందని భౌగోళిక ప్రాంతం యిది"

మానవ వికాసానికి సంబంధించిన అతి పురాతన అవశేషాలు చిత్తూరు జిల్లా రేణిగుంట ప్రాంతంలోని ఆదిరామపాకంలోని రాళ్ళ కాలవలో, కర్నూలు జిల్లాలోని పలుప్రాంతాలలో జరిగిన త్రవ్వకాలలో బయటపడ్డాయని ప్రొఫెసర్ హెచ్.డి. సంకాలియా అన్నారు.

"నా దృష్టిలో అతిముఖ్యమైన ప్రాంతాలు మద్రాసు, కర్నూలుజిల్లా లోనివి. అరవై సంవత్సరాల క్రితం ఈ ప్రాంతాల్లో రాబర్ట్ బ్రూస్‌పుట్ మెరుగైన వనిముట్లనే కాక, ఎముకలతో నిర్మించిన చిత్రాలను కనుక్కున్నాడు. ఆనాడు ఫ్రాన్స్ గుహల్లో కనుగొన్న చిత్రాలకు వీటిని పోల్చారు. ఆ గుహల కాలాన్ని అప్పర్‌పాలియోలిథిక్ కాలమని పురాతత్వశాఖ వారన్నారు. అయితే దురదృష్టవశాత్తు రాబర్ట్ పుట్ సేకరణ లన్నీ కనిపించకుండా పోయాయి. కాని త్రవ్వకాలలో నేడున్న నవీన విధానం ఉపయోగించి కర్నూలుజిల్లా, కొంతమేర చిత్తూరుజిల్లా, మద్రాసు ప్రాంతం గుహల్లో త్రవ్వకాలు జరిపితే వేటలో నైపుణ్యం పొందిన మానవుడి జీవన విధాన సాక్ష్యాలు బయటపడతాయి" అని ప్రొఫెసర్ సంకాలియా అభిప్రాయం.

**తుంగభద్రలోయ నాగరకత**


సంకాలియా ఇచ్చిన ఆధారాన్ని పట్టుకుని కర్నూలులో నివసించే ఒక మలయాళీ సాధువు అతి పురాతన కుడ్యచిత్రాలను కర్నూలులోని గుహలలో కనుక్కున్నాడు. ఈ గుహలన్నిటినీ సిద్ధుల పేరుతో పిలుస్తుంటారు. కర్నూలు తాలూకాలోని కేతవరంలో సిద్ధులగుహ, చిన్నసిద్ధుల, పెద్దసిద్ధుల గుహలు నంద్యాల తాలూకాలో, సిద్ధుల గుట్ట ద్రోణాచలం తాలూకాలో వున్నాయి. సిద్ధులు అతి పురాతన ద్రావిడ పుణ్య పురు

షులు. పురాతన శైవ చింతన విధానం సిద్ధాంతం. ఇది తెలుగునేల అందించిన ప్రత్యేకం. ఆ తర్వాత సిద్ధాంతమార్గం మరింత దక్షిణాదికి నెట్టబడింది. తెలుగునేలను గతంలో త్రిలింగదేశమనేవారు. తెలుగు అనే పదం త్రిలింగ నుండి వచ్చినదే. ఈ త్రిలింగాలు నేటికీ ద్రాక్షా రామం, కాళేశ్వరం, శ్రీశైలంలో విలసిల్లుతున్నాయి.

కర్నూలు జిల్లాలో కనుక్కున్న చిత్రాలు గల గుహలన్నీ పురాతన శైవకేంద్రాలైన కాల్వబుగ్గా, బుగ్గేశ్వరమ్ వంటి వాటికి దగ్గరలో వున్నాయి. ఆ గుహలలోని చిత్రాలలో మతానికి సంబంధించినది ఒక సిద్ధుడి ధ్యానముద్ర. ఇటువంటి చిత్రమే సింధునదీలోయ నాగరికతా కేంద్రాలలో కన్పిస్తాయి. ఇక్కడి గుహల గోడలమీద చెక్కిన లిపి సింధులిపిని పోలి వుంది. అలగ్జాండర్ కోంద్రటోవ్ తన పుస్తకంలో "భాషా సంబంధిత సమాచారం ప్రకారం ద్రవిడభాషలు దక్షిణాది నుండి ఉత్తరాదికి వ్యాప్తి చెందాయి. కాని ఉత్తరాది నుండి దక్షిణాదికి వ్యాప్తి కాలేదు" అన్నాడు. నేడు ద్రవిడ భాషలను దక్షిణ భారతదేశంలో $18^0$-$20^0$ అక్షాంశాల మధ్య భాగంలో మాట్లాడుతున్నారు కాని ఒకనాడు మధ్య, ఉత్తర భారతంలో కూడా విరివిగా మాట్లాడేవారు. అంతేకాదు, లభించిన సాక్ష్యాధారాల ప్రకారం కొన్ని వేల సంవత్సరాల క్రితం ద్రవిడభాషలు బెలూచిస్థాన్, దక్షిణ ఇరాన్‌లలో కూడా మాట్లాడేవారు.

**సింధులోయ నాగరికత**

భారతీయ ఆంత్రపాలజిస్టులు సింధులోయ లిపి, నాటి మానవులు తిన్న చేపలు, బలి ఇచ్చిన ఇతర జంతువుల ఎముకల అధ్యయనం చేశారు. అయితే దీనికి సరైన విజ్ఞానశాస్త్ర ఆధారాలు లేవు. మొహంజదారో, హరప్పాలో కనిపించిన 'చిత్రలిపి' ఒక పురాతన లిపి అని ప్రపంచవ్యాప్త పండితులు అంగీకరిస్తున్నారు. కాని, ఆ లిపిని అర్థం చేసుకోవటంలోనే భిన్నాభిప్రాయాలున్నాయి. సోవియట్ పరిశోధకులు కంప్యూటర్‌ని ఉపయోగించి ఆ లిపులను స్టాటిస్టికల్‌గా విశ్లేషించి ఆ భాష యొక్క వ్యాకరణం తేల్చపోయాడు. ఆ భాషను 'x' భాష అన్నారు. భారతీయభాష లిపులకు ముందు రూపం అది. ఆ తర్వాత 'x' భాషని ఇతర భాషలతో పోల్చి చూశారు. చిత్రలిపిని కనుక్కున్న తర్వాత ఈ భాషని ప్రపంచంలోని పలు ప్రఖ్యాత భాషలతో పోలుస్తూ అనేక కొత్త సిద్ధాంతాలను ప్రతిపాదించారు. ఆ పోలికను భారతదేశంలోని భాషలు, ఆసియా మైనర్‌లో మాట్లాడేవి, హిమాలయ పర్వతభాషలు, చివరికి స్వెటీరియా ప్రాంతంలోని ఎన్సియ్‌నది ప్రాంతంలోని కెట్స్ తెగవారు మాట్లాడేభాష. పసిఫిక్ సముద్రంలోని ఈస్టర్‌ద్వీపం ప్రజల భాషలన్నింటితో పోల్చారు. సంస్కృతం, హిట్టైతి, రసాను ఇంకా ఎన్నో భాషలలో పోల్చి కుదరక వదిలేశారు. చివరికి భారతదేశపు అత్యంత ప్రాచీన నాగరికత నిర్మించిన భాష ఏదనేందుకు మిగిలింది ద్రవిడభాషలు మాత్రమే. ఈ భాషల లిపి నిర్మాణం 'x' భాషకి అతి దగ్గరలో వుంది. అతి పురాతన భారతీయ సంస్కృతిని నిర్మించింది ద్రవిడ భాషీయులనే సిద్ధాంతాన్ని ప్రతిపాదించిన పండితులకు యిది సాక్ష్యంగా సహాయపడింది. ఈశాన్య భారతంలో అనేక ఇండోయూరోపియన్ భాషల తాకిడికి తట్టుకుని 'బ్రాహి' అనే ద్రవిడ భాష నిలిచి వుంది. అనేకవేల సంవత్సరాల గతం గల ఈ దేశంలో ఒకనాడు అన్ని ప్రాంతాలలో ద్రవిడభాష మాట్లాడే ప్రజలే నివసించి వుండే అవకాశముంది.



మానవ నాగరికతకు పట్టుగొమ్మగా భావించే మునిగిపోయిన లెమూరియాఖండం గురించి అలెగ్జాండర్ కోంద్రటావ్ "ఆశ్చర్యం ఏమిటంటే ప్రపంచంలోని అతి పురాతన నాగరికతలు మూడింటిలో రెండు –ద్రవిడ భాషలు మాట్లాడేవారికి చెందినవి కావటం" అన్నాడు.

**రెండు నాగరికతల పోలికలు**

తుంగభద్ర లోయ నాగరికతలకు సాక్ష్యాలుగా కర్నూలుజిల్లా గుహల గోడల మీద దొరికిన చిత్రలిపి అతి ప్రాచీన తెలుగులిపి, మహంజదారో, హరప్పాలలో దొరికిన లిపి ఒక్కలాంటిదేనని రుజువైంది. (ఆ పోలికల వివరాలు ఒకటవ అనుబంధంలో చూడవచ్చు)

ఆ రెండు లిపులే కాక ఆ తర్వాత లిపుల మధ్య కూడా పోలికలున్నాయి. అయితే ఈ లిపుల మధ్య వున్న సంబంధ బాంధవ్యాలను పరిశోధకులు మరింత శోధించాల్సి వుంది. కాని సింధునాగరికతలోని లిపులలో అధికభాగం పురాతన తెలుగు, తమిళ లిపులను పోలివుందనేందుకు తగిన ఆధారాలున్నాయి. పురాతన తెలుగు, తమిళాలు

సంస్కృతం కన్నా ముందున్నవనే వాటిలో సందేహం లేదు. ఆ భాషలు హిందుస్థాన్ మొత్తం ఒకనాడు వ్యాప్తి చెందినవని అనటం అసమంజసం కాదు" (మాన్యువల్ ఆఫ్ అడ్మినిస్ట్రేషన్ ఆఫ్ ది మద్రాస్ ప్రెసిడెన్సీ వాల్యూమ్ 1. పే 43)

ప్రఖ్యాత భారతీయ లింగ్విస్ట్ ఎస్.కె.చటర్జీ ఈ విషయం అంగీకరించాడు. "ఆంధ్రులు లేదా శాత వాహన చక్రవర్తులు, ఒరిస్సాలోని సెటి వంశం (క్రీ.పూ. 2వ శతాబ్దం) వారు ఒక రకమైన పురాతన తెలుగు భాషను మాట్లాడేవారు. ఖారవేలుడనే రాజు పేర వున్న శాసనంలో వున్న భాష పురాతన తెలుగు. ఆయన పేరు రెండు ద్రవిడపదాల మిశ్రమం. ఖారవేలుడు పేరులోని ఖార అంటే నలుపు, వేలు అంటే బల్లెం అని అర్థం. మనం తెలుసుకోవాల్సిన మరో అంశం మహంజదారో, హరప్పాలోని ప్రజలు తెలుగు, తమిళ ఇతర దక్షిణాది ద్రవిడ ప్రజలకు చెందినవారు" (లాంగ్వేజ్ అండ్ లిటరేచర్ ఆఫ్ మోడరన్ ఇండియా, పుటలు 271-272)

**ఇక్ష్వాకుల ప్రాకృతం పురాతన తెలుగు నుండి పుట్టింది. ఇది కర్నూలు జిల్లా ఆలూరు తాలూకాలో రెండుచోట్ల లభించిన శాసనాల భాషకు సంబంధం కలిగి వుంది. మన దేశంలో దొరికిన అత్యంత ప్రాచీన శాసనంగా దానిని పరిశోధకులు అంగీకరించారు. అంత విస్తృత శాసనాన్ని ఆ రోజుల్లోనే తెలుగువారు రాశారంటే వారు బాగా అభివృద్ధి చెందిన భాష మాట్లాడుతూ, వ్రాస్తూ వుండి వుండాలి. ఒకవైపు వేదాలు ఉత్తరంలో, తమిళ సంగమ సాహిత్యం దక్షిణాదిన రూపుదిద్దుకుంటుంటే ఘనచరిత్ర, భాష కలిగిన తెలుగువారు అన్ని శతాబ్దాల పాటు నోరు మూసుకుని కూర్చుని వుంటారంటే నమ్మటం ఎలా? ఒక సంస్కృతి లేదా సాంప్రదాయాన్ని అణగదొక్కాలంటే ఖచ్చితంగా దాని భాషను రూపుమాపాలి. అది ఎలా సాధ్యమైంది?**

**అంతుపట్టని ఎడం.... వివరణ**

ఆర్యులకు ముందు భాషలున్నాయి. మతాలున్నాయి. తెలుగు వారి సిద్ధాంతశైవం, తమిళుల వైష్ణవం (మాలియం అంటారు) ప్రాకృతజైనం, పాలి హీనయాన బౌద్ధాలన్నీ ఆర్యులకు ముందువి. ఆర్యేతరమైనవి. ఎ.ఎ.మెక్డోనెల్ ప్రకారం "వేదశ్లోకాలు రూపుదిద్దుకుంటున్న రోజుల్లోనే మరో ప్రజల భాష, సాహిత్య భాషకు భిన్నమైనది, మాట్లాడేతీరులో తేడా వున్న భాష ఒకటి వుండి వుంటుంది. వేద శ్లోకాలలో భిన్నంగా పలికిన పదాలున్నాయి. వీటిని వేద రూపకల్పులు మరో భాష నుండి తీసుకుని వుండాలి. ఆ ప్రత్యేకభాష దక్షిణ ప్రాంత బౌద్ధానికి పవిత్రభాష అయిన 'పాలి' అయివుంటుంది... శాసనాల వల్ల సంస్కృత భాష క్రమంగా స్థానిక బ్రాహ్మణేతరులు మాట్లాడే భాషల స్థానాన్ని ఆక్రమించిందని తెలుస్తుంది. దక్కనుప్రాంత ఆర్యేతర భాషలైన ద్రవిడ భాషలను (తెలుగు, కన్నడ, మలయాళం, తమిళం) ఆర్యభాష మింగేయలేదు. ప్రాకృత, పాలి భాషలకు, తెలుగు, కన్నడ, సింహళ భాషలకు మధ్య వున్న పోలిక నేటికీ కనిపిస్తుంది. సింహళ భాష పాలి నుండి వచ్చింది. ఆర్యులకు ముందున్న నాగరికత, మతాల గురించి అలెగ్జాండర్ కోంద్రటోవ్ యిలా వ్యాఖ్యానించాడు.

"దశాంశ సంఖ్యామానాన్ని భారతీయులే కనుక్కున్నారు. అయితే అది ఆర్యులు కాక ఆర్యులకు ముందున్నవారు కనుక్కున్నారు. ఆర్యుల దండయాత్రకు అనేక శతాబ్దాల క్రితమే నాటి వ్యాపారులు, గణితశాస్త్ర అధ్యయనకారులు ఆ విధానం వాడుతున్నారు. భారతదేశ ఆర్యచరిత్ర తొలి కాలంలో శక్తివంతమైన రాజ్యపాలకులకన్నా బ్రాహ్మణుల ఆధిపత్యం వుండేది. వారు దైవ స్వరూపాలుగా చెప్పుకునేవారు. కొత్తగా ఆ ప్రాంతాలు ఇతరుల పాలనలోకి వెళ్ళినా ప్రజలు తమ మత విశ్వాసాలను రహస్యంగా అనుసరించేవారు. అయితే క్రీ.పూ. 6వ శతాబ్దంలో మతపరవిశ్వాసాల్లో తీవ్ర సంక్షోభం ఏర్పడి పాత విశ్వాసాలను ప్రశ్నించటంతో బ్రాహ్మణమతం స్థానంలో బౌద్ధ, హిందు, జైనమతాలకు పునాది ఏర్పడింది" (రిడిల్ ఆఫ్ ది త్రీ ఓషన్స్ పుట 181)

"అశోకుడి ప్రాకృతభాష, తెలుగు భాగాన్ని పాలించిన ఇక్ష్వాకుల ప్రాకృత భాష ద్రవిడ ప్రాంతంలో అధికార భాషగా చలామణి అయ్యాయి" అంటాడు భాషాశాస్త్రవేత్త ఎస్.కె.చటర్జీ. ఇక్ష్వాకుల ప్రాకృతం పురాతన తెలుగు నుండి పుట్టింది. ఇది కర్నూలు జిల్లా ఆలూరు తాలూకాలో రెండు చోట్ల లభించిన శాసనాల భాషకు సంబంధం కలిగి వుంది. మన దేశంలో దొరికిన అత్యంత ప్రాచీన శాసనంగా దానిని పరిశోధకులు అంగీకరించారు.

ఇక్ష్వాకులకు అధికారభాష వుంటే ఆ భాషలో కొంత సాహిత్యం వుండాలి కదా! అంత విస్తృత శాసనాన్ని ఆ రోజుల్లోనే తెలుగువారు రాశారంటే వారు బాగా అభివృద్ధి చెందిన భాష మాట్లాడుతూ, వ్రాస్తూ వుండి వుండాలి. ఒకవైపు వేదాలు ఉత్తరంలో, తమిళ సంగమ సాహిత్యం దక్షిణాదిన రూపుదిద్దుకుంటుంటే ఘనచరిత్ర, భాష కలిగిన తెలుగువారు అన్ని శతాబ్దాల పాటు నోరు మూసుకుని కూర్చుని వుంటారంటే నమ్మటం ఎలా? సింధూనాగరికత కాలం నుండి 11వ శతాబ్దంలో నన్నయభట్టు సంస్కృతానికి పరిచయం చేసేవరకు తెలుగువారేమయ్యారు? గాఢనిద్రలో మునిగి వున్నారా? ఈ ప్రశ్నకు సమాధానం తిరిగి ఎస్.కె.భట్టాచార్య మాటలలోనే వినాలి.

"నన్నయ్య భట్టారకుని తొలి తెలుగు కవిగా చెప్పటానికి కారణం ఆయన రచనలు మాత్రమే భద్రపరచటం. 11వ శతాబ్దానికి ముందు తెలుగులో జైనసాహిత్యం వుందనే విశ్వాసం వున్నా సరైన ఆధారాలు లేవు. తమిళ, కన్నడ భాషల్లో ఇటువంటి ఆధారాలున్నాయి. నన్నయ్యను 'వాగనుశాసనుడు' అంటారు. తెలుగుభాషను సంస్కరించిన వాడని అర్థం. ఇది బ్రాహ్మణ మతాన్ని తిరిగి తెచ్చే ప్రయత్నంగా చేసి వుండవచ్చు. ఆ తర్వాత అచ్చతెలుగు, శుద్ధతెలుగు ఉద్యమం ఆరంభమైనది వాస్తవమే కదా! ఈ ఉద్యమం ప్రాకృతభాష పదాలను తీసుకునేందుకు చూపిన ఇష్టత, సంస్కృతపదాలను తీసుకోవటానికి చూపలేదు. అదే సమయంలో అదే భాషాస్వచ్ఛత ఉద్యమం కన్నడంలో కూడా వచ్చింది. తెలుగును సంస్కరించే ప్రయత్నం వాగనుశాసనుడు, ఆయన వంటి ఇతరులు ఎందుకు చేశారు. ఆ ప్రయత్నం ఎందుకు విఫలమైంది. పాలి, ప్రాకృత భాషలకు పట్టిన గతే పురాతన తెలుగుకు పట్టినందునే ఆ ప్రయత్నం చేశారా? ఒక సంస్కృతి లేదా సాంప్రదాయాన్ని అణగదొక్కాలంటే ఖచ్చితంగా దాని భాషను రూపుమాపాలి. అది ఎలా సాధ్యమైంది? ప్రపంచ ప్రఖ్యాత తత్త్వవేత్త విల్ డ్యూరాంట్ ఈ దేశంలో కొందరు స్వప్రకటిత పండితుల శక్తులను ప్రస్తావించాడు. "కొత్త తరంలోని విద్యాధికులుగా, జాతిచరిత్రను, సాహిత్యం, చట్టాలను మౌలికంగా ముందుతరాలకు అందించేవారు

గళాన్ని, భవిష్యత్తును కూడా తమకు అనుకూలంగా మలచుకుని దైవ ప్రతినిధులుగా తమ ఖ్యాతిని విస్తరించుకున్నారు. తమ కుల విలువను పెంచుకుని, రాబోయే శతాబ్దాలలో హిందూ సమాజంలో తమకు అత్యున్నత స్థానం నిలిచేలా చేసుకున్నారు.

భారతీయ భాషలు, మతాల మీద సంస్కృతభాష ప్రభావం ఒక్కొక్క తరంలో ఒక్కొక్కలా సాగింది. ఉదాహరణకు నవనందులు 91 సంవత్సరాలు పాలించారు. కాని సంస్కృత పండితులు వీరి 91 సంవత్సరాల పాలన ప్రస్తావన లేని కొత్త పంచాంగాలను తయారుచేశారు. ఈ రాజులు అపవిత్రులైనవారని, పవిత్ర భారత దేశ పాలనకు అనర్హులని వారు ప్రకటించినట్లు ప్రఖ్యాత చరిత్రకారుడు విన్సెంట్ స్మిత్ అంటాడు. సంస్కృత ఇతిహాసాలు, పురాణాలలో ఆర్యేతర ప్రముఖులైన వశిష్ఠ, అగస్త్య, తిరువళ్ళువార్‌లను ఆర్య సంతానంగా చూపుతారు. "ఆర్యజీవన విధానం అనార్య విధానాల కన్నా ఉత్తమమైనదిగా చూపేందుకు బ్రాహ్మణ రచయితలు సమాంతర చరిత్రను సృష్టించిన సంఘటనలు అనేకం కనిపిస్తాయని, ఆర్యేతర ప్రముఖులందరిని ఆర్యులుగా వారు చూపారని ఎ.కె.మజుందార్ అంటాడు.

సాంస్కృతిక ప్రభావాన్ని పెంచిన మరో పద్ధతి ఆర్యేతర సాహిత్యం నుండి తస్కరించటం. సంస్కృత సాహిత్యమైన బ్రాహ్మణ సాహిత్యం లేదా మనుధర్మ శాస్త్రం తమ సంస్కృతి విస్తృతి కోసం రాసినవే. సంస్కృతభాష మీద విశేష ప్రేమ, అభిమానం గల ప్రొఫెసర్ మాక్స్ ముల్లర్ బ్రాహ్మణ సాహిత్యం గురించి ఇలా అన్నాడు.

"బ్రాహ్మణ సాహిత్యంలో స్థాయి తక్కువ. అర్థం ఆధారం లేని ఘనత చాటుకునే మోసపూరిత అంశాలు అధికం. పూజారి వర్గాల మోసం, అనాదిగా అని చెప్పేవి అధికం. కాబట్టి ఒక జాతి ఎదుగుదల దైవం పేరిట. మూఢనమ్మకాల పేరిట ఎలా పక్కదోవ పట్టించటం జరుగుతుందో తెలుసుకోవటం చరిత్రకారుడికి చాలా అవసరం. అయితే ఇటువంటి జాడ్యాలు ఒక జాతి అది, అంతాలలో సహజమేనని గుర్తుంచుకోవటం కూడా అంతే ముఖ్యం"


ఆనాటి చంద్రగుప్తమౌర్యుడు, నేటి మహాత్మాగాంధి అటువంటి జాడ్యాలకు దాసోహమన్నారు. అయితే ఇటువంటి జాడ్యాలను గుర్తించటం అంత సులభం కాదు. ఎందుకంటే అవి గుంభనంగా గ్రీకు ఇతిహాసంలోని 'ట్రోజన్‌హార్స్'లా ప్రవేశిస్తాయన్నది ప్రముఖ భారతీయ సామాజిక శాస్త్రవేత్త ఎమ్.ఎన్.శ్రీనివాస్ వర్ణన. ఆయన అభిప్రాయం ప్రకారం సంస్కృతవ్యాప్తి ఒక రకమైన సాంస్కృతిక వ్యాప్తి వంటిది.

**రెండు సాంప్రదాయాలు**

అన్ని నాగరిక సమాజాలలో రెండు భిన్న సాంప్రదాయాలు స్పష్టంగా కనిపిస్తాయి. ఒకటి మతాధిపతులది. మరొకటి సామాన్య ప్రజలది. మతాధిపతులంతా తాము దైవ ప్రతినిధుల ప్రత్యేకబృందమనే సాంప్రదాయం వుండగా, సామాన్య ప్రజల విధానంలో అందరూ ఒక్కటేనన్న నమ్మకం వుంటుంది. ఆస్తికులు చెప్పిన వేదాలలోని పురుషసూక్తం, నాస్తికుడిగా హిట్లర్ ప్రతిపాదించిన 'ఫ్రీకాంఫ్' –రెండూ ఒక వర్గ ప్రత్యేకతను చెప్పినవే. క్రీస్తు, బౌద్ధుడు వారి కాలంలో మతపెద్దల విధానాల మీద తిరుగుబాటు చేసి కొత్త మతాలు నెలకొల్పారు. మతపెద్దల సంస్కృతి విడదీసి, ప్రత్యేకతను చూపి, హెచ్చుతగ్గులు ఏర్పరుస్తుండగా, ప్రజల సంస్కృతి ప్రజలను అన్ని స్థాయిల్లో ఐక్యంచేసి కూడగట్టుతుంది. అందుకే మొదటిది నియంతృత్వ సాంప్రదాయం, రెండవది సర్వజననీయ సాంప్రదాయం.


**కర్నూలుజిల్లా గుహలలో లభించిన లిపి ప్రకారం సిద్ధాంత ఫిలాసఫీని పురాతన తెలుగులో బోధించినట్టు చెప్పుకోవాల్సి వుంటుంది. తమిళంలో మైకంద దేవర్ వ్రాసిన శివజ్ఞానబోధన, సంస్కృతంలోని కౌరవ ఆగమంలోని పాపవిమోచన వంటివన్నీ బహుశ దక్షిణామూర్తి ప్రాచీన తెలుగులో చెప్పినవాటికి నకళ్లు అయి వుంటాయి. ప్రాచీన తెలుగు మీద సంస్కృతభాష దాడితో సిద్ధాంత ఫిలాసఫీ మరింత దక్షిణాదికి నెట్టబడి తమిళంలో తలదాచుకుని వుంటుంది. దీనికి సాక్ష్యం అగస్త్యుడు ఉత్తరాదిన వున్న మహేంద్రగిరి పర్వతం నుండి దక్షిణామూర్తి పంపగా వచ్చాడన్న తమిళుల సాంప్రదాయ విశ్వాసం.**


కర్నూలు గుహలలో దొరికిన ఒక శాసనంలో ఈ లిపి వుంది.



ఆ పదానికి అర్థం సిద్ధాంతమని చెప్పారు. ఈ సిద్ధాంత ఫిలాసఫీకి మూలపురుషుడు ఎవరు? దక్షిణామూర్తి అనే ఆయన ఫిలాసఫీ ఆరంభించాడనేందుకు తగినంత ఆధారాలున్నాయి. మేడమ్ బ్లావోట్స్‌కీ దక్షిణామూర్తిని 'మౌనమూర్తి' అన్నది. ఆయనే 'యోగ'ని కనిపెట్టింది. ఆయన ఘనత గల గురువు. తన శిష్యులకు బోధన చేసిన ప్రాంతమేది? మానికవసాగర్ సంత్ తన పుస్తకం 'తిరువసాగమ్' అనే గ్రంథాన్ని క్రీ.శ. మూడవ శతాబ్దంలో రచించాడు. అందులో మహాగురువు దక్షిణామూర్తి తన మొట్టమొదటి బోధనను మహేంద్రగిరి పర్వతం మీద వేదాలకన్నా ముందే చేసినట్టు రాశాడు. ఈ మహేంద్రగిరి అనే పర్వతం నేటి శ్రీకాకుళం ఒరిస్సా సరిహద్దులో సముద్రతీరంలో 4,500 అడుగుల ఎత్తున వున్నదిగా గుర్తించబడింది. నేటికీ అక్కడి గిరిజనులు అతి పురాతనమైన శివమందిరంగా ఆ కొండను పేర్కొంటారు. ప్రతి శివరాత్రినాడు గిరిజనులందరు ఆ కొండ మీదకు చేరుకుని పూజలు చేస్తారు. ఆ దక్షిణామూర్తి శిష్యులలో ముఖ్యులు అగస్త్యుడు, నందీశ్వరుడు. బొర్రా గుహలలోని శివ మందిరాన్ని ఆగస్త్యుడు ప్రతిష్ఠించాడని విశాఖపట్నం జిల్లా ప్రజలు చెపుతారు. ఆగస్త్యుడు దక్షిణాదికి వెళ్ళి సిద్ధాంత ఫిలాసఫీ బోధించాడు. సిద్ధవైద్యం ఆయన భిక్షేనంటారు. కర్నూలుజిల్లా నంద్యాల తాలూకాలోని మహానంది గుడిని నందీశ్వరుడు ప్రతిష్ఠించారంటారు. మహానంది చుట్టుపక్కల వున్న గుహలన్నీ సిద్ధులపేరుతోనే పిలవటం కాకతాళీయం అనలేం. నంద్యాల తాలూకాలో భోగేశ్వరమ్‌లో శిద్ధభోగేశ్వర అని పిలవబడే శివమందిరముంది. కర్నూలుజిల్లా గుహలలో లభించిన లిపి ప్రకారం సిద్ధాంత ఫిలాసఫీని పురాతన తెలుగులో బోధించినట్టు చెప్పుకోవాల్సి వుంటుంది. తమిళంలో మైకంద దేవర్ వ్రాసిన శివజ్ఞానబోధన, సంస్కృతంలోని కౌరవ ఆగమంలోని పాపవిమోచన వంటివన్నీ బహుశ దక్షిణామూర్తి ప్రాచీన తెలుగులో చెప్పినవాటికి నకళ్లు అయి వుంటాయి. ప్రాచీన తెలుగుమీద సంస్కృతభాష దాడితో సిద్ధాంత ఫిలాసఫీ మరింత దక్షిణాదికి నెట్టబడి తమిళంలో తలదాచుకుని వుంటుంది. దీనికి సాక్ష్యం అగస్త్యుడు ఉత్తరాదిన వున్న మహేంద్రగిరి పర్వతం నుండి దక్షిణామూర్తి పంపగా

## వివిధ సిద్ధాంతాల సంక్షిప్తం

| సంఖ్య | మతం | సిద్ధాంతం | సాంప్రదాయం | ప్రధాన ప్రచారకుడు | భాష | మానవలోక సంబంధం |
|---|---|---|---|---|---|---|
| 1 | జైన | ఆత్మ-భిన్నత్వం | సమసమాజ | మహావీర | ప్రాకృత | వాస్తవ |
| 2. | హీనయానబౌద్ధ | ఆత్మ-భిన్నత్వం | సమసమాజ | బుద్ధ | పాళి | వాస్తవ |
| 2అ. | మహాయానబౌద్ధ | ఆత్మ-ఏకత్వం | ఆధిపత్య | నాగార్జున | సంస్కృత | మిథ్య |
| 3. | సిద్ధాంతశైవం | ఆత్మ-భిన్నత్వం | సమసమాజ | దక్షిణామూర్తి | ప్రాచీన తెలుగు తమిళ | వాస్తవ |
| 3అ. | వేదాంతశైవం | ఆత్మ-ఏకత్వం | ఆధిపత్య | శంకర | సంస్కృత | మిథ్య |
| 4. | తెంగలైవైష్ణవం | ఆత్మ-భిన్నత్వం | సమసమాజ | ఆళ్వార్ | తమిళ్ | వాస్తవ |
| 4అ. | వడగలాయ్ వైష్ణవం | ఆత్మ-ఏకత్వం | ఆధిపత్య | వేదాంత-దేశిక | సంస్కృత | మిథ్య |

వచ్చాడన్న తమిళుల సాంప్రదాయ విశ్వాసం.

సిద్ధాంత, వేదాంతాల మధ్య వున్న తేడా సమసమాజ, ఆధిపత్య సాంప్రదాయాలకున్నటువంటిదే. సిద్ధాంత ఫిలాసఫీ ఆత్మ అంత కీలకం కాదంటుంది. దీనిని జైన, హీనయాన బౌద్ధ, తెంగలాయ్ వైష్ణవ విధానాలు అంగీకరించాయి. వేదాంతఫిలాసఫీలో ఆత్మ కీలకం, మహాయాన బౌద్ధం, వడగలాయ్ వైష్ణవం దీనిని నమ్మాయి. నాగార్జునుడి 'శూన్యం' శంకరుడి 'మిథ్య' భిన్నం కాదు. వేదాంత ఫిలాసఫీలో మానవుడు, జగం రెండు మిధ్య కాగా సిద్ధాంత ఫిలాసఫీలో అవి రెండూ వాస్తవాలే. వేదాంత ఫిలాసఫీకి మూలం 'తత్ త్వమ్ అసి' అనే వేదసూత్రం. నిష్కామకర్మ అనే భగవద్గీత ప్రబోధం. గీతలో నిష్కామకర్మని చెప్పేటప్పుడు వర్ణాశ్రమ ధర్మాన్ని పాటించడమే నిష్కామకర్మ ఆచరించటం అని ప్రస్తావిస్తాడు. దీనికి భిన్నంగా సిద్ధాంత ఫిలసఫీలో అందరూ ఒక్కటేనని సూత్రీకరించింది. దీనికి ఆధారం దైవకృప, మానవప్రేమ, ఆత్మ నియంత్రణ, ఆత్మ సాక్షాత్కారం యిది బోధిస్తుంది. దీనిలోని విశేషగుణం, గొప్పతనం విదేశీ పండితులను ఆకర్షించింది. వారిలో ఇద్దరి అభిప్రాయాలను ప్రస్తావిస్తాను. "ద్రవిడ మేధ నుండి పుట్టింది శైవసిద్ధాంతం. శైవసిద్ధాంతం విశాల పరిధి కలిగిన, ప్రభావం చూపేది. భారతదేశంలోని అన్ని మతాలకు అంతర్లీనంగా నిస్సందేహంగా విలువైనది అని డా॥ జి.యు.పోప్ అన్నాడు. ఇక డా॥కమిల్ వెల్చిల్ "మానవ ఆలోచనలో స్పష్టమైనది. లోపభూయిష్టమైన వాటిలో శైవసిద్ధాంతం చేరుతుంది" అని అన్నాడు.

పైన చెప్పినవాటిలో 2 అ.3 అ. మరియు 4 అ లు హిందు, బౌద్ధంలను బ్రాహ్మణ మతం అక్రమించి సమాజంలో తమకు లభించిన లేదా నిర్దేశించిన స్థానంతో తృప్తిపడే బోధనాలను స్థిరపరిచాయి. సమాజంలో విప్లవం లేదా తిరుగుబాటుకు సమాజంలో సంస్కృత భాష వ్యాప్తి విరుగుడుగా పనిచేసిందంటాడు ఎమ్.ఎన్.శ్రీనివాస్.

**ముగింపు**

భారతదేశ ఆలోచనాధోరణి చరిత్రలో సిద్ధాంతశైవ, వేదాంతశైవ, హీనయాన, మహాయాన బౌద్ధ, తెంగలాయ్, వడగలాయ్ వైష్ణవ వంటి పోరాటాలన్నీ ప్రధానంగా సమసమాజ, ఆధిపత్య ధోరణుల సాంప్రదాయాల మధ్య జరిగినవే. సంస్కృత మూలంలో వున్నవన్నీ నియంతృత్వ ధోరణిని సమర్థించినవే. అవి నాగార్జునుని మహాయాన బౌద్ధ సిద్ధాంతం కాని, ఆదిశంకరుని వేదాంతశైవం కాని, వేదాంత దేశికుని వగడలాయ్ వైష్ణవం కాని ఈ కోవలోనివే. ఇక దక్షిణామూర్తి మహావీర, బుద్ధ, నయన్నారులు, ఆళ్వారులు, భక్తి ఉద్యమ ప్రచార కవులు అందరూ సమసమాజ సిద్ధాంతకర్తలు, వీరి భావాలన్నీ ప్రాచీన తెలుగు, ప్రాకృతం, పాళి, తమిళ్ ఆ తర్వాత ఇతర ప్రాంతీయ భాషలలో వున్నాయి. అనేక శతాబ్దాలపాటు ఆధిపత్య పోకడ గల సిద్ధాంతం మేధావివర్గంలో, బోధనలో, పాండిత్యంలో, ప్రచారంలో వుండటంతో సంస్కృతం ఒక విశేష సంస్కృతికి చెందినదనే భ్రమను కలిగించింది. సాంప్రదాయ భాషలు కిందిస్థాయి సంస్కృతినే భావన స్థిరపడేలా చేసిందని ఎమ్.ఎన్.శ్రీనివాస్ అంటారు. పండితులు, పురోహితుల భాష అయిన సంస్కృతంలో చెప్పబడినందున మహాయానమని, పాళి భాషలో చెప్పినందున హీనయాచమని ప్రచారం చేశారు. అదే విధంగా ప్రాచీన తెలుగును పైశాచీ భాషగా వర్ణించారు. తమిళభాషలోకి కూడా సంస్కృతాన్ని చొప్పించే ప్రయత్నం చేశారు. దానికి 'మణి ప్రవళాండై' లేదా మణులతో కూడిన భాషగా పేరుపెట్టారు. అయితే నాటి తమిళకవులు ఆ ముప్పును వందేళ్ళు గడవకుండానే గుర్తించి అడ్డుకున్నారు. "బ్రాహ్మణులకన్నా బ్రాహ్మణేతర వర్గాల మీద సంస్కృత ప్రభావం తక్కువ. బ్రాహ్మణేతరులు అధికంగా వున్న చోట సాంస్కృతేతర సాంప్రదాయాలు ప్రజలలో వ్యాప్తి చెందాయి. బ్రాహ్మణులను అనుకరించే కులాలను సంస్కృత ప్రభావం నుండి అవి వెలికి తెచ్చాయి" అని ఎమ్.ఎన్. శ్రీనివాస్ అంటారు.

పైశాచిక భాష కన్నా దేవభాష ఉన్నతమైదన్న భావనలో వున్న ఆంధ్రప్రదేశ్‌లో దేవాలయ పూజా కార్యక్రమంలో తెలుగును ఎందరు అంగీకరిస్తారు? దేవనాగరి క్రమంగా ఉన్నతమనే భావనను బలపరచటం లేదా? అయితే ఈ భావనకు ఆధారం ఏ మేరకుంది? భాషా చరిత్రకారుడు ఎస్.కె. చటర్జీ దీనికి తగిన సమాధానం చెప్పాడు.

ఉత్తరభారతదేశం ఆధ్యాత్మిక దైవచింతనకన్నా సాంప్రదాయ పూజావిధానాలను తయారుచేసింది. అయితే అంతకన్న లోతైన, సర్వజనులకు సంబంధించిన యోగ, భక్తిమార్గాలు ఆర్యులకన్నా ముందున్న నేపథ్యం నుండి వచ్చాయి.

**తెలుగుతల్లి తన ప్రశాంత చిరునవ్వుతో తన బిడ్డలను తెలుగు భాష ఎక్కడ? తెలుగు వారెక్కడ? అనే ప్రశ్నలను ఆగి ప్రశ్నించుకోమని చెపుతున్నట్టుగా వుంది. ఈ ప్రశ్నలకు సంపూర్ణంగా, తృప్తికరంగా సమాధానాలు రావాలంటే తెలుగు యువత, అభిమానులు తుంగభద్ర లోయసంస్కృతి మీద విశేషస్థాయిలో పరిశోధన చేయాలి. అది తెలుగువారికి మిగిలివున్న అద్భుతమైన సంస్కృతీ ఆస్తి.**

(నడుస్తున్న చరిత్ర-జులై 2003 సంచిక నుండి)

## ‘నవ్యాంధ్ర కథ’ సంక్రాంతి ప్రత్యేక సంచిక– కథలు, కవితలు పంపండి



సంక్రాంతి పండగ తెలుగు వారి పెద్ద పండగ. చిన్నాపెద్దా కొత్త బట్టలతో, పిండివంటలతో, బంధుమిత్రులతో, బావా మరదళ్ళతో, కొత్త ధాన్యరాశులతో, కృష్ణా గోదావరిల త్రుళ్ళింతలతో, కళాకాంతులతో నవ్యాంధ్రప్రదేశ్ సమయం.

సంక్రాంతి సంబరాలూ, సింగపూరును మరిపించే రహదారులూ, ఆకాశ హర్మ్యాలూ, విదేశీ పెట్టుబడులూ, పరిశ్రమలూ, విశ్వవిద్యాలయాల స్థాపనా అన్నీ సరే సరి!

వీటితో పాటు నవ్యాంధ్ర సాహిత్యం, కళలు... ఈ సంపదను కూడా కాపాడుకుంటూ, వర్తమాన కళాకారులను
ప్రోత్సహిస్తూ, యువతరం నుంచి కొత్త కలాలను సృష్టిస్తూ... ఇది కూడా సమాంతరంగా జరగవలసిన కర్తవ్యం. అప్పుడే నూతన అమరావతికీ, నవ్యాంధ్రులకూ ప్రతిష్ఠ.

2017 సంక్రాంతి సందర్భంగా ‘నవ్యాంధ్ర కథ’ పేరిట ఎ4 సైజులో 200 పేజీలతో సర్వాంగ సుందరంగా ఒక ప్రత్యేక సంచికను తీసుకురావడానికి తెలుగు భాషోద్యమ సమితి, రాజాచంద్ర ఫౌండేషన్ సంయుక్తంగా సంకల్పించాయి. సాకం నాగరాజ, గంగవరం శ్రీదేవి సంపాదకులుగా వ్యవహరిస్తారు. నవ్యాంధ్ర రచయితలు, రచయిత్రులు తమ కథలను, కవితలను డిసెంబరు 15 లోగా డి.టి.పి.(పేజ్ మేకర్ 7.0, అను 7.0, ప్రియాంక ఫాంట్) చేసి పంపించాలి. ఇతివృత్తాలకు గీటురాయి జనజీవనమే. కథలు 1/8 డెమ్మీ సైజులో 8 పేజీలకు మించకుండా వుంటే మంచిది.

రచనలు పంపవలసిన మెయిల్ చిరునామా :
sakamnagaraja@gmail.com

**తెలుగు భాషోద్యమ సమితి**
**రాజాచంద్ర ఫౌండేషన్**, తిరుపతి

**ఒక సాహిత్య పత్రిక కోసం..** *(15వ పుట తరువాయి)*

కాలక్షేపం కోసం పత్రికల్ని చదివే పాఠకులు దూరదర్శన్ మాధ్యమానికి వెళ్ళిపోవడం మంచిదే! అయితే క్రమంగా పత్రికల్ని చదివే మంచి పాఠకులు గూడా తగ్గిపోయారు. 1980–90 ల మధ్యకాలంలో చాలా వారపత్రికలూ, మాసపత్రికలూ మూతబడిపోయాయి. అప్పటి నుంచే కథలకూ, నవలలకు సరైన భూమిక లేకుండా పోయింది.

ఈ పరిణామం ప్రపంచంలో అన్ని భాషల్లోనూ, ప్రాంతాల్లోనూ జరుగుతున్నదే! అయితే తెలుగుతో పోలిస్తే మిగిలిన అయిదు దక్షిణ భారతీయ భాషల్లో – తమిళం, కన్నడం, మలయాళం, మరాఠీ, ఒడిసా– మనకున్నంత పత్రికల కరువు లేదు. రచన లక్ష్యం పాఠకుల్ని చేరుకోవడమే! రచయితకూ పాఠకులకూ మధ్య రచన అనే సంధానాన్ని కలగజేసే బాధ్యత పత్రికలది.

మంచి పత్రికలు లేనంత కాలం మంచి రచనలు రావడానికి గూడా వీలు కలగదు. ఒక మంచి సాహిత్య పత్రికకోసం తెలుగు సాహిత్య ప్రపంచం, ఎడారిలో మంచినీటి కోసం యెదురు చూసే బాటసారిలా, చాలాకాలంగా యెదురు చూస్తూనే వుంది. ❊

## అక్షరవేణి


కవిత

అక్షరం
అజ్ఞానాంధకారంలో
విజ్ఞాన కిరణంలా
వెలుగు నిస్తోంది

అక్షరాభ్యాసం
కోటానుకోట్ల జీవులకన్నా
మహోన్నతంగా
మన జీవన లిపిని
తీర్చి దిద్దుతోంది

మానవులందరి
సమస్యల సమరంలో
అక్షరాయుధమై
పోరాడుతోంది
మానవ జాతి సరిహద్దుని
అక్షర సైనికుడై
కాపాడుతోంది

‘అ’ అంటే అమ్మ
అక్షరాస్యులందరికీ



అక్షరం
అమ్మ లాంటిది
వృక్షానికి, కొమ్మ కున్న
రెమ్మలాంటిది

విద్యాసామ్రాజ్యంలో
మకుటంలేని మహారాణిలా
పరిపాలిస్తోంది
మహాగ్రంథాలలో
కలకాలం నిలుస్తోంది

అక్షరం లేనిక్షణం
మానవ లక్షణం
మాయమవునని పిస్తోంది.

**–అమ్మిన వెంకట అమ్మిరాజు,**
94407 08656



కంప్యూటర్‌లో తెలుగు-ప్రస్తుత స్థితి, భవిష్యత్ కార్యాచరణ-4

-రహ్మనుద్దీన్ షేక్
96869 03386

# తెలుగులో గూగుల్ సేవలు

**గూ**గుల్ అమెరికా కేంద్రంగా పనిచేస్తున్న ఒక లాభాపేక్ష సంస్థ. గూగుల్ గురించి తెలీని వలగూడు(ఇంటర్నెట్) వాడేవారుండరు. గూగులమ్మ అనో గూగుల్ బాబా అనో గూగుల్ గురించి సరదాగా, గౌరవంగా వ్యవహారంలో వాడేస్తున్నాం. ఏం తెలీకపోయినా గూగుల్‌ని అడిగి చెప్తా అనటం నేటి నెటిజనుల నైజం. గూగుల్ అనేది నిజానికి సమాచారాన్ని దాచి మనం అడిగినప్పుడల్లా అందించే వలస్థలం (వెబ్సైటు) కాదు. అది కేవలం ఒక సర్చ్ ఇంజన్ (వెతుకు సాధనం). ప్రతి వలపేజీలో ఉండే సమాచారాన్ని గూగుల్ సంస్థకు చెందిన కొన్ని సాఫ్టువేర్ ప్రోగ్రాములు వడకట్టి, ముఖ్యమైన పదాలను సేకరి స్తాయి (నామవాచకాలు, క్రియలు వడకట్టి, సర్వనామాలను, విరామ చిహ్నాలను, సముచ్చయాలను వదిలేస్తాయి). తిరిగి ఎవరైనా వ్యక్తి వెతుకుపెట్టెలో ఏదైనా పదం చేర్చినపుడు ఆ సదరు పదం ఉన్న వలపేజీని చూడమని గూగుల్ సూచిస్తుంది. అంటే గూగుల్ వద్ద ఎలాంటి సమాచారం ఉండదనమాట. మీరు, నేను, మనమందరం వలగూడులో వ్రాసి పెట్టే సమాచారాన్నే గూగుల్ మళ్ళీ మనకే తిరిగి ఇస్తుందనమాట.

కేవలం వెతుకు సాధనంగా ఉన్న గూగుల్, మెల్లిమెల్లిగా వల గూడు వాడుకరులకు వారి అవసరాలకనుగుణంగా సరికొత్త సేవలను అందిస్తున్నది. లాభం, డబ్బు సంపాదన ఈ సేవల ముఖ్య లక్ష్యమైనప్ప టికీ వాడుకరుల అవసరాలను తీర్చుతున్నందువలన, పరిమిత సేవ లను ఉచితంగా అందించడం వలన గూగుల్ జగత్ప్రసిద్ధి పొందింది.

ఒక అంచనా ప్రకారం 20 లక్షల నెటిజనులు ఆంగ్లంలో ఇంట ర్నెట్‌ను-ముఖ్యంగా గూగుల్‌ను వాడుతున్నారు. వీరితో పోల్చితే, హిందీలో 30 లక్షలమంది నెటిజనులు మొబైల్ ద్వారా ఇంటర్నెట్-గూగుల్‌ను వాడుతారన్న అంచనాను గూగుల్ రెండేళ్ళ క్రితం ప్రకటిం చింది. అందుకు అనుగుణంగా కొన్ని సేవలను ప్రత్యేకించి భారతీయ భాషలలో పని చేసేలా అందించడం మొదలుపెట్టింది.

హిందీను ప్రోత్సహిస్తున్న కేంద్ర ప్రభుత్వ అండదండలతో గూగుల్ ప్రత్యక్షంగా, పరోక్షంగా ఎన్నో సేవలను హిందీకి, పర్యవసానంగా ఇతర భారతీయ భాషలకు విస్తరించి ప్రతిఒక్కరికి అందుబాటు లోకి తెచ్చింది. ఈ సంచికలో కొన్ని సేవలను పరిశీలిద్దాము.

**మొదటగా గూగుల్ వెతుకులాట :**

google.com, google.co.in వద్ద అందుబాటులో ఉన్న ఈ గూగుల్ సర్చ్ ఇంజన్ ఆంగ్లంతో పాటుగా తెలుగు, మరో తొమ్మిది భారతీయ భాషలలో అందుబాటులో ఉంది.



ఆంగ్లంలో గూగుల్ వెతుకులాట వలపేజీ



తెలుగులో గూగుల్ వెతుకులాట వలపేజీ

ఈ వెతుకులాట వలపేజీలో అద్దంకి నుండి ఆవకాయ దాకా, ఏ విషయం గురించైనా వెతకవచ్చు. ఈ పేజీలో చొప్పించే పదాలకు సరిపోయే వలపేజీలను గూగుల్ వెతికి మనకు ఒక జాబితాగా అంది స్తుంది. ప్రతి వెతుకులాట ఫలితంలో మొదటి లైనులో కొంచెం పెద్ద అక్షరాలలో నీలంరంగులో వలపేజీ శీర్షిక, దాని కింద వలపేజీ వివరణ ఉంటాయి. నీలంరంగు శీర్షికమీదకు మౌసును జరిపి నొక్కితే, ఆ వలపేజీకి తీసుకుపోయి పేజీలో ఉన్న సమాచారాన్ని చూపిస్తుంది.



వెతుకులాట ఫలితం నమూనా

ఉదాహరణకి వలస అన్న తెలుగుపదం వెతికితే ఆ పదం 3 లక్షల 56 వేల పేజీలలో ఉన్నట్టుగా ఒక క్షణంకన్నా తక్కువ సమ యంలో గూగుల్ కనుక్కోగలిగింది. అలానే తెలుగు అన్న పదం వెతికి నపుడు దాదాపుగా ఇరవై కోట్ల జాలపేజీలలో ఆ పదం వాడినట్టు గూగుల్ చూపించింది.

పై చిత్రంలో కొంచెం పెద్ద అక్షరాల్లో (రంగుల చిత్రంలో నీలంలో) కనిపించేది వలపేజీ శీర్షిక, పచ్చ రంగులో కనిపించేది వలపేజీ చిరునామా, నలుపు రంగులో కనిపించేది వెతికిన పదాన్ని బొద్దు అక్షరాలతో చూపిస్తూ, ఆ పేజీలో ఆ పదం వాడబడిన కొన్ని వాక్యాలు.

శోధన కాకుండా, "నేను అదృష్టశాలి" అన్న మీటను నొక్కితే ఫలితాలలో మొదటి లంకె తెరుచుకుంటుంది.

తెలుగుభాషలోనే కొన్ని కోట్ల పేజీలున్నట్టు తెలిసింది కదా. మనం బ్లాగులు వ్రాయటం ద్వారా, కామెంట్ల రూపంలో ఇతరుల బ్లాగుల్లో వ్రాయటం ద్వారా మరిన్ని తెలుగు పేజీలను వలగూడుకు చేర్చవచ్చు.

మనం వ్రాసే సమాచారం గూగుల్‌కు ముడిసరుకు లాంటిది. ఎంత ఎక్కువ తెలుగు సమాచారం వలగూడుకు చేరితే అంత మెరు గయిన సేవలు తెలుగుకు సమకూరుతాయి.

గూగుల్ అందించే జీమెయిల్ గురించి విడిగా చెప్పక్కర్లేదు.

మనకంటూ ఎవరైనా జాబులు–జవాబులు వ్రాయాలంటే విరివిగా అందరం వాడేస్తున్న సేవ గూగుల్ వారి జీమెయిల్ సేవ. మన వల గూడు చిరునామా ఏంటయ్యా అని ఎవరైనా అడిగితే "ఫలానా డాట్ జీమెయిల్ డాట్‌కామ్" అని గుక్కతిప్పుకోకుండా చెప్పేస్తాం. ఆ స్థాయిలో చొచ్చుకుపోయింది జీమెయిల్.

గత ఐదారేళ్ళలో గూగుల్ డ్రైవ్/డిస్క్ బాగా ప్రాచుర్యం పొందింది. మైక్రోసాఫ్ట్ ఆఫీసు బాగా ఖరీదైనది. వాడటానికి అనువుగా ఉండే వర్డ్, ఎక్సెల్, పవర్‌పాయింట్‌లను మనందరికీ అందించినా వెల ఎక్కువ అవడం వల్ల ఆబాలగోపాలానికి ప్రియమే. గూగుల్ వర్డ్, షీట్స్, స్లైడ్స్ అని ప్రత్యామ్నాయాలు అందించి మైక్రోసాఫ్టుకు ధీటుగా వీటిని అందుబాటులో ఉంచింది. వచ్చిన కొత్తల్లో తెలుగుకు సపోర్ట్ లేకపోయినా నేడు హాయిగా తెలుగులో అన్ని పనులు చేసుకునే వెసులు బాటు కలిపించింది.

క్రోం దాదాపుగా అందరం వాడుతున్న వలవిహారిణి. తేలికగా, చురుగ్గా పనిచేసే వలవిహారిణి.

యూట్యూబ్ తెలీని వాళ్ళుండరు. గూగుల్ అందిస్తున్న ఈ దృశ్య కాలను పంచుకునే వలస్థలం ఉచితంగా సినిమాలు, చిరుసినిమాలు, ఇతర దృశ్యకాలను అందిస్తుంది. తెలుగు వీడియోలను అందించడమే కాక, వీడియోలకు సబ్‌టైటిల్ (మాటకు పాఠ్యం) ఇచ్చే సదుపాయం తెలుగుకూ అందిస్తోంది.

ఇంకా గూగుల్ మ్యాప్స్, క్యాలెండర్, ఫోటోలు, అన్నింటా తెలుగుకు సహకారం ఉంది.

తెలుగులో ఆండ్రాయిడ్‌కు సహకారం గత రెండేళ్ళుగా అందు బాటులోకి వచ్చింది. గతారునెల్లుగా వస్తున్న ఫోనులు కొన్నవారికి, తెలుగు భాషలో ఇంటర్ఫేస్, తెలుగులో టైపు చేసుకునేందుకు వీలును గూగుల్ అందించింది.

ముఖ్యంగా మనం తెలుసుకోవాల్సిన సాధనాలు మూడున్నాయి. అవి : మొదటిది గూగుల్ ట్రాన్స్‌లేట్, గూగుల్ వాయిస్ టైపింగ్, గూగుల్ చేతివ్రాత ఇన్‌పుట్.


గూగుల్ ట్రాన్స్‌లేట్ ఆంగ్లంతో పాటుగా వందకుపైగా భాషల నుండి తెలుగుకు అనువాదాన్ని అందిస్తుంది. ఈ దిశగా పెద్దగా గూగుల్‌కు కావాల్సిన ముడిసరుకును తెలుగువాళ్ళు అందించక పోవడం వలన ఆంగ్లం–తెలుగు భాషలలో వాక్య నిర్మాణంలో గల తేడా వలన ఇప్పుడిది అంత నిర్దుష్టంగా అనువాదం చెయ్యలేక పోతుంది. "అమ్మనుడి తెలుగుజాతి పత్రికగా గత రెండేళ్ళుగా కృషి చేస్తుంది." అన్న లైనును ఆంగ్లంకి మార్చడానికి ప్రయత్నిస్తే "Telugus ammanudi magazine as the last two years of hard work." అని వస్తుంది. "There are 180 million people speaking Telugu language worldwide." అన్న వాక్యాన్ని అనువదిస్తే "180 మిలియన్ ప్రజలు ప్రపంచవ్యాప్తంగా తెలుగు భాష మాట్లాడే ఉన్నాయి." అని వస్తుంది. ఒక రెండేళ్ళ క్రితం ఈ అనువాదం ఇంకా ఘోరంగా ఉండేది. సోషల్ నెట్‌వర్కింగ్ సైట్లలో తెలుగు నెటి జనులు జోకులు వేసుకున్నారు.

తెలుగులో వెతుకులాట పెరిగితే ఇది మెల్లి మెల్లిగా మెరుగు పడుతుంది.

ఇక గూగుల్ వాయిస్ టైపింగ్, తెలుగులో మనం మాట్లాడితే, ఆ మాటను పదంగా మార్చుకొని పదాన్ని వెతికిపెట్టి వలపేజీలను చూపిస్తుంది.

గూగుల్ చేతిటైపింగ్ అయితే నన్ను బాగా ఇంప్రెస్ చేసేసింది. తెలుగు కీబోర్డులు నేర్చుకుని అవస్థలు పడకుండా తెలుగులో వేలుతో వ్రాసేస్తే, పాఠ్యంగా మార్చి ఇస్తుంది. దీనికి తెలుగు నేర్పటం కూడా సులువే!

కొన్ని క్లిష్టమైన అక్షరాలు తప్పిస్తే చాలా సంతృప్తికరంగా ఉంది ఈ సాధనం ఇస్తున్న ఫలితం!





ఇవండీ తెలుగు వారికి అందుబాటులో ఉన్న గూగుల్ సేవలు! కొత్త సాధనాలు వచ్చిన వెనువెంటనే అందించడానికి ప్రయత్నిస్తాను.


గత సంచికలో ఇచ్చిన సమాచారం చదివాక యూనికోడ్‌లో ఇన్‌స్క్రిప్టులో ఎలా టైపు చెయ్యాలి అని ఫోన్ చేసి కొందరు అడిగారు. వారి కోసం సురవర వారిచ్చిన సహాయపాఠం వెనక పుటలో ఇస్తున్నాను. పుట తిప్పండి మరి...

# విండోస్ 8, 10 లలో ఇన్స్క్రిప్ట్ వాడి తెలుగులో టైపు చేసే పద్ధతి


1వ మెట్టు : ముందుగా కీబోర్డుపై విండోస్ స్టార్ట్ బటన్ పై నొక్కి Control Panel అని టైపు చేసి Control Panel తెరవండి.




2వ మెట్టు: ఇప్పుడు Clock, Language and Region వర్గములోని Change input methods/Add a language ఐచ్ఛికముపై నొక్కండి.




3వ మెట్టు : ఇక్కడ Add a Language బటన్ పై నొక్కి, ప్రపంచ భాషల జాబితా నుండి Telugu భాషను ఎంచుకుని Add బటన్ పై నొక్కండి.




**తెలుగు భాషలో టైపుచేయడం లేదా టైపుచేయు భాషను మార్చడం ఎలా..?**

**విధానం 1**: వర్డ్ ప్రాసెసర్(MS Word, wordpad, notepad) వంటి అనువర్తనాన్ని తెరచి, టాస్కుబారు పై ఎడమవైపున వున్న ENG పై నొక్కి Telugu Telugu keyboard ఎంచుకోండి.

ఇప్పుడు కీబోర్డు నమూనా తెలుగుకు మారుతుంది, అలాగే భాష సంకేతం కూడా తె కి మారుతుంది.

**విధానం 2:** ప్రతీసారీ మౌసుతో ENG పై నొక్కాల్సిన అవసరం లేకుండా సులువుగా కీబోర్డు మీద ఉన్నటువంటి ఎడమవైపు Alt పట్టుకుని Shift నొక్కి ఆంగ్ల – తెలుగు భాషల మధ్య మారవచ్చు.

ప్రత్యామ్నాయంగా, విండోస్ మీటను పట్టుకుని Space నొక్కి కూడా భాషల మధ్య మారవచ్చు.

వచ్చే సంచికలో కలుద్దాం ❉

# ద్రావిడ భాషలలో మిక్కిలి పురాతనమైనది ఏది?

ఈ ప్రశ్నయే విచిత్రమైనది. ఒక మూలపురుషుని సంతతివారైన పది కుటుంబముల వారిలో నెవరి కుటుంబము పురాతనము, ఎవరి కుటుంబము ఆధునికము అని అడిగిన నేమైన అర్థము కలదా? అన్ని కుటుంబముల వారి లోను మూలపురుషుని రక్తముండుటచే నన్ని కుటుంబములను మూలపురుషుడెంత పురాతనుడో అంత పురాతనములని చెప్పవలెను. అంతియె గాని ఒక కుటుంబము కంటే వేఱొక కుటుంబము పురాతనమనుటకు వీలు లేదు. అట్లే యొక కుటుంబమందలి భాషలను గుఱించియు నెఱుంగునది. ఒక నదీప్రవాహము రెండు పాయలుగాఁ జీలినప్పుడందలి యొక పాయమాత్రము మూలనది యనియు, రెండవది కాదనియు, జెప్పవచ్చునా? ఒక దానికి మూలనదీ నామముండుటయు రెండవదానికి వేఱు నామముండుటయు వ్యావహారికము గాని పారమార్థికముగాదు. కావున నిపుడు వాడుకలో నున్న ద్రావిడ భాషలన్నియు మూల ద్రావిడ భాష యెంత పురాతనమో అంత పురాతనములే. ఒకదానికంటె మఱియొకటి ప్రాఁతది యనుటకు వీలు లేదు. అట్లే అన్నియు మూలభాష నుండి పుట్టినవియే. పైతృకముపై నన్నిఁటికిని సమానమైన హక్కుండును. కావున అఱవభాష పురాతనమైనదనియు, నితర భాషలు దానికంటె నిటీవలివి యనియుఁ జెప్పుట సరికాదు. అఱవభాష యితర భాషలకంటె మూల ద్రావిడ భాషలకు నెక్కుడు సంబంధము కలదియనియు, మూలభాష స్వరూపమిందు నెక్కుడు కనఁబడుచున్నదనియు కాల్డ్‌వెల్ మొదలయినవారు మొదట వ్రాసిరి. కాని యిటీవలి శాస్త్రశోధకులామతము నంగీకరింపలేదు. ఇందును గుఱించి, హిందూదేశమందలి లింగ్విస్టిక్ సర్వేకు నాయకుఁడైన గ్రియర్‌సన్ ఇట్లు వ్రాసియున్నాఁడు.

"అన్ని ద్రావిడ భాషలకు జననియైన మూలద్రావిడ భాష యొక్కపూర్వస్వరూపము నందలి చాల యంశములను పోనీక పట్టుకొని వచ్చిన భాష అఱవమని సాధారణముగనందురు. ఈ మాట నిజము కాదని కాన్పించిన పట్ల ఈ గ్రంథముయొక్క ఆయాపుటలలోఁ జూపఁబడును. తెలుగు మొదలయిన యితర ద్రావిడ భాషలలో నఱవమునందు కంటె నెక్కుడు పురాతనములైన పూర్వకాలపు విశేష రూపములు కలవు. ఆ భాషలింకను అధిక పురాతన కాలమందలి మూల ద్రావిడ భాషాభివృద్ధి యొక్క స్థితిని దెల్పును. కావున నఱవ మితర భాషల వలెనే యొక ఉపభాషయనియు, ఇతర భాషల కంటెను తాను ముసలిదాననుటకు దానికి హక్కు లేదనియుఁ జెప్పవలెను.

*(కీ.శే. కొమర్రాజు వేంకట లక్ష్మణరావు గారి రచన 'తెలుగు భాషాతత్వము' గ్రంథము నుండి)*

## కవితాసుందరి

ఫేస్‌బుక్కులూ, లెక్కలేనన్ని లైకులూ
స్మార్ట్‌ఫోన్‌లో చాటింగులూ
ఇంటర్నెట్‌లో డేటింగులూ
బిగించి కట్టిన బ్యాగుల్లాంటి బ్లాగ్‌లూ
కవితా సుందరికి కాలేవు కర్ణాభరణాలు

హిపోక్రసీలు, అందమైన అబద్ధాలూ
నీవులేక నేను లేననే క్షణికావేశాలూ
స్వార్థం కోసమే కొనసాగించే స్నేహాలూ
మిత్రద్రోహాలు, మిత్రభేదాలూ
కవితాసుందరికి అందమైన సంకెళ్ళు

బడినుండి ఇంటికి వెళ్తూ తుపానులో చిక్కుకున్నప్పుడు
తన చీర కొంగుకప్పి గువ్వలా నన్ను దాచుకొని
క్షేమంగా ఇంటికి చేర్చిన
పాలమ్ముకునే పడతి నా కవితాసుందరికి ఊపిరి

కన్నతల్లికంటే మిన్నగా సాకిన నేలతల్లి
పచ్చతోరణమై నిత్యకళ్యాణాన్ని అందించినప్పుడు
పొంగిపోయే రైతుస్వేదం
నా కవితా సుందరికి ఆభరణం

వాలుజడలో, దాన్ని అలంకరించిన
మల్లెపూల పరిమళాలతో
తప్పిపోయిన లేగదూడను
తల్లిచెంతకు చేర్చి మురిసిపోయే
ముగ్ధవలపు నా కవితా సుందరికి కానుక.

**-డా॥వి.నాగరాజ్యలక్ష్మి**, 93941 13848

కవిత

## నిలబడాలంటే...!

నిలబడాలనుకోవడం ఆదర్శానికి నిదర్శనం
మార్గదర్శక లక్ష్యం!

నిలబడాలనుకుంటే
భూకంపాలకు చెక్కు చెదరని
మహాపర్వత మవ్వాలి
ఈర్ష్యాద్వేషాలకు ముక్కలవ్వని ఆత్మస్థైర్యం కావాలి!

నిలబడాలనుకుంటే
పెనుతుపానులను లెక్కచెయ్యని మహావృక్షమవ్వాలి
కష్టనష్టాలకు చెక్కలవ్వని
ఆత్మవిశ్వాసం కావాలి!

నిలబడాలనుకుంటే
ఉరుము శబ్దాలకు బెదరని శిలావిగ్రహమవ్వాలి
దుష్ప్రచారాలకు వెరవనిస్థితప్రజ్ఞత కావాలి!
మహాపర్వత మవడానికి
ఎంత లోతుకి వ్యాపించాలో గుణించు
మహావృక్ష మవడానికి ఎన్ని వేళ్ళై విస్తరించాలో గణించు
శిలావిగ్రహమవడానికి
ఎంత బలంగా పునాదించాలో గుర్తించు

అప్పుడు నిలబడు!
నిలబడటం వచ్చాకే
మనిషి జంతువు నుండి వేరుపడ్డాడు
నిలబడటం తెలిశాకే
మనిషి మహాప్రస్థానం ప్రారంభించాడు!

**-పి. లక్ష్మణ్‌రావ్,** 94412 15989



# ఓ సంచారి అంతరంగం

కుప్పె నాగరాజు గారు
కన్నడంలో రచించిన
'అలెమారియ అంతరంగ'కు
రంగనాథ రామచంద్రరావు
(9059779289) గారి
తెలుగు అనువాదం

## ఛైర్మన్ గారి నైతిక మద్దతు

మా గుడిసెలు ఉన్న స్థలాన్ని 'అరబ్బి తిట్టు' అంటారు. అటవీ ప్రదేశానికి చెందిన స్థలమది. మా చుట్టుపక్కలంతా అడవి. అది అభయారణ్యం కానటువంటి చిట్టడవి. మహా ఉంటే అక్కడ వేట కుక్కలు, కుందేళ్లు, నక్కలు, అడవి పంది మొదలైన చిన్నచిన్న జంతువులు ఉండేవి. మాకు క్రూరమృగాల భయం ఉండలేదు. ఆ చుట్టుపక్కలున్న అనేక పల్లెలలోని పశువులు, దూడలు, గొర్రెలు, మేకలను మేపటానికి మరియు వంటచెరుకు కోసం, కట్టెలకు, గడ్డికి ఆ అడవి చాలా అనుకూలంగా ఉండేది. ఊరకనే ఖాళీ స్థలంలో గుడిసెలు వేసుకున్న మాకు ఈ భూమి మీద ఎలాంటి హక్కు ఉండలేదు. అయితే ప్రధాన మార్గంలో ఉండటం వల్ల అందరి దృష్టిని ఆకర్షించింది. మా సంచార కుటుంబాలకు రక్షణా గోడల్లా ఉన్న కుప్పె కొళగట్ట గ్రామస్థులకూ మమ్మల్ని ఇక్కడి నుంచి తరిమేయాలన్న అభిప్రాయం లేదు. కళాకారులు, నిరపాయకారులైన మా నుంచి వాళ్ళకు ఎలాంటి ఇబ్బందులు కలిగేవి కావు. దానికి బదులుగా ఈ దాసరుల వల్ల సాంస్కృతికంగా, నైతికంగా అనేక ఉపయోగాలే ఉండటంతో జనం మమ్మల్ని అక్కడే ఉండనిచ్చారు.

మా దాసరులు నెలవు ఉన్న ఈ స్థలాన్ని ప్రభుత్వం మాకు ఇంటి స్థలాలుగా ఇవ్వటానికి కేటాయించింది. ఈ విషయాలలో ఎంతో కొంత వ్యవహారజ్ఞానం ఉన్న మా చిన్నాన్న గోవిందయ్యగారు, లింగాయత ఛైర్మన్ పుట్టమల్లప్పగారు, పటేల్ అప్పుగౌడ దొడ్డణ్ణగార్ల ప్రయత్నఫలంగా దొమ్మరి దాసరులు అరచేయంత భూమికి యజమానులయ్యారు. సుమారు నాలుగు ఎకరాల స్థలాన్ని దొమ్మరి దాసరుల వసతికై ప్రభుత్వం మంజూరు చేసింది.

అక్కడక్కడ దేశదిమ్మరుల్లా తిరుగుతున్న దొమ్మరిదాసరుల కుటుంబాలు ఇక్కడే స్థిరపడటం మొదలయ్యాయి. నాన్న, చిన్నాన్న, మామయ్య అండగా నిలిచి వాళ్ళందరికి ఆశ్రయమిచ్చారు. ప్రారంభంలో కేవలం నాలుగే ఇళ్ళున్న దాసరుల కాలనీలో ఇప్పుడు పదిహేను కుటుంబాలు ఉన్నాయి. ఈ కుటుంబాలు తమకు అనుకూలమైన విధంగా గుడిసెలు నిర్మించుకుని తమ గుడిసెల చుట్టున్న స్థలాన్ని చదును చేసి, కంచె నిర్మించుకుని ఇంటి వాడుకకు కాయగూరలు, ఆకుకూరలు మొదలైన వాటిని పెంచడం మొదలెట్టారు. కొన్ని రోజులు తమ జీవన నిర్వహణకుగానూ వేరు వేరు ఊళ్ళల్లో తిరుగుతూ తమ కులవృత్తిని చేస్తూ మరలా ఈ స్థలానికి వచ్చి స్థిరంగా ఉండటం ప్రారంభించారు.

అదే సమయానికి సరిగ్గా "అరబ్బి తిట్టు" పక్కనే ఉన్న ప్రభుత్వ బీడుభూమిని భూములు లేనివారికి పంచటానికి అర్జీలు పెట్టుకోమని ప్రభుత్వం సూచించింది. ఈ బాధ్యతలు మా దాసరులకు ఎవరికీ అక్కర్లేదు. భూములు చేసుకోవాలనే కోరిక వాళ్ళకి లేదు. అయితే మా ఊరి ఛైర్మన్‌గారు 'ఈ దాసరులకు ఎందుకు కొంత భూమిని మంజూరు చేయించకూడదు' అని ఆలోచించి ఒక రోజు మా చిన్నాన్న గోవిందయ్యను, నాన్నను మరికొంత మందిని ఆయన ఇంటికి దగ్గరికి పిలిపించుకున్నారు. వీళ్ళంతా వెళ్ళేసరికి ఆయన తమ ఇంటి అరుగు మీద కూర్చుని ఎవరితోనో మాట్లాడుతున్నారు. మా చిన్నాన్నను, నాన్నను చూడగానే "రండి మాస్టారుగారు, మీ దగ్గర ఒక విషయం మాట్లాడాలి" అన్నారు. "సెప్పండయ్యా" అని వీళ్ళు ఆ అరుగు మీద ఒక పక్కన కూర్చున్నారు.



అప్పుడాయన "చూడండి, ఇక్కడ కొంత ప్రభుత్వ భూములున్నాయి. మీలాంటి భూములు లేనివారికి ప్రభుత్వం ఈ స్థలాన్ని మంజూరు చేస్తుంది. అందుకు మీరు అర్జీ పెట్టుకోవాలి. మీరందరూ రేపు హుణ సూరు తాలూకా ఆఫీసుకు రండి. అర్జీలు వేద్దాం" అన్నారు. ఈ మాటలు విన్న మా దాసరులు "అయ్యో ఈ భూములు గీములు మాక్యాల సామి" అన్నారు.

అయితే ఛైర్మన్‌గారు బుద్ధి చెప్పి "మీకేమి తెలియదు, నేను చెప్పినట్టు ఇంటికొకరు హుణసూరుకు రండి" అని నిక్కచ్చిగా చెప్పి ఇంట్లోకి వెళ్ళిపోయారు. నాన్న, చిన్నాన్నలు మారుమాట్లాడకుండా అక్కడి నుంచి లేచి మా దాసరుల గుడిసెల వైపు నడిచారు. ఇంటికి వచ్చి మా దాసరులనంతా ఒకచోట సమావేశపరిచి ఛైర్మన్‌గారు చెప్పిన విషయం వాళ్ళకు తెలియజేసి, "ఏమి సేయాల అంట యోచ్నసేయండి, ఛేర్మన్లు అంద్రును రేపు హుణసూరికి రమ్మన్నారు. అర్జీలు యయ్యల్నంట" అని తెలియజేశారు. అప్పుడు వాళ్ళలో వాళ్ళు మాట్లాడుకుని కొందరు "ఈ భూమి గీమీ అంట మాక్యాల, వుండెకి రొవంత తావుంది. మా సేత్లో మా కులకస్బుంది" అని గొణిగారు. కొంచెం అక్షర జ్ఞానం, వ్యవహార జ్ఞానం ఉన్న చిన్నాన్న, "సూడండబ్బ, ఎప్పుడూ కాల్మ ఇట్లానె ఉండె లేదు. మా బిడ్లు తల్కాన ఇది ఉప యోగానికి వస్తేది, మేము ఛైర్మన్లు సెప్పట్ల అంద్రూ హుణసూరుకు పోయి అర్జీలు ఏస్తాము" అన్నాడు. చివరికి అందరూ ఒప్పుకుని, "అయా పదండి పోదాము" అని బయలుదేరారు.




## వ్యవసాయం తెలియని జంగమలు

హుణసూరు అమల్దారు ఆఫీసుకు అర్జీ పెట్టటానికి వెళ్ళటానికి ముందు మేము వ్యవసాయం చేయాల్సిన భూములు ఎటువైపు ఉన్నాయో పరిశీలించాలని దాసరులంతా వెళ్ళాం. ఛైర్మన్‌గారు చెప్పిన భూమి మా ఇళ్ళకు సుమారు ఒకటిన్నర కిలోమీటర్ల దూరంలో ఉంది. మా అదృష్టానికి ఆ సర్కారు భూమి హుణసూరు వైపు వెళ్ళే ప్రధాన రహదారి పక్కనే ఉంది. ఆ స్థలమంతా చెట్లుచేమలు, రాళ్ళు ముళ్ళు, కాలువలు, వాగులతో కూడుకునివుంది. దాన్నంతా చదును చేసి వ్యవసాయానికి తగినట్టు చేయాల్సిన పెద్ద సవాలు సంచారులైన మా దాసరుల మీద ఉంది. ఆ స్థలం చూడగానే కొందరు దీన్ని చదును చేసి వ్యవసాయం చేయడం మా వల్ల అవుతుందా అనే అనుమానాన్ని వ్యక్తపరిచారు. నాన్న, చిన్నాన్నలు అప్పటికే ఒక దృఢనిర్ణయానికి వచ్చినవారిలా "లేదు, మేము తావుని హసను సేస్తాము" అని ధైర్యం చెప్పారు. మరుసటిరోజు దాసరుల గుంపు అమల్దారు ఆఫీసుకు వెళ్ళి అర్జీ వేసి వచ్చారు. ఛైర్మన్‌గారు, ఆ ఊరి పెద్దలంతా వచ్చి ప్రతీ ఒక్కరితో "ఇదిగో ఇక్కడి నుంచి ఇక్కడి వరకు చేసుకోండి" అంటూ ఒక్కొక్కరికి గుర్తులు వేసి , "రేపట్నుంచే చెట్లుచేమలు నరికి చదును చేసుకోండి. అమల్దారు వచ్చి స్థలాన్ని పరిశీలించి మీకు మంజూరు చేస్తారు" అని చెప్పారు. ఆరంభశూరుల్లా మా దాసరులంతా 'సరే, మీరింతగా చెప్పాక మేము ఈ స్థలాన్ని చదును చేసి వ్యవసాయం చేస్తాం. మీ సహకారం ఉండాలి' అని పొగిడారు. అయితే తెల్లవారుతుండగానే వారి చంచలమైన మనస్సులు అప్పటికే వేరే ఏదో ఆలోచించసాగి ఒక్కొక్కరు ఒక్కొక్క దిక్కులో తమ పిత్రార్జిత ఆస్తులైన ఏకనాదం, హార్మోనియం, జోలెలను వేలాడదీసుకుని నిన్న మొన్న జరిగిన విషయాలతో తమకు సంబంధం లేదన్నట్టుగా తమ పాలిట తాము తమ కాయకానికి బయలుదేరారు. ఇలా బయలుదేరిన వారిని నాన్న ఆపి, "ఏమండబ్బ, నెన్న ఛైర్మన్లు, ఊరోల్ల దగ్గర రేపండ్లింట్ల ఈ భూమిని హసను చేసి పంట సేస్తాము అంట్రి. ఇప్పుడు సూస్తే అంద్రు జోలుగులు నెటెస్కోని పోతుండారు కదా?" అని అడగటంతో, అద్భుతంగా తత్వపదాలను పాడే మా చిన్నాన్న అల్లుడు గంగిరెద్దుల గంగయ్య , "ఏ పో మామా, ఆ సెట్లు సేమలు పీకి, ఆ రాళ్ళు మన్ను అంతా మోసి ఈ భూమి దున్ని పంట సేసేకి నాకి రాదు. అట్ల పొయ్యి ఇట్లొస్తె నా తిత్తి నిండిపొత్తి. ఈ భూమి నాక్యాల" అని ఒక దిక్కులో వెళితే, కోలె బసవన్నను ఆడిస్తున్న మా మారయ్య, "సూడన్న, నాకి ఈ అడవి నరికి సేను దున్ని పంట సేసేకి రాదు.నా బసవుడిని అట్ల ఆడిసికనివస్తె పెండ్లాము బిడ్లు కడుపు నిండపొత్తి. భూమి గీమంత నాక్యాల" అని అతను తన బసవన్నను పిల్చుకుని బయలుదేరాడు.

ఇలా ఒక్కొక్కరు ఒక్కో దిక్కును పట్టుకుని పోతే నాన్న, చిన్నాన్న, మరి కొందరు ఏమీ చేయలేక మౌనంగా నిలబడిపోయారు. ఇలా సగానికి సగం మంది దాసరులు ఈ భూమి వ్యామోహం నుంచి దూరంగా వెళితే మిగిలిన కొందరు ఆ ఊరి పెద్దల మాటకు విలువ ఇవ్వకుండా అవమానించినట్టు అవుతుందని ఆ చెట్లుచేమల్ని పీకటం

మొదలుపెట్టారు. ఈ పని చాలా కఠినమైనదని అనిపించింది. చాకలి హుచ్చీరశెట్టి, హరిజన సిద్దయ్య, హోలుమతద మాకయ్య ఇలా కొంత మంది మా దాసరులు చదును చేస్తున్న భూమి చుట్టూ తిరుగాడి



మార్గదర్శకత్వం వహించి. చెట్లు కొట్టడానికి కావలసిన గొడ్డలి, కత్తి, కొడవలి మొదలైన వాటిని తమ ఇళ్ళ నుంచి తెచ్చి ఇచ్చారు. పైగా ఏ చెట్టును ఎలా కొట్టాలో, ఏ పొదలను నరికి ఎలా మంట పెట్టాలి అనే విషయాలు తెలియని మా దాసరులకు వాటి విషయాలు బోధిస్తూ "పొలం పనులు చేయటం నాటకంలో రంగులు పూసుకుని గంతులు వేసినట్టు కాదు, వ్యవసాయం చాలా కష్టం" అని వెక్కిరించేవారు. ఆ 'అరబ్బి తిట్టు' అంత పెద్ద అడవి కాకపోయినా పెద్దపెద్ద పొదలతో నిండివుంది. ఆ పొదలు ఒక్కొక్కటి ఇంటి పరిమాణంలో ఉన్నాయి. ఆ పొద తన ఒంటి నిండా ముళ్ళనే నింపుకుని దాని కాండంలోకి ఎవరూ ప్రవేశించకుండా రక్షణకోటను నిర్మించుకుని ఉంది. కుందేలు, పంది, పక్షులకు అది దాక్కునే స్థలమైంది. ఇలాంటి వందలాది పొదలు మా భూమిలో ఉన్నాయి. మా హుచ్చీరశెట్టి ఈ పొదలను ఎలా నరకాలో చూపెట్టి, దారి చేసుకుని లోపలికి దూరి, ఆ మొక్క కాండాన్ని నరికి దాన్ని ఎండటానికి వదలి, దానిమీద చుట్టుపక్కల నరికిన మొక్కలు, చెట్లకొమ్మలు, ముళ్ళ కంపలు, గడ్డిగాదం అంతా వేసి నిప్పు పెట్టి కాల్చేవాడు. ఆ ఒక్క పొద సుమారు ఒకటి రెండు కుంటల స్థలాన్ని ఆక్రమించుకుని ఉండేది.

ఏదో విధంగా కష్టపడి మా దాసరులంతా తలా ఒక్కొక్క ఎకరం భూమిని చదును చేశారు. అప్పటికే వారి చేతులంతా బొబ్బలెక్కి కాళ్ళల్లో రకరకాల రాళ్ళుముళ్ళు గుచ్చుకుని ఈ వ్యవసాయం 'చాలప్పా చాలు' అనిపించింది. కేవలం ఈ పనే చేస్తూ ఉంటే కడుపుకు ఇక చల్లనీళ్ళ బట్టనే గతి అని ఇకపై ఇంటికి ఒకరు భూమిపని చేయాలని, మిగిలినవారు పల్లెలమీద వెళ్ళాలని నిర్ణయించుకున్నారు. గత పది హేను రోజుల నుంచి మూలన చేరిన జోలె, తంబూర, హార్మోనియం లను భూజానికి తగిలించుకుని అత్యంత సంతోషంతో తమ కాయ కానికి బయలుదేరారు. తమ కులవృత్తిని ఒంటబట్టించుకోకుండా రైతాంగంతో సహవాసంలో ఉంటున్న మా అన్నయ్య వెంకటప్ప, నాటకాల మాస్టారు మా మామయ్య లక్ష్మణమూర్తి, చిన్నాన్న గోవిం దప్ప, ఆయన కుమారుడు సీనప్ప, ఎక్కడా నెలవు దొరకక ఊరూరా తిరుగుతున్న సుంకయ్య, పిల్లలు నంజుండప్ప, కృష్ణప్ప, కోల్కార కరియయ్య కుమారుడు శవుటి రాచప్ప, సన్నొడయ్య కుమారుడు వెంకటప్ప, శినుమునితాత నారాయణప్ప మొదలైనవారు భూమిని చదును చేసే పనిలో నిమగ్నమయ్యారు, ఇలా మేము అడవిని నరికి నాశనం చేస్తుండగా అక్కడ ఆశ్రయం పొందిన పక్షులు, అడవి పందులు, కుందేళ్ళు, ఉడుములు మొదలైన జంతువులు మాకు శాపం పెడుతూ రక్షణాత్మక స్థలాన్ని వెదుకుతూ ముందు ముందుకు సాగుతున్నాయి. ఆ జంతువుల, పక్షుల తావులను మేము ఆక్రమించు కుని వాటికి నెలవులు లేకుండా చేస్తున్నామేమో అని అనిపించేది.

## మా చెలువడి ప్రవర్తన

మా ఊరి నుంచి ప్రధాన మార్గం నుంచి కొంచెం లోపలికి వెళితే 'మంటికొప్పలు' అనే ఒక ఊరు ఉంది. ఆ ఊరి దళితుల్లో చలువయ్య అనే వ్యక్తి ఉన్నాడు. అతను అప్పుడప్పుడు మా ఊరికి వచ్చేవాడు. మా గంగిరెడ్డుల గంగయ్యకు ఈ చలువయ్యకూ స్నేహం ఉండేది. అతను చుట్టుపక్కల పల్లెలకంతా చిరపరిచితుడు. అతడిని అందరు 'దొంగచలువ' అనే పిలిచేవారు. అతను ఊరికి వచ్చి వెళ్ళాడంటే ఆ రాత్రి ఎవరి ఇంటి కొట్టంలోని మేకనో, గొర్రెనో మాయమయ్యేది. ఆ వృత్తిలో అతనికి ఎంత ప్రావీణ్యం ఉందంటే ఆ గొర్రెల, మేకల మందలోపల దూరి సద్దు లేకుండా దాని నోటి నుంచి చిన్న శబ్దం రాకుండా జాగ్రత్తగా తన భుజం మీద వేసుకుని వచ్చేవాడు. పక్కనున్న ఏదో ఒక ఊళ్ళో దాన్ని కోయించి, కుప్పలు వేసి, భాగాలు పంచి, ఎంతో కొంత సొమ్ము వసూలు చేసుకుని ఆ చోటును ఖాళీ చేసేవాడు. ఎవరి చేతికీ చిక్కకుండా, ఎలాంటి రుజువులు లేకపోవటంతో, అతడిని ఏమీ చేయడానికి కుదరక 'దొంగ చలువ' అని బిరుదు మాత్రం ఇచ్చారు.

ఒక రాత్రి ఈ చలువ ఒక గొర్రెను తన భుజం మీద వేసుకుని మా గంగయ్య ఇంటికి వచ్చాడు."చూడు గంగయ్య, గొర్రెను తెచ్చాను. మీ వాళ్ళంతా కలసి భాగాలు పంచుకుని నాకు కొంత సొమ్ము ఇచ్చే యండి" అన్నాడు. మా గంగయ్యకు అది దొంగతనంగా తెచ్చిందని

తెలిసిపోయింది. ఆ సమయంలోనే మమ్మల్నందరినీ లేపి, "ఇట్టిట్ల ఆ దొంగ చలువుడు శానా బాగుండె ఒక గొర్రెని దొంగతనం సేసి చచ్చినాడు. దాన్ని కోసి పాలేసుకొని నాకి దుడ్లు ఇయండి అంట చప్పుతా ఉండాడు. ఏమి సేసేది?" అని గుసగుసగా అడిగాడు. అందరు ఒక నిర్ణయానికి వచ్చి చలువకు కొంత సొమ్ము ఇచ్చి పంపేసి, ఆ గొర్రెను కోసి భాగాలు పంచుకున్నారు. దాని చర్మం, తల-కాళ్ళు వేటినీ వదలకుండా అన్నిటిని ముక్కలు ముక్కలు చేసి గుర్తులే లేకుండా చేశారు.

ఈ చలువ ఇంకా ఎంతటి ధైర్యశాలి అంటే మా రోడ్డులో తిరుగుతున్న లారీల నుంచి కూడా ధాన్యాలను లూటీ చేసేవాడు. బిళికెరెకు, మా ఊరికి మధ్యన మల్లినాథపుర అనే ఊరుంది. హాసను వైపు నుంచి మరియు కొడగు, కేరళ వైపు నుంచి వచ్చే అన్నీ లారీలు ఈ దారి గుండానే మైసూరుకు వెళ్ళాలి. అది చాలా ఇరుకైన మార్గం. ఆ మార్గానికి ఇరువైపులా పెద్దపెద్ద రావి, వేప, మేడి చెట్లు పెరిగి ఉండేవి. మా చలువ రాత్రిళ్ళు ఆ చెట్టు మీద ఎక్కి కూర్చుని ఏదైనా లోడ్ లారీ వచ్చిన వెంటనే ఆ చెట్టు మీది నుంచి లారీ మీదికి దూకి ఆ లారీలోని మూటలను కిందికి తోసేవాడు. లారీ ఆ మిట్ట దారిని ఎక్కలేక కుయ్యోమొర్రో అని నెమ్మదిగా చలిస్తున్నట్టే తన చేతివాటాన్ని చూపించి, మరొక చెట్టు కొమ్మ పట్టుకుని ఆ లారీ నుంచి తప్పుకుని చెట్టు నుంచి కిందికి దిగేవాడు. అతడి రోమాంచనపు కథలు విని మాకు భయం వేసేది. పిల్లలు ఎవరైనా ఏడుస్తూ మంకుపట్టి భోజనం చేయడానికి గొడవ చేస్తుంటే ఈ 'దొంగ చలువ' పేరు చెబితే గప్‌చుప్ అయ్యేవారు.

మేము పెరిగి పెద్దవాళ్ళమై కొంచెం బుద్ధి వికసిస్తున్నట్టే మా 'దొంగ చలువ' అందరిని విస్మయపరుస్తూ తన వృత్తిని మార్చుకున్నాడు. దోపిడీ దొంగ అయిన వాల్మీకి పరివర్తన చెంది శ్రీమద్రామాయణం వంటి అద్భుత కావ్యాన్ని జగత్తుకు అందించినట్టు మా చలువ గురుబోధ తీసుకుని చేతిలో ఏకతార పట్టుకుని, కాషాయ వస్త్రాలు ధరించి తన శేషజీవితాన్ని తత్త్వ పదాలు, పురాణాలు, పుణ్యకథలు చెబుతూ సాత్వికమైన భిక్షాటనా వృత్తిని చేబట్టి జీవించాడు. అయితే ఇతడి ఈ మార్పుకు కారణమేమిటో మాకు తెలియలేదు. ఇతడి ఈ మార్పు అందరిలోనూ ఆశ్చర్యాన్ని కలిగించటం మాత్రం నిజం. అంగులీమాల్యుడు ఆ బుద్ధదేవుడికి శరణు అయినట్టు మా చలువ ఏ గురువుకు శరణుడయ్యాడో తెలియలేదు.

## చెరువులో వేట ...

మా ఊరిలో రెండు చెరువులు ఉన్నాయి. ఒకటి కుప్పె గ్రామానిది. మరొకటి కొళగట్ట గ్రామానిది. కుప్పెచెరువు సవర్ణులది. కొళగట్ట చెరువు హరిజనులకు చెందింది. కానీ హరిజనుల చెరువు నీళ్ళు ఉపయోగపడుతున్నది మాత్రం సవర్ణుల భూములకు. హరిజనుల వీధివారు ఈ నీటిని పశువుల ఒళ్ళు కడగటానికి, బట్టలు ఉతకటానికి, కొన్ని సందర్భాలలో తాగటానికీ ఉపయోగించడం జరిగేది. ఈ రెండూ చెరువులూ వర్షపునీటితో నిండి పశువులు, పక్షులు, జంతువులు మరియు మనుషులకు ఆసరా అయ్యాయి. మా దాసరులు సందర్భానుసారంగా ఈ రెండు చెరువుల నీటిని అనేక అవసరాలకు వాడేవారు. ఈ ఊళ్ళోల్లో చాలాకాలం నుంచి ఒక పద్ధతి ఉంది. అదేమిటంటే ప్రతీ సంవత్సరం ఉగాది పండుగ మరుసటి రోజున లేదా ఒకటి రెండు రోజులు గడిచిన తరువాత ఊరి జనమంతా కలసి ఆ చెరువులో వేటాడి తమ శక్తికొలది చేపలు, ఇతర జలచరాలను పట్టేవారు. సవర్ణుల చెరువుకు దళితులు, దళితుల చెరువుకు సవర్ణులు వేటకు వచ్చేవారు కాదు. సవర్ణుల చెరువు నీటిని దళితులు ముట్టడానికి లేదు. అయితే సవర్ణులు తమ పశువులను దళితుల చెరువులో నీళ్ళు తాగించేవారు. వాటి ఒళ్ళు కడిగేవారు.

ఈ రెండు గ్రామాల మధ్యన చోటు చేసుకున్న మాకు మాత్రం ఏ కట్టుబాట్లు, ముట్టుమైలలు లేవు. మేము దళితుల చెరువు నీళ్ళు, సవర్ణుల చెరువు నీళ్ళను ఎలాంటి అభ్యంతరం లేకుండా ఉపయోగించే వాళ్ళం. ఈ విషయంగా మమ్మల్ని ఎవరూ ప్రశ్నించేవాళ్ళు కాదు. ఇది మాకు అనుకూలంగా ఉండి ప్రతీ సంవత్సరం ఉగాది, మహర్నవమిలో గ్రామస్థులంతా కలసి ఈ రెండు చెరువులలో జరిగే సామూహిక వేటలో మేము పాల్గొనేవాళ్ళం. మొత్తం ఊరిలోని వారందరూ తమ దగ్గరున్న చేపల వల, రొయ్యల వల, చేపల గాలం, బుట్టలు, వెదురు బుట్టలు, కసువు బుట్టలు, వెదురు బెత్తాలతో కొమ్ము చేసి దాని అడుగు భాగంలో వల సంచి కుట్టి తయారు చేస్తున్న బుట్ట, వల మొదలైన వాటిని ఉపయోగించి ఆ చెరువులో సంవత్సర కాలంగా తమంతట తామే అభివృద్ధి చెందిన రకరకాల చేపలు, రొయ్యలు, పీతలు, తాబేళ్ళు మొదలైన జలచరాలను తమ శక్త్యానుసారం వేటాడే వాళ్ళు. ఇతర సముదాయాల వారి వలల్లో ఈ తాబేళ్ళు ఏవైనాపడితే అవి మా దాసరులకు దక్కేవి. కారణం వాటిని చక్కగా వండుకుని తినటం వారికి రాదు

మా దాసరులందరి ఇళ్ళల్లోనూ సామాన్యంగా చేపలు పట్టే వలలు ఉండేవి. మేము, ఆడవాళ్ళం, పిల్లలం, అందరం మా దగ్గరున్న వేట పరికరాలను తీసుకుని అందరిలా చెరువుకు వేటకు బయలుదేరే వాళ్ళం. యాభై, అరవై ఎకరాల విశాలమైన ఆ చెరువు వేసవి కాలంలో నీళ్ళంతా వాడబడి, ఎండిపోయి, చెరువుమధ్య స్థలంలో ఒక పావు భాగమంత స్థలంలో నీళ్ళు మడుగుకట్టి నిలిచి ఉండేవి. అంత విశాలమైన చెరువులో నివసిస్తున్న జలచరాలన్నీ తమ ప్రాణాలు దక్కించుకోవటానికి ఆ మడుగులో చేరేవి. మొత్తం ఊరే ఆ చెరువు లోతుకు దిగి, అరక్షణంలో ఆ నీళ్ళంతా బురదమయంగా మారి, అందులో ఉన్న జలచరాలన్నీ మనుషుల వేటకు బలయ్యేవి. ఈ దృశ్యాన్ని ఆకాశంలో ఎగురుతున్న గద్ద, కాకి, రాబందులు, నీటిపక్షులు చూస్తూ ఈ మానవులతో పోటీలు పడుతూ తామూ వేటాడి పొట్ట నింపుకునేవి. ఈ విచిత్రాలన్ని చూస్తూ నేను, మా అన్నయ్య, అక్క, తమ్ముడు మరియు చిన్నాన్న పిల్లలు, మామయ్య పిల్లలు-అందరం అదే బురదగుంటలో మునిగి లేచి మా దేహమంతా పూడిక, బురద మయమై, పెద్దవాళ్ళు పట్టిచ్చిన చేపలు,తాబేళ్లు మొ॥నవాటిని సంచీలో నింపుకుని జాగ్రత్తపరుచుకునే వాళ్ళం.

సంవత్సరమంతా పశువులకు, జంతువులకు, పక్షులకు ఆసరా అయిన ఆ జలాశయం అప్పుడు బురదమయమై మనుషుల ఆక్రమణ వల్ల ఉపయోగానికి రానట్టయింది. చిటికెన వేలు గాత్రపు చేప మొదలు పెద్దపెద్ద చేపలూ మానవుడి చేతికి దొరికిపోయాయి. మధ్యాహ్న సమయంలో వేట ముగించిన మేము వాటిని తలమీద మోసుకుని తెచ్చేవాళ్ళం.ఆ రోజు ఊరికి ఊరే చేపల వాసనతో కంపుకొట్టేది. ప్రతీ ఇంటి ముందు చేపలను ఎండపెడుతున్న దృశ్యం సాధారణంగా కనిపించేది. వేటాడిన చేపలన్నింటిని ఒకేసారి తినటానికి కాక, అమ్మ కూడా వాటిని ఎండలో ఎండ బెట్టి ఎండు చేపల్ని చేసి పెట్టేది. ఈ 'సామూహిక వేట' సంవత్సరాలు గడుస్తున్నట్టే, క్రమంగా మాయమైంది. చివరికి చెరువును ఎవరికో గుత్తకు ఇవ్వటంతో ఆ చెరువులో వాళ్ళే చేపలు పట్టి ఊరివాళ్ళకు అమ్మే 'పాదు పద్ధతి' ఊళ్ళో ప్రారంభమైంది.

-ఇంకావుంది

-పెండ్యాల సత్యనారాయణ,
సెల్ : 98664 42034

# సమాచారాన్ని వెల్లడించకపోవటం ప్రజాస్వామ్యమా?

**భా**రత రాజ్యాంగంలోని విభాగం-3 ప్రమాణాలకు సంబంధించినది. రాష్ట్రపతి, ఉప రాష్ట్రపతి, కేంద్ర, రాష్ట్ర మంత్రులు, న్యాయ మూర్తులు తదితరులు తమ పదవీ బాధ్యతలను చేపట్టబోయే ముందు రాజ్యాంగబద్ధంగా చేసే ప్రమాణాలు అన్నీ ఆ విభాగంలో ఉంటాయి. కేంద్ర మంత్రులు, రాష్ట్ర మంత్రులు ప్రమాణం చేసే క్రమంలో అధికార రహస్యాలను గురించి కూడా ప్రమాణం చేయాల్సి ఉంటుంది. ఆ ప్రమాణం ఈ క్రింది విధముగా ఉంటుంది:

" ............ అనే నేను కేంద్ర మంత్రిగా/రాష్ట్ర మంత్రిగా నా దృష్టికి వచ్చిన, లేక నాకు తెలియ వచ్చిన విషయములను, కేంద్ర మంత్రిగా/రాష్ట్ర మంత్రిగా నా బాధ్యతలను నిర్వర్తించటంలో అవసర మైనప్పుడు మినహాయించి, ప్రత్యక్షంగాగాని, పరోక్షంగాగాని ఎక్కడా బహిరంగ పరచనని దేవుని ఎదుట (లేక) అంతరాత్మ సాక్షిగా ప్రమాణం చేస్తున్నాను".

మనది పార్లమెంటరీ ప్రజాస్వామ్యం. ప్రజలే ప్రభువులు. మంత్రులంతా ప్రజా సేవకులు. మన ప్రజాస్వామ్యంలో అంతా పారదర్శకతే. జవహర్‌లాల్ నెహ్రూ, వాజ్‌పాయ్ మొదలుకుని ఇప్పటి నరేంద్రమోడి, చంద్రబాబు నాయుడు వరకు అంతా ప్రజాస్వామ్యం, పారదర్శకత గురించి, ప్రజలకు జవాబుదారీతనం గురించి మాట్లాడే వారే. నిజంగా వీరంతా ప్రజా సేవకులే అయితే, ప్రజల వద్ద దాపరిక మెందుకు? తమకు తెలిసిన విషయాలను ఎవరికీ చెప్పమంటూ ప్రమాణం ఎందుకు? ఈ విధంగా ప్రమాణం చేయటం ఏ విధంగా ప్రజాస్వామికం అవుతుంది? ఇది నిజంగా పూర్తిగా అప్రజాస్వామికమే. ఇటువంటి అప్రజాస్వామిక ప్రమాణం ప్రజాస్వామ్యానికి, ప్రజాస్వామిక విలువలకు మారుపేరుగా మన నాయకులంతా ఘనంగా చెప్పుకునే మన రాజ్యాంగంలో ఎందుకు చేర్చబడింది? ఎవరు చేర్చారు?

ఇంతకీ మంత్రులు అంటే ఎవరు? మన పార్లమెంటరీ ప్రజాస్వామ్యంలో ప్రజలు ఎన్నికలలో తమ అమూల్యమైన ఓటు హక్కును వినియోగించటంద్వారా తమ ప్రతినిధులను ఎమ్మెల్యేలుగా, ఎంపీలుగా ఎన్నుకుంటారు. ఆ ప్రజా ప్రతినిధులలో కొందరు మంత్రులుగా నియమించబడి ప్రజా ప్రతినిధులుగా, ప్రజల తరఫున పరిపాలన సాగిస్తారు. అంటే ఒక రకంగా ప్రజా సేవకులు అన్నమాట. మరొక రకంగా చెప్పాలంటే ప్రజలే పాలకులు, యజమానులు. మంత్రులు ప్రజా ప్రతినిధులు, ప్రజా సేవకులు. ప్రజా ప్రతినిధులు, సేవకులు ఎలా ఉండాలి? తమ యజమానులైన ప్రజల ఎడల నమ్మకంగా విశ్వాస పాత్రంగా ఉండాలి. ప్రజలను వంచించకూడదు. మభ్య పెట్టకూడదు. ఏమీ దాచకూడదు. ప్రజల సంక్షేమం కోసం పాటు పడాలి. పారదర్శకంగా ఉండాలి. ఇవి అందరికీ తెలిసినవే. రాజనీతి శాస్త్రంలో, ప్రజాస్వామ్య మూల సూత్రాలలో ఇవి ప్రథమ పాఠాలు. ఇవన్నీ అంబేద్కర్ వంటి మహా మనిషికి, ప్రజాస్వామిక విలువలకోసం పరితపించిన వ్యక్తికి తెలియవా?

ఇండియన్ కాంట్రాక్టు చట్టం (భారతీయ ఒప్పందాల చట్టం) అని ఒక అత్యంత ప్రధానమైన చట్టం ఉన్నది. యజమాని-ప్రతినిధికి మధ్య ఉండవలసిన సంబంధాలు గురించి ఆ చట్టంలో ఒక ప్రత్యేక అధ్యాయం ఉన్నది. ప్రతినిధి ఎప్పుడూ యజమాని ఎడల విశ్వాస పాత్రంగా ఉండాలని, యజమానికి చెప్పనుండా ఏపనీ చేయకూడదని, ప్రతినిధిగా వ్యవహరించిన క్రమంలో తనకు తెలిసిన విషయాలు, తన దృష్టికి వచ్చిన విషయాలను దాపరికం లేకుండా యజమానికి చెప్పాలని, యజమాని దగ్గర ఏవిషయాన్నీ దాచిపెట్టరాదనీ ఆ చట్టం వివరిస్తున్నది. వృత్తిరీత్యా అడ్వొకేట్ అయిన అంబేద్కర్‌కు ఈ విషయాలు తెలియవని మనం అనుకోగలమా?

అంటే మొత్తంమీద చూస్తే, మంత్రిగా ప్రమాణం చేస్తున్న ప్రజా ప్రతినిధి, మంత్రిగా వ్యవహరించిన కాలంలో తన దృష్టికి వచ్చిన విషయాలను ఎక్కడా బహిరంగ పరచనని, రహస్యంగా ఉంచుతానని ప్రమాణం చేయటం ఏరకంగా చూసినా ప్రజాస్వామ్య విరుద్ధము, అనైతికమని, తనను నమ్మి, తనను గెలిపించి, తనకు మంత్రి పదవిని ఇచ్చిన ప్రజలకు ద్రోహం చేయటం, వంచించటమేనని ఎవరికైనా తేలికగానే అర్థం అవుతుంది. ఈ ద్రోహం, వంచన ఏ స్థాయిలో ఉంటుందో ఒక్కసారి ఆలోచించుకుందాం. ఉదాహరణకు కొందరు సైనికాధికారులు, రక్షణశాఖలోని ఉద్యోగులు దేశ ద్రోహులుగా మారి, మన దేశ రక్షణకు సంబంధించిన కొన్ని రహస్యాలను మన శత్రు దేశాలకు అందజేస్తున్నారు. ఆ వివరాలన్నీ మన రక్షణ మంత్రికి అందాయి. కానీ ఆ వివరాలను ఆ మంత్రి బయట పెట్టకూడదు. దేశంలో ఒక పెద్ద కుంభకోణం జరిగింది. కొందరు బడా బాబులు, రాజకీయవేత్తలు కూడబలుక్కుని లక్షల కోట్లు ప్రజాధనాన్ని దోచుకున్నారు. వారి పేర్లు, వివరాలు ఆర్థిక మంత్రికి తెలుసు. కానీ ఆ పేర్లను వెల్లడి చేయకూడదు. వీటన్నింటికీ రక్షణ కవచం రాజ్యాంగంలోని ప్రమాణమే! ఇది ఎంత అప్రజాస్వామికం?

దీనికి సీక్వెల్‌గా కొద్ది నెలల క్రితం సుప్రీంకోర్టులో జరిగిన ఒక ఘటనను ఇక్కడ ప్రస్తావించటం అవసరం. ఐదువందల కోట్ల కన్నా ఎక్కువ మొత్తాన్ని బ్యాంకులనుండి అప్పుగా పొంది, ఆ మొత్తాన్ని చెల్లించకుండా బ్యాంకులకు పంగనామాలు పెట్టిన బడా కంపెనీలు, పారిశ్రామిక వేత్తల పేర్లు, బకాయీ పడ్డ మొత్తం తదితర వివరాలతో కూడిన జాబితాను సీల్డు కవర్లో పెట్టి సుప్రీం కోర్టుకు అందించింది రిజర్వు బ్యాంక్ ఆఫ్ ఇండియా. అయితే ఆ పేర్లను మాత్రం బయట పెట్టవద్దని సుప్రీంకోర్టును అభ్యర్థించింది. ఆ విధంగా బకాయీ

పడ్డ మొత్తం లక్షల కోట్ల రూపాయలకు చేరినందున ఎగవేత దారుల పేర్లు, కంపెనీలు, సంస్థల పేర్లను బయట పెట్టకపోయినా, కనీసం బకాయిల వివరాలను ప్రజలకు తెలియపరుద్దామన్నది సుప్రీం కోర్టు. ఆ వివరాలను కూడా ప్రజలకు తెలియకూడదన్నది రిజర్వు బ్యాంకు. రిజర్వు బ్యాంక్ ఆఫ్ ఇండియా చట్టం, రుణ సమాచార సంస్థల (నియంత్రణ) చట్టం, గోప్యతకు సంబంధించి పబ్లిక్ ఫైనాన్స్ మరియు ఆడిట్ చట్టం ప్రకారం ఆ వివరాలు ప్రజలకు తెలియకూడదని సొలిసిటర్ జనరల్ వాదించారు. సుప్రీంకోర్టు సరే అన్నది. ఇది చూసి మేధావులు, బుద్ధిజీవులు, సామాన్యులు ముక్కుమీద వేలేసుకున్నారు. సగటుమనిషి బ్యాంకులలో దాచుకున్న సొమ్మునే బ్యాంకులు, బడా కంపెనీలకు, పారిశ్రామిక వేత్తలకు అప్పుగా ఇస్తాయి. అంటే అది అంతా మన సొమ్ము, ప్రజల సొమ్ము. ఆ విధంగా అప్పుతీసుకున్న బడా పారిశ్రామిక వేత్తలు, కంపెనీలు, అప్పుతీర్చకుండా ఎగ్గొట్టిన మొత్తం ఎంతో తెలుసుకునే హక్కు కూడా ప్రజలకు లేదా. ఇదేమి గోప్యత. ఇదేమి పారదర్శకత. ఇదేమి రాజ్యాంగం. ఇదేమి ప్రజాస్వామ్యం అని అంతా ఆశ్చర్యపోయారు. ఇది ఎంత అప్రజాస్వామికమో, తమకు తెలిసిన విషయాలను మంత్రులు, ప్రజలకు చెప్పకూడదనటం కూడా అంతే. నిజం చెప్పాలంటే అంతకన్నా అప్రజాస్వామికం.

ఇక్కడ మనమంతా గమనించాల్సింది ఏమిటంటే, భారత రాజ్యాంగం ఇప్పటికి వంద సార్లు సవరించబడివది. ఆ సవరణలలో చాలాభాగం అప్రజాస్వామికమైనవే. అయితే కొందరు ఈ అభిప్రాయంతో పూర్తిగా ఏకీభవించక పోవచ్చు. ఉదాహరణకు అత్యవసర పరిస్థితి కాలంలో అప్పటి ప్రధాని శ్రీమతి ఇందిరాగాంధి చేసినవన్నీ అప్రజాస్వామికమైన రాజ్యాంగ సవరణలని, మిగిలిన రాజ్యాంగ సవరణలన్నీ ప్రజాస్వామ్యబద్ధమైనవనీ కొందరి భావన. కానీ, జవహర్‌లాల్ నెహ్రు కాలంలోను, ఆ తర్వాత జనతా పార్టీ హయాంలోను, ఆ తర్వాత వాజ్‌పాయ్ పరిపాలనా కాలంలోను కొన్ని ప్రజావ్యతిరేక, అప్రజాస్వామిక రాజ్యాంగ సవరణలు జరిగినట్లు చాలా మంది భావిస్తున్నారు. అంటే భారత రాజ్యాంగం అమలులోని వచ్చిన తర్వాత చేయబడిన రాజ్యాంగ సవరణలపై అందరి మధ్య ఏకాభిప్రాయం లేదు. కాని, డాక్టర్ అంబేద్కర్‌చే రచించబడినట్లుగా చెప్పబడుతున్న మొట్టమెదటి రాజ్యాంగంలోనే మంత్రులు రహస్యాలను దాచిపెట్టాలన్న రాజ్యాంగ ప్రమాణం పురుడుపోసుకున్నది. ఇటువంటి అప్రజాస్వామిక మైన ప్రమాణాన్ని డాక్టర్ అంబేద్కర్ తాను రచించిన రాజ్యాంగంలో ఎందుకు పొందుపరచారు?

నిజానికి అంబేద్కర్ ఆ నిబంధనను వ్రాయలేదు, పొందుపరచలేదు. మరి ఎవరు పొందు పరచారు? రాజ్యాంగ పరిషత్ పొందు పరచింది. ఎందుకంటే రాజ్యాంగాన్ని రూపొందించింది రాజ్యాంగ పరిషత్తే కనుక. ఈ విషయంపై మరింత స్పష్టత రావాలంటే, చాలామంది మర్చిపోయిన, అసలు చాలా మందికి తెలియని రాజ్యాంగ పరిషత్ గురించి తెలుసుకోవాలి.

1946లో, మనకు స్వతంత్రం రాకముందే భారత రాజ్యాంగ పరిషత్ ఏర్పడింది. రాజ్యాంగ పరిషత్ కేవలం భారత రాజ్యాంగ రచనకే పరిమితమైన ఒక ప్రత్యేక సభ. అప్పటి రాజ్యాంగ పరిషత్‌లో ఇప్పటి బంగ్లాదేశ్, పాకిస్తాన్ భూభాగాలకు చెందినవారు కూడా ఉన్నారు. అప్పటి రాజ్యాంగ పరిషత్ మొత్తం సభ్యుల సంఖ్య 399. వారిలో 292 మంది అప్పటి ప్రొవిన్షియల్ అసెంబ్లీ సభ్యులచే పరోక్షంగా ఎన్నిక కాబడిన సభ్యులు. (వారిలో 208 మంది కాంగ్రెస్ పార్టీకి చెందినవారు. 73 మంది ముస్లింలీగ్ ప్రతినిధులు. మిగిలిన కొద్దిమంది ఇతర పార్టీలు, వర్గాలకు చెందిన వారు. వారిలో భారతీయ జనసంఘ్ వ్యవస్థాపకులలో ఒకరైన శ్యాంప్రసాద్ ముఖర్జీ ఒకరు. కమ్యునిస్టు పార్టీకి చెందిన ఒకరు కూడా ఉన్నారు). మిగిలిన వారిలో అప్పటికి భారత దేశంలో ఉన్న వివిధ సంస్థానాల ప్రతినిధులు 93 మంది, ఛీఫ్ కమిషనర్ ప్రావిన్సుల ప్రతినిధులు నలుగురు ఉన్నారు. 9-12-1946న ఆ రాజ్యాంగ పరిషత్ మొదటి సమావేశం జరిగింది. కేవలం 207 మంది సభ్యులు ఆ సమావేశానికి హాజరయ్యారు. ముస్లింలీగ్ ఆ సమావేశాలను బహిష్కరించింది.

సరిగ్గా ఆదే సమయంలో బ్రిటిష్ వలస పాలకుల విభజించి పాలించే కుటిల రాజనీతిలో భాగంగా దేశ విభజన తెరమీదకు వచ్చింది. రాజ్యాంగ పరిషత్ నిస్తేజం అయింది. పాకిస్తాన్ రాజ్యాంగ పరిషత్ ఒకటి ఏర్పాటయింది. అప్పటి రాజ్యాంగ పరిషత్‌లోని కొందరు సభ్యులు పాకిస్తాన్ రాజ్యాంగ పరిషత్‌లో సభ్యులుగా కరాచీ వెళ్ళిపోవటంతో భారత రాజ్యాంగ పరిషత్ సభ్యుల సంఖ్య 302కి పడిపోయింది. వారిలో 230 మంది అప్పటి ప్రొవిన్షియల్ అసెంబ్లీ సభ్యులచే పరోక్షంగా ఎన్నిక కాబడిన సభ్యులు. మిగిలిన 72 మంది ఇండియన్ స్టేట్స్ (సంస్థానాలు) ప్రతినిధులు. 1947 అగష్టు 15 నాటి రాజ్యాంగ పరిషత్ ముఖచిత్రం ఇది. రాజ్యాంగ పరిషత్‌లో డాక్టర్ అంబేద్కర్‌తోబాటు, బాబూ రాజేంద్ర ప్రసాద్, జవహర్‌లాల్ నెహ్రూ, బాబూ జగ్‌జీవన్ రామ్, కామరాజ్ నాడార్ వంటి ఎందరో ఉద్దండులు ఉన్నారు. మన తెలుగువారు 12 మంది ఉన్నారు. వారు వరుసగా 1. ఆంధ్ర కేసరి టంగుటూరి ప్రకాశం 2. నీలం సంజీవ రెడ్డి 3.ఎన్.జి.రంగా 4.కల్లూరు సుబ్బారావు 5. మోటూరు సత్యనారాయణ 6. వి.సి. కేశవరావు 7. బి.పట్టాభి సీతారామయ్య 8. బి.శివరావు 9. బొబ్బిలి రాజా శ్వేతాచలపతి రామకృష్ణ రంగారావు 10. శ్రీమతి జి. దుర్గాబాయి 11. కళా వెంకటరావు 12. ఎమ్. తిరుమలరావు.

పై విధంగా పునర్ వ్యవస్థీకరించబడిన రాజ్యాంగ పరిషత్, దేశ విభజన తర్వాత తన కలాపాలను పునః ప్రారంభించింది. ఆ క్రమంలో రాజ్యాంగ పరిషత్‌లో పని విభజన కోసం అనేక ఉప సంఘాలు ఏర్పడ్డాయి. వాటిలో రాజ్యాంగ ముసాయిదా రూప కల్పన ఉప సంఘం ఒకటి. 1947 ఆగస్టు 29వ తేదీన ఏర్పాటైన ఆ ఉప సంఘానికి అధ్యక్షులు డాక్టర్ అంబేద్కర్. ఆ ఉపసంఘంలో ఆయనతో బాటు మరొక ఆరుగురు సభ్యులున్నారు. వారు వరుసగా 1. కె.ఎమ్. మున్షి, 2. అల్లాడి కుప్పుస్వామి అయ్యర్. 3. ఎన్. గోపాలస్వామి అయ్యంగార్. 4. బి.ఎల్. మిట్టర్. 5. మొహమ్మద్ తాజుల్లా. 6. డి.పి.ఖైతాన్ (మధ్యలో మిట్టర్ రాజీనామా చేయటంతో ఆయన స్థానంలో మాధవరావును, అదే విధంగా మధ్యలోనే ఖైతాన్ మరణించటంతో ఆయన స్థానంలో టి.టి.క్రిష్ణమాచారిని సభ్యులుగా నియమించటం జరిగింది). ఈ ఉప సంఘానికి న్యాయ సలహాదారు శ్రీ బి. నరసింగరాజు. 1948, జనవరి నెలలో రాజ్యాంగం తొలి ముసాయిదా ప్రతి (చిత్తుప్రతి) విడుదల అయింది. ఆ చిత్తు ముసాయిదాకు

వివిధ వర్గాలనుండి, ప్రజలనుండి 7,635 సవరణలు వచ్చాయి. వాటిలో కేవలం 2,473 సవరణలపై మాత్రం రాజ్యాంగ పరిషత్ చర్చించింది. చివరకు 26-11-1949న నూతన రాజ్యాంగాన్ని, రాజ్యాంగ పరిషత్ ఆమోదించింది. తొలి రాజ్యాంగ ప్రతిపై 24-1-1950 తేదీన 284 మంది రాజ్యాంగ పరిషత్ సభ్యులు సంతకాలు చేశారు. 1950 జనవరి 26నుండి రాజ్యాంగం అమలులోకి వచ్చింది. అదే గణతంత్ర దినోత్సవం అనబడే రిపబ్లిక్ డే. (1947 తర్వాత భారత రాజ్యాంగ పరిషత్ 10 పర్యాయాలు సమావేశమయింది. ఆ తర్వాత జరిగిన చివరి సమావేశంలో నూతన రాజ్యాంగాన్ని ఆమోదించటంతో రాజ్యాంగ పరిషత్ అధ్యాయం ముగిసింది).

**మొత్తం మీద గమనించాల్సింది ఏమిటంటే భారత రాజ్యాంగాన్ని రూపొందించింది రాజ్యాంగ పరిషత్. రాజ్యాంగ పరిషత్, ప్రత్యేకించి రాజ్యాంగ ముసాయిదా రూప కల్పన ఉపసంఘంలోని మెజారిటీ సభ్యుల అభిప్రాయం మేరకే "మంత్రులు రహస్యాలను దాచిపెట్టాలన్న"** ప్రమాణం రాజ్యాంగంలో చేర్చబడింది. **మెజారిటీ సభ్యులు ఆ విధంగా ఎందుకు అభిప్రాయపడ్డారు? రాజ్యాంగ పరిషత్తులోని మెజారిటీ సభ్యులు, భూస్వామ్య, పెట్టుబడిదారీ, ధనిక, దోపిడీ వర్గాలకు ప్రతినిధులే. తమ అక్రమాలు, దోపిడీలకు చెందిన సమాచారమంతా సంబంధిత మంత్రులవద్ద ఉంటుంది. ఆ సమాచారం ప్రజలకు తెలిస్తే, తమ ఉనికికే ప్రమాదం.** ప్రభుత్వానికున్న ప్రజాస్వామ్య మేలి ముసుగు తొలగిపోతుంది. **అందువలన ఆ సమాచారం ప్రజలకు తెలియకూడదు. మంత్రులవద్దే ఉండిపోవాలి. అందువలన ఆ రహస్యాలను మంత్రులు వెల్లడి చేయకుండా రాజ్యాంగంలోనే ఏర్పాటు చేయటం ఉపయుక్తమని ధనిక, దోపిడీ వర్గాలు భావించాయి. వారి సూచనల మేరకే, రాజ్యాంగ పరిషత్‌లోని మెజారిటీ సభ్యులు ఆ విధమైన ప్రమాణానికి వత్తాసు పలికారు.** వృత్తిరీత్యా అడ్వొకేట్ అయిన డాక్టర్ అంబేద్కర్ గొప్ప మేధావి మాత్రమే కాకుండా, ఆయనకు ఆంగ్ల భాషపై కూడా మంచి పట్టు ఉన్నది. రాజ్యాంగ పరిషత్ సూచనలు, అభిప్రాయాలకు అనుగుణంగా రాజ్యాంగంలోని వివిధ అంశాలను క్రోడీకరించి, ఒక వరుస క్రమంలో కూర్చి, పొందికైన భాషలో, వాక్యపొందికతో రాజ్యాంగానికి ఒక రూపాన్ని ఇచ్చిన రూపశిల్పి డాక్టర్ అంబేద్కర్. ఆ క్రమంలో ఒక ప్రజాస్వామ్య వాదిగా, మెజారిటీ అభిప్రాయాలను గౌరవించాల్సిన అవసరం ఉన్నదన్న ప్రజాస్వామ్య విలువలకు పెద్దపీట వేస్తూ, డాక్టర్ అంబేద్కర్ గోప్యతకు సంబంధించి మంత్రుల ప్రమాణాన్ని రాజ్యాంగంలో చేర్చారు.

ఈ భావన ఊహా జనితమే కావచ్చు. కాని వాస్తవమే అని భావించటానికి అనేక కారణాలు ఉన్నాయి. ఉదాహరణకు **డాక్టర్ అంబేద్కర్ భావజాలాన్ని, అభిప్రాయాలను, అంబేద్కరిజాన్ని విశ్వసించే వారిలో చాలామంది, అంబేద్కర్ తనకుతానుగా ఇటువంటి అప్రజాస్వామిక ప్రమాణాన్ని రాజ్యాంగంలో పొందుపరచరు అని భావిస్తున్నారు. నిజంగా డాక్టర్ అంబేద్కర్‌కు పూర్తి స్వేచ్ఛ ఇచ్చి ఉంటే, అంబేద్కర్ ఈ రాజ్యాంగాన్ని వ్రాసి ఉంటే రాజ్యాంగం మరొక విధంగా ఉండేదని ఆయన భావజాలాన్ని వ్యతిరేకించేవారు, ఆయనను విమర్శించేవారు కూడా అంగీకరిస్తున్న విషయాన్ని ఈ సందర్భంలో గుర్తుంచుకోవాలి.** రిజర్వేషన్లకు డాక్టర్ అంబేద్కర్ వ్యతిరేకమని, కొందరి ఒత్తిడి మేరకే, అయిష్టంగానే పది సంవత్సరాల పరిమిత కాలపరిమితితో కూడిన రిజర్వేషన్లకు ఆయన తన అంగీకారం తెలిపారని ప్రముఖ పాత్రికేయులు కులదీప్ నయ్యర్ ఒకానొక సందర్భంలో పేర్కొన్నారు. ఆ క్రమంలో అనేక చోట్ల తనకు ఇష్టం లేకపోయినా, తాను సమ్మతించని అనేక అంశాలను డాక్టర్ అంబేద్కర్ రాజ్యాంగంలో అనివార్యంగా పొందుపరచవలసి వచ్చిందని చాలా మంది భావన.

నిజానికి ఇక్కడ ప్రధానమైనది, 'మంత్రులు రహస్యాలను బహిర్గతం చేయకూడదన్న" ప్రమాణాన్ని రాజ్యాంగంలో ఎవరు చేర్చారన్నది కాదు. ఎందుకు చేర్చారన్నదే సమస్య. (అందుకు కారణం కూడా పై పేరాగ్రాఫ్‌లోనే ఇవ్వబడింది) ఈ పార్టీ, ఆ పార్టీ అనే తేడా లేకుండా అన్ని పార్టీలవారూ ఎవరికి వారు తామే నిజమైన అంబేద్కర్ వారసులమని, మిగిలినవారంతా దొంగలని పేర్కొంటూ, తమ అంబేద్కర్ భక్తిని చాటుకునే క్రమంలో అంబేద్కర్ రాజ్యాంగాన్ని రచించారని పేర్కొంటూ, ఆ క్రమంలో రాజ్యాంగంలోని అప్రజాస్వామిక అంశాలకూ ఆయననే బాధ్యుడిని చేయటం నిజంగా ఆయనకు ద్రోహం చేయటమే. అందుకే, రూపశిల్పిగా, రాజ్యాంగ రూపకర్తగా ఆయన కృషిని వివరిస్తూ, రాజ్యాంగంలోని అప్రజాస్వామిక అంశాల వెనుక గల కారణాలను ప్రజలకు, భావితరాలకు తెలియపరచటమే డాక్టర్ అంబేద్కర్‌కు మనం అర్పించే నిజమైన నివాళి.

సోకాల్డ్ కమ్యూనిస్టులతో సహా, రాజ్యాంగ యంత్రాన్ని నిశితంగా విమర్శించే జయప్రకాష్ నారాయణ్ వంటి మేధావులు, లౌకికవాదులూ, ప్రజాస్వామికవాదులూ, పౌరహక్కుల సంస్థలూ రాజ్యాంగంలోని ఈ అప్రజాస్వామిక అంశాన్ని విమర్శించకపోవటం, ఉన్నత న్యాయస్థానంలో ప్రశ్నించకపోవటం నిజంగా ఆశ్చర్యకరమూ, బాధాకరమైన విషయమే. ❋

శిశువు శారీరక వికాసానికి తల్లిపాలు
మానసిక వికాసానికి తల్లి భాష
గుండెలోతుల్లోంచి వచ్చేదీ, మనసు
విప్పి చెప్పగలిగేది అమ్మనుడిలోనే.

అమ్మనుడిపై నెనరు లేనివాడు
కన్నతల్లినీ, పుట్టిన నేలనీ
ప్రేమించలేడు..

-సంకేపల్లి నాగేంద్రశర్మ,
9441797650.

# తెలంగాణ జిల్లాల పునర్విభజనతో అనూహ్య మార్పులు!

**భా**రతదేశ చిత్ర పటంలో, 29వ రాష్ట్రంగా ఆవిర్భవించిన తెలంగాణా రాష్ట్రంలో రెండేళ్ళ పాలన తర్వాత, మరో సంచలనాత్మక నిర్ణయం జరిగిపోయింది. 10గా వున్న పాత జిల్లాలకు 21 జిల్లాలను అదనంగా చేర్చుతూ మొత్తంగా 31జిల్లాలతో పునర్విభజన గత విజయదశమి పండుగతో నిర్విఘ్నంగా జరిగిపోయింది. వీటితోపాటు రెవిన్యూ డివిజన్లు, మండలాల సంఖ్యను పెంచారు. మొత్తంగా రెవిన్యూ డివిజన్ల సంఖ్య 68, మండలాల సంఖ్య 584కి చేరాయి. దేశవ్యాప్తంగా 685 జిల్లాలున్నాయి. తె.రాష్ట్రంలో కొత్తజిల్లాల ఏర్పాటు వల్ల కేంద్రప్రభుత్వం నుండి బహులాభాలు పొందవచ్చునన్న భావంతో ఈజిల్లాల విభజన జరిగిందని ఒక వాదన వుంది. హర్యానా, ఛత్తీస్ ఘడ్ వంటి చిన్న రాష్ట్రాల్లో జిల్లాల సంఖ్య ఎక్కువగా వుండటం వల్ల, కేంద్రప్రభుత్వం ద్వారా పలు లాభాలు పొందుతున్నాయి. ఎన్ని ప్రతికూలతలు, ఉద్యమాలు, ఆందోళనలు చెలరేగినా, ముఖ్యమంత్రి కెసీఆర్ తన పాలనా దక్షతను ప్రదర్శించి, ఈ బృహత్తర కార్యాన్ని విజయవంతం చేసి, రాజకీయ పండితులు, ప్రతిపక్షాల వారి విమర్శలను దీటుగా జవాబు చెప్పి నోళ్ళు మూయించారు. నూతనంగా 21 జిల్లాల ఏర్పాటు, ఆయా కొత్తజిల్లాలకు కలెక్టర్ల, ఎస్పీల నియామకాలతోపాటు, ఇతర శాఖల సిబ్బంది నియామకాలు వంటివి ఆషామాషీ కాదు. వీటన్నింటిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ అధికార యంత్రాంగాన్ని ఒక్కతాటి పైకి తెచ్చి, సరైన మార్పులతో చేర్పులతో కొలిక్కితేవడం వంటి పనిని నైపుణ్యంతో చేయడం కెసీఆర్ పాలనా ఘనతేనని చెప్పక తప్పదు. కొత్త జిల్లాలు రావడంతో ఆయా జిల్లాల్లో చారిత్రిక, సాంస్కృతిక నేపథ్యాలలో పెద్దగా మార్పులు, చేర్పులు జరిగే ఆస్కారమైంది.

తెలంగాణా కళాసంస్కృతులు, భాష, చారిత్రికాంశాలు జిల్లాల వారిగా పునర్వికాసం చెందుతాయి. వర్తమాన కవులు, పండితులు, కళాకారులు, చిత్రకారులు, రచయితలు, భాషావేత్తలు, కళాకారులు మరింతగా వెలుగులోకి వచ్చే అవకాశాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. రాజకీయరంగానికైతే తిరుగే లేకుండాపోయింది. తెలంగాణా రాష్ట్రంలోని వివిధ పుణ్యక్షేత్రాలు, చారిత్రికాంశాలు, కోటలు, బురుజులు, ప్రాచీన కట్టడాలు, అడవులు, తోటలు, వన్యమృగాలు, జలపాతాలు, హిందూ, బౌద్ధ, జైన, మహమ్మదీయ కట్టడాలు, ప్రార్థనామందిరాలు కొత్త జిల్లాల వారీగా చూస్తే మరింతగా ప్రాధాన్యతను సంతరించుకోనున్నాయి. పరిపాలనా సౌలభ్యం దృష్ట్యా ముఖ్యమంత్రి కెసీఆర్ జిల్లాల పునర్విభజన కార్యాన్ని ఒక ఏడాది కాలంలో ఛాలెంజీగా చేబట్టి, చెలరేగిన ఉద్యమాలు, ప్రజాందోళనలకు చరమగీతం పాడించి, సరైన సమాధానం ఇవ్వగలిగారు. ముఖ్యంగా గద్వాల, జనగామ, సిరిసిల్ల జిల్లాలు కావాలని కోరుతూ ప్రతిపక్షాలు, ప్రజలు చేసిన ఆందోళనను ఆఖరి క్షణంలో ఆమోదించి, ఆందోళనకారుల అంచనాలనే తలకిందులు చేసి, పుష్పగుచ్చాలు ఇప్పించిన ఘనతను దక్కించుకున్నారు. గిరిజన సంఘాలు కోరినట్లుగానే ముఖ్యమంత్రి ఆసిఫాబాద్ కొమ్రం భీం జిల్లాను, మహబూబాబాద్ కేంద్రాలుగా నూతన జిల్లాలను ఇచ్చి వారిని సంతృప్తిపరిచారు. కొత్తగూడెం కేంద్రంగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లాను ఇచ్చి, అక్కడి గిరిజనుల ఆందోళనకు స్వస్తి చెప్పించారు. ప్రతిపక్షాలు, సొంత పార్టీ నేతల నుండే కొంత ప్రతికూలతలు వచ్చినా, వాటిని దీటుగా తట్టుకొని, జిల్లాల పునర్విభజన వంటి యజ్ఞాన్ని చాలావరకు ప్రజామోదితంగానే చేయగలిగారని రాజకీయ విశ్లేషకులు అంచనావేస్తున్నారు.



గత ఏడాది డిసెంబరులో ఘనంగా ఆయత చండీయజ్ఞం చేసిన ముఖ్యమంత్రి, జిల్లా పునర్విభజన యజ్ఞాన్ని మరింత ఘనంగా చేసి, తన సత్తాను చాటుకుని అందరి మెప్పును పొందారు. విపక్షాల సలహాలు, సూచనలను కూడా స్వీకరించి, రాజ్యసభ సభ్యులు కేశవరావు కమిటీ ద్వారా చాకచక్యంగా తన మీద వచ్చే అపవాదులకు, విమర్శలకు గట్టిగానే జవాబు చెప్పారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రాజీవశర్మ పాత జిల్లాల కలెక్టర్లతో పలుసార్లు టెలికాన్ఫరెన్సు, ప్రత్యక్షంగా సమావేశమై, సాఫ్ట్‌వేర్ సహాయంతో ఎప్పటికప్పుడు నూతన జిల్లాల పరిస్థితుల మార్పులు, చేర్పులలో ఒక అవగాహనను పెంచుకుని, జిల్లా పునర్విభజన బాటకు సరైన పాదులు వేశారు. దేవరకొండ, నారాయణపేట, మిర్యాలగూడ, హుజూరాబాద్ వంటి కేంద్రాల్ని జిల్లాలుగా విభజించాలని, ఆఖరు క్షణం దాటిన తర్వాత ప్రతిపక్షాలు,

తెరాస నేతల నుండి వచ్చిన డిమాండ్లు, విజ్ఞప్తులను ముఖ్యమంత్రి సున్నితంగా తిరస్కరించినా, వాటి అభివృద్ధికి తాము ప్రాధాన్యత ఇవ్వగలమని స్పష్టమైన హామీలు ఇచ్చి, ఆందోళనకారుల్ని సంతృప్తి పరచగలిగారు.

హుజూరాబాదుకు నూతనంగా రెవిన్యూ డివిజన్ ఇచ్చి సీని యర్ క్యాడర్ మంత్రి ఈటెల రాజేందర్‌ని సంతృప్తిపరిచారు. కరీం నగర్ జిల్లాను మరో మూడు జిల్లాలుగా విభజించారు. పెద్దపల్లి, రాజన్న సిరిసిల్లా, జగిత్యాల జిల్లాలు నూతనంగా చేర్చి, కరీంనగర్ పాత జిల్లాలో 16 మండలాలు చేర్చారు. ఇక్కడి సిరిసిల్లా రాజన్న జిల్లాలో ఉమ్మడి రాష్ట్రంలోనే ప్రసిద్ధిపొందిన వేములవాడ చాళుక్యుల కాలం నాటి శ్రీరాజరాజేశ్వరస్వామి ఆలయం చేరిపోయింది. సిరిసిల్లా అసెంబ్లీ నియోజకవర్గం నుండి ముఖ్యమంత్రి కుమారుడు కె.తారక రామారావు గత రెండు ఎన్నికల నుండి ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ఈ జిల్లా అభివృద్ధికి కెటీఆర్ గతంనుండే ప్రత్యేక శ్రద్ధాసక్తులు చూపిస్తున్నారు. నూతన జిల్లా రాకతో ఆయన బాధ్యత మరింతగా పెరిగిపోయింది. ఎవ్వరూ ఊహించని విధంగా పెద్దపల్లి జిల్లా తెరపైకి వచ్చింది. ఇటీవలే టీఆర్ఎస్‌లో చేరిన మాజీ ఎంపి వివేక్ సోదరుల కృషితో ఈ జిల్లా ఏర్పాటు జరిగింది. ఈ జిల్లా పరిధిలోకి పారిశ్రామిక ప్రాంతమైన రామగుండం ఎన్టీపీసీతోపాటు, సింగరేణీ కాలరీస్ బొగ్గు గనుల క్షేత్రాలు చేరిపోయి, ఈ జిల్లా పారిశ్రామికంగా మరింత సుసంపన్నమై పోయింది. ఒకప్పుడు మాజీ ప్రధాని పివి.నర్సింహారావు ప్రాతినిధ్యం వహించిన మంథని ప్రాంతం పెద్దపల్లి జిల్లా పరిధిలోకి చేరిపోయింది. సబ్బితం గౌరీగుండాల జలపాతం, ఎల్లంపల్లి ప్రాజెక్టు, రామునిగుండాలు, లంజె మడుగు జలాశయం, అటవీ ప్రాంతాలు ఈ జిల్లాకు అదనపు ఆకర్షణలు. నూతన జగిత్యాల జిల్లా పరిధిలో జగిత్యాల ఖిల్లా, గోదావరి తీరస్థ ధర్మపురి లక్ష్మీనృసింహ క్షేత్రం, కోటిలింగాల శాతవాహనుల స్థావరం, కోటలు, పాలవాస పద్మ నాయక రాజుల కోటలు, గుడులు చేరిపోయాయి. ఈ జిల్లానుండి తెలంగాణా చారిత్రికవేత్తలు డా.జైశెట్టి రమణయ్య, డా.జైకిషన్, డా.సంగనభట్ల నర్సయ్యలు, కె.వి.నరేందర్ (కథా రచయిత) వెలుగు లోకి వచ్చినట్లయింది. రామాయణంలో వర్ణించిన అపమృత్యు నివారిణి సంజీవని వంటి వనమూలికలున్న కాళిదాసు మహాకవి మేఘసందేశ కావ్యంలో వర్ణించిన, ప్రాచీన రామగిరి ఖిల్లా, అర్వాచీన ఓదెల శివాలయం పెద్దపల్లి జిల్లా పరిధిలోకి వచ్చి, చారిత్రిక ప్రాధాన్య తలు హెచ్చాయి. కరీంనగర్ జిల్లా కేంద్రంలో ఎలాంటి పెద్ద దైవతాలు లేకున్నా చారిత్రిక ఎల్లందల్ కోట, కొత్తకొండ, కొత్తగట్టు, నగునూర్ త్రికూటాలాయం, జమ్మికుంట సమీప ఇల్లందకుంట రామాలయాలు దక్కాయి. శాతవాహన యూనివర్సిటీ, దిగువ మానేరు ప్రాజెక్టు జలవిహారం, జింకలపార్కు ఉజ్జ్వల పార్కులు దక్కాయి. చారిత్రిక ప్రదేశాలు, దైవతాలు కోల్పోయిన జిల్లాగా ఒంటరిగా మిగిలిందని వాట్సప్‌లో విశేష ప్రచారం జరిగింది, వరంగల్ జిల్లా జనగామ, వరంగల్ అర్బన్, వరంగల్ రూరల్, మహబూబాబాద్, భూపాలపల్లి జిల్లాలుగా విడిపోయాయి. వరంగల్ కాకతీయ వైభవాల స్వాగత తోరణాలు, వరంగల్ కోట, వేయిస్తంభాల గుడి, భద్రకాళీ దేవస్థానాలు అర్బన్ పరిధిలోకి చేరిపోయాయి. తెలంగాణా సిద్ధాంత కర్త జయ శంకర్ స్మారకంగా ఈ జిల్లా ఎర్పాటైంది. జయశంకర్ సార్- భూపాల పల్లి జిల్లా పరిధిలోకి చారిత్రాత్మక రామప్పగుళ్ళు, ఘనపురం గుళ్ళు, లక్నవరం పర్యాటక చెరువుతోసహా, ఆసియాలోనే కాక, దేశం గర్వించదగిన సుప్రసిద్ధ గిరిజన సమ్మక్క-సారలమ్మ వంటి జాతరా స్థలాలు చేరిపోయాయి. త్రిలింగ క్షేత్రం, గోదావరి తీరస్థ కాళేశ్వర ముక్తేశ్వర స్వామి దేవస్థానం కరీంనగర్ జిల్లా నుండి విడిపోయి, ఈ నూతన జిల్లాలోకి చేరిపోయి, ఈ జిల్లా చారిత్రిక ప్రాధాన్యతకు ఆధారభూతంగా నిలిచింది. పోతన్న రాసిన మహాభాగవత కేంద్రం బమ్మెర, తెలంగాణా ఆదికవి పాలకుర్తి సోమనాథుడు పుట్టిన పాలకుర్తి వంటి సుప్రసిద్ధ సాహితీ క్షేత్రాలు, పెంబర్తి ఇత్తడి కళాకారుల లోహ పరిశ్రవు నూతన జనగామ జిల్లా పరిధిలోకి చేరాయి.

జనగామ జిల్లా ఏర్పాటుకై విద్యావేత్త చుక్కారామయ్యతోపాటు, విప్లవకవి పెండ్యాల వరవరరావు, జానపద విద్యావేత్త ఆచార్య జయ ధీర్ తిరుమలరావు వంటి ప్రముఖులు ఆందోళన చేసి విజయం సాధించారు. మహబూబ్‌నగర్ జిల్లాలో జోగులాంబ గద్వాల, వనపర్తి, నాగర్‌కర్నూల్ కొత్త జిల్లాలుగా ఏర్పాటయ్యాయి. నిజాం నవాబుల కాలంలో సాహితీవేత్తలు, కళాకారులకు నిలయమై, ప్రసిద్ధి పొందిన వనపర్తి, గద్వాల సంస్థానాలు జిల్లా కేంద్రాలుగా మారిపోవడం చేత, నాటి రాజరికపు వైభవాలను తిరిగి పొందినట్లయింది. గద్వాల చేనేత చీరలు, బీచుపల్లి ఆంజనేయస్వామి గుడి, జూరాల ప్రియదర్శిని ప్రాజెక్టు వంటివి ఈ జిల్లాలోకి చేరిపోయాయి. నాగర్‌కర్నూల్ జిల్లాలో కృష్ణాతీరం వెంట వుండే సోమశిల పుణ్యక్షేత్రంతోపాటు, అక్కమహాదేవి గుహలు చేరిపోయి, కృష్ణానదీతీర సాంస్కృతిక నాగరికతకు కేంద్రంగా నిలిచాయి. నల్లమల అటవీ ప్రాంతం, శ్రీశైల ఎడమకాల్వ సొరంగం, పులుల అభయారణ్యం ఈ జిల్లాలో ప్రకృతి ఆకర్షణలుగా నిలువ గలవు. ఇక్కడి నుండే సుప్రసిద్ధ చారిత్రక, సీనియర్ సాహితీవేత్త, గ్రంథకర్త డా॥కపిలవాయి లింగమూర్తి ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ప్రసిద్ధి పొందిన బాదామీ చాళుక్యుల కాలం నాటి బ్రహ్మగుడులు, జోగులాంబ దేవాలయం గద్వాల జోగులాంబ జిల్లాకు మారిపోయాయి.

అటవీ అందాలకు నెలవైన ఆదిలాబాద్ జిల్లాను మంచిర్యాల జిల్లాగా అదనంగా విభజించాలని ఉమ్మడి రాష్ట్రం నుండి వస్తున్న డిమాండు తెలంగాణా రాకతో సాకారమైంది. ఆదిలాబాద్ జిల్లాలో నూతనంగా మంచిర్యాల జిల్లాతోపాటు, ఆసిఫాబాద్ కొమ్రం భీం జిల్లా, నిర్మల్ జిల్లాలు ఏర్పాటయ్యాయి. నిర్మల్ చెక్కబొమ్మలు, పెయిం టింగ్‌లు, బాసర జ్ఞానసరస్వతీ క్షేత్రం, నిర్మల్ కోటలు, కడెం ప్రాజెక్టు, కవ్వాల్ పెద్దపులుల అభయారణ్యం, సహ్యాద్రి పర్వతాల శ్రేణులు నూతన నిర్మల్ జిల్లాలోకి చేరిపోయాయి. చారిత్రాత్మకంగా, కళాత్మ కంగా, సాగునీటి కోణంలో చూసినా ఈ జిల్లా ముందంజలో వుంది. ఆఖరు క్షణంలో దేవాదాయ మంత్రి ఎ.ఇంద్రకరణ్ రెడ్డి చొరవతో ఇక్కడ నూతన జిల్లా ఏర్పడిందని అంటున్నారు. నూతన మంచిర్యాల జిల్లా ప్రాంతం, మందమర్రి బొగ్గుగనులు, గూడెం సత్యనారాయణ స్వామి గుట్ట, అటవీ అందాలకు, సిమెంట్ పరిశ్రకు ప్రసిద్ధి, కొమ్రం భీం జిల్లాలో కొమ్రం భీం పోరాడిన జోడెఘాట్ అటవీ కేంద్రం, జలపాతాలు, జంగుబాయి-శంకరలొద్ది వంటి గిరిజన కేంద్రాలతో పాటు, ఇతరాలకు ఈ జిల్లా ప్రసిద్ధి, నిజామాబాద్ జిల్లా నిజామాబాద్, కామారెడ్డి జిల్లాలుగా విడిపోయింది. నిజామాబాద్ జిల్లాకు బడా పహాడ్ ముస్లిం దర్గా, డిచ్పల్లి శిల్పశోభిత రామాలయం, కందకుర్తి

త్రివేణి సంగమం, బోధన్ ప్రాచీన చారిత్రిక క్షేత్రం, శ్రీరాంసాగర్ ప్రాజెక్టులు దక్కాయి. నూతన కామారెడ్డి జిల్లాకు భిక్కనూర్ ప్రాచీన శివాలయం, నిజాం కాలపు దోమకొండ సంస్థానం, నిజాం సాగర్ ప్రాజెక్టులు దక్కాయి.

మెదక్ జిల్లా కేంద్రంగా మెదక్ కావడం, పాత సంగారెడ్డి జిల్లా కేంద్రంగా ఏర్పడటం, ముఖ్యమంత్రి ప్రాతినిధ్యం వహిస్తున్న సిద్ధిపేట కేంద్రంగా జిల్లా ఏర్పడడం గమనించదగిన విషయం. వర్గల్ సరస్వతీ దేవాలయం ఈ జిల్లాకు అలంకారప్రాయమైంది. కొమరవెల్లి మల్లన్న గుడి సిద్ధిపేట జిల్లాకు వరంగల్ జిల్లా నుండి బదిలీ అయింది. కరీంనగర్ జిల్లా నుండి హుస్నాబాద్, బెజ్జంకి ప్రాంతాలు సిద్ధిపేటకు బదిలి అయ్యాయి. సంగారెడ్డి జిల్లా కిందకి కొండాపూర్ శాతవాహన చారిత్రిక స్థావరం, మ్యూజియం, మంజీరా అభయారణ్యం, కేతికి సంగమేశ్వరాలయం చేరాయి. మెదక్ నూతన జిల్లాలో మెదక్ కోట, మెదక్ చర్చి, కొల్చారం జైనమందిరం, నర్సాపూర్ అడవులు, ఏడుపాయల దుర్గా గుడులు చేరాయి. హైదరాబాద్ జిల్లా గోల్కొండ కోట, చార్మినార్, కుతుబ్‌షాహి టోంబ్స్, బిర్లా మందిర్, సాలార్జంగ్ మ్యూజియం, రామోజి ఫిల్మ్‌సిటీ, సికిందరాబాద్ సిటీ, ప్రాచీన చర్చిలు, హైటెక్‌సిటీ, షామీర్ పేట అంతర్జాతీయ విమానాశ్రయం, చౌవుల్లాప్యాలెస్, మక్కామసీద్, హుస్సేన్‌సాగర్ వంతెన, లుంబినీ పార్కు, పబ్లిక్ గార్డెన్, ఉస్మానియా, తెలుగు, కేంద్రీయ, వ్యవసాయ విశ్వవిద్యాలయాలు చేరిపోయాయి. నల్లగొండ జిల్లా నల్లగొండ, యాదాద్రి-భువనగిరి, సూర్యాపేట జిల్లాలుగా విడిపోయింది. సూర్యాపేట జిల్లా పరిధిలో ఫణిగిరి బౌద్ధక్షేత్రం, సూర్యాపేట పిల్లలమర్రి చెన్నకేశవాలయం, తదితరాలు వున్నాయి. యాదాద్రి భువనగిరి జిల్లాలో యాదాద్రి క్షేత్రం, భువనగిరి కోట, కొలనుపాక జైనమందిరం, మ్యూజియం, పోచంపల్లి ఇక్కత్ బ్రాండ్ చీరలు చేరాయి. నల్లగొండ జిల్లాలో నాగార్జునసాగర్ ప్రాజెక్టు, బుద్ధవనం బుద్ధవిహార ప్రాజెక్టు చేరిపోయాయి. ఖమ్మం జిల్లాను భద్రాద్రి-కొత్తగూడెం జిల్లా, ఖమ్మం జిల్లాలుగా విభజించారు. ఈ జిల్లాలో భక్త రామదాసు కట్టించిన భద్రాద్రి దేవాలయంతోపాటు, కొత్తగూడెం సింగరేణి బొగ్గగనులు, సుందర పర్ణశాల గోదావరి తీరం, భద్రాద్రి దేవాలయాలు, దండకారుణ్యం, పాపికొండలు, ఖమ్మం జిల్లా పరిధిలోకి స్తంభాద్రి ఖిల్లా దేవాలయం, నేలకొండపల్లి బౌద్ధారామం తదితరాలు చోటు చేసుకున్నాయి. రాజధాని సమీప రంగారెడ్డి జిల్లా రంగారెడ్డి, వికారాబాద్, మేడ్చల్ జిల్లాలుగా విభజన జరిగింది. అనంతగిరి కొండలు, బుగ్గరామేశ్వరం వంటివి ఈ జిల్లా పరిధిలోకి వచ్చాయి. మేడ్చల్ జిల్లాలో కీసరగుట్ట రామలింగేశ్వరాలయం, జైన బౌద్ధారామాలు, బాలానగర్ పారిశ్రామిక ప్రాంతం చేరాయి. రంగారెడ్డి జిల్లా కిందకి చిలుకూరు బాలాజీ దేవాలయం, చిన్నజీయర్ స్వామి దేవాలయం, హిమయత్ సాగర్, గండిపేట చెరువులు చేరాయి.

తెలంగాణా రాష్ట్రం, జిల్లాల పునర్విభజన సందర్భంగా రాష్ట్ర విభజన చట్టం ప్రకారం నూతనంగా ఎంపి, శాసన సభ్యుల స్థానాల పునర్వ్యవస్థీకరణ జరుగాల్సివుందని ప్రభుత్వ వర్గాలు తెలిపాయి.

తెలంగాణా జిల్లాల విభజనం వల్ల రాజకీయ, సారస్వత, విద్యా, వైజ్ఞానిక, చారిత్రిక, సాంస్కృతిక రంగాలలో మార్పులు వచ్చే అవకాశం వుంది. మరుగున పడిన, వర్తమాన కళాకారులు, సాహితీ వేత్తలు వెలుగులోకి వచ్చే అవకాశం వుంది. వరంగల్, కరీంనగర్ జిల్లా కేంద్రాలు అమృత్ హైటెక్ సిటీ సొగసులతోపాటు, ఉపరాజధానులుగా అభివృద్ధి చెందే అవకాశాలున్నాయని భావిస్తున్నారు.

❋

## మేలు కొలుపు

*(డిసెంబరు 15 ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవ సందర్భంగా)*

**-పచ్చా పెంచలయ్య**, 99128 22341



ఆ.వె॥ ఇంట నున్న సతిని ఇడుముల బాల్జేసి
బయటి పొందు కొరకు పరుగు లిడిన
చేటు వచ్చు తుదకు సేమంబు చెడుగద
అట్టిసుఖము కొరకు ఆశపడకు

ఆ.వె॥ భార్యతోడ గదియ బాసట తానౌను
నిందలేని సుఖము నీకు జగతి
ఇహము పరములందు ఇయ్యది క్షేమంబు
దీని విడచితిరుగ దీనతబ్బు

కం॥ పరసతిపొందును కోరిన
ధరనా యకులెం తమందొ దర్పమ దణగన్
మరణించి, మట్టి గలసిరి
దురవస్థల పాలబడియు, దుర్జనులగుచున్

కం॥ ఒకసతి కొక్కడె పతియన
నిల్‌రంబగుమాటయగును నిందుగ జగతిన్
ఎకసక్కె మాడు టొదలియు
ఒక సతినే నీవు కూడ, ఒనగూడు గతుల్ ॥

ఉ॥ కావున మానసంబునను కామితమివ్వగ నొక్కకాంతనే
నీవిల నిల్పుకొంచు, తననిందు జవంబును ఆరగించినన్
పావనమౌను జీవితము, పాపము దంటడు ఎన్నడేనియున్
జీవన నౌక జేరుగద జీవితతీరము హాయినిచ్చుచున్ ॥

# నాయనమ్మ

-పి. హరిపద్మరాణి

**"హరెమ్మా హరెమ్మా లేమ్మాలే లే లే లే..ఎంత పొద్దెక్కిందో చూడు. ముగ్గు నేనే వేస్తాను లేపు నాయనమ్మా అన్నావు కదమ్మా కసవూడ్చి కళ్ళాపి చల్లాను. అందరూ ముగ్గులు కూడా వేశారులే లే' అంటూ లేపింది నాయనమ్మ.**

ఊ...అంటూ వళ్లు విరుచుకుంటూ లేచి పక్క దిగి పళ్ళు తోముకొని ముగ్గుబుట్ట పట్టుకొని వాకిట్లోకి వచ్చిన నేను, చుట్టు పక్కల ఇళ్ల వాకిళ్లముందు అప్పటికే పెద్దపెద్ద ముగ్గులుండటం చూసి ఆశ్చర్యపడుతూ ముగ్గు వేయటం మొదలు పెట్టాను.

ఇంతలో దూరంగా హరిదాసు హరినామస్మరణ వినబడటంతో, ముగ్గు వేగాన్ని పెంచాను. హరిదాసు మా వీధిలోకి వచ్చేసరికి ముగ్గును పూర్తిచేసి నాయనమ్మ అప్పటికే చేసి ఉంచిన గొబ్బెమ్మలను ముగ్గుపై అమర్చి పసుపు, కుంకుమ, పూలతో వాటిని అలంకరించి, గబగబా ఇంట్లోకి పరిగెత్తి, నాయనమ్మ ఇత్తడి గ్లాసునిండా ఇచ్చిన బియ్యం తీసుకొని వాకిట్లో నిలబడ్డాను. హరిదాసు వచ్చి ముగ్గుమీద గొంతు కూర్చున్నాడు. గ్లాసులో ఉన్న బియ్యాన్ని అక్షయపాత్రలోకి పోసి వచ్చేశాను.

'హరిదాసుకు నమస్కారం చేయాలమ్మా. అలా ఊరకే పోసి రాకూడదు అన్నది నన్నే చూస్తూ అంట్లు తోముతున్న నాయనమ్మ. అంట్లు కడగటం పూర్తి చేసి వచ్చిన నాయనమ్మ ప్లేటులో నాలుగిడ్లీలు పెట్టి, అవి మునిగేటట్లు నెయ్యి వేసి తినమన్నది పీటవాల్చి.

'అమ్మో ఇన్ని ఇడ్లీలే, ఒకటి చాలు మిగతావి తీసేయ్ నాయనమ్మా' అన్నాను.

'నాతల్లీ తినమ్మా ఎన్నున్నాయ్ నాలుగేగదా, నేనిప్పుడే పెంట పోగు పోసివస్తానం'టూ పేడతట్టను నెత్తిమీద పెట్టుకొని దిబ్బదగ్గరికి వెళ్లింది.

సంక్రాంతి సెలవులకు నాయనమ్మను చూద్దామని వచ్చిన నాకు ఆమె చేసే మర్యాదల్ని తట్టుకోవటం కష్టంగా వుంది.

తొమ్మిదింటికే వంటపూర్తి చేసి 'అన్నం తిందాం రామ్మా' అంటూ పిలిచింది.

"ఇప్పుడే ఏం అన్నం నాయనమ్మా గంట క్రితమే గదా ఇడ్లీ తిన్నది' అన్నాను.

చేనికి ఎండబడిపోతుంది. బర్రె అరుస్తుంది. దబ్బున అన్నం తిని బర్రెను తోలుకొని చేనికి పోతాను. ఎప్పుడో వస్తావు తల్లీ ఉన్న రెండురోజులైనా నాతో కలిసి తినమ్మా అన్న నాయనమ్మ మాటలకు ఎదురు చెప్పలేక వెళ్లి పీటమీద కూర్చున్నాను.

గోంగూర పచ్చడి, దోసకాయ పప్పుతో అన్నం పెట్టింది. ఎంతో రుచిగా ఉన్నప్పటికీ నాజూకు తిండికి అలవాటు పడ్డ నేను అయిదారు ముద్దలకన్నా ఎక్కువ తినలేకపోయాను.

'ఏవమ్మా ఆ తిండి ! రాళ్లు తిని అరాయించుకోవలసిన వయసు నీది. నీ వయస్సులో నేను అరసోలెడు జొన్నన్నం పైనే తినేదాన్ని. ఇప్పుడు జూడు... ఇద్దరికీ కలిపి అరసోలెడు బియ్యం వండితే ఇంకా ఎంతన్నం మిగిలిందో' అంటూ అన్నం తపాళ చూపింది నాయనమ్మ.

ప్లేట్లు రెండూ చిట్టేసి కడిగి, 'నేనొస్తానమ్మా సాయంత్రం పెంద లాడే వస్తాను' అంటూ అప్పటికే ఆలశ్యమై పోయిందని త్వరత్వరగా నడుస్తూ చేనికెళ్లిపోయింది అరవై రెండేళ్ల నాయనమ్మ.

సుఖమనే పదం ఆమె నిఘంటువులోనే లేదు. ఆమెకు తెలిసిం దల్లా ప్రేమించటం, సహనం వహించటం. ఎనిమిదో యేట పెళ్ళి చేస్తే పదమూడో యేట కాపురానికి వచ్చింది. పదహారో యేడొచ్చేసరికి కొడుకును కన్నది.ఆయనే మా నాన్న. నాయనమ్మకు ఏకైక సంతానం. ఆమెకు సర్వస్వం ఆ బిడ్డడే. త్రాగుబోతు భర్తతో రోజూ తన్నులు తినడం, తనకు బాధ కలిగినప్పుడు తనలో తానే కుమిలి పోవటం, వెంటనే ఆ బాధను మరచిపోయి భర్తకు కావలసినవన్నీ అమర్చటం తప్ప ఆమెకింకేమీ తెలియవు. తాను చనిపోయేదాకా అష్టకష్టాలు పెట్టిన తాతయ్య కూడా ఆమె మంచితనాన్ని తలుచుకోకుండా చనిపో లేదు. 'సీతారాం, నువ్వు గాబట్టి నాతో ఇన్నాళ్లు బ్రతికావే. రాముడు న్నాడు సీతారాం అన్నిటికీ, అందుకే నాకీ శిక్ష' అంటూ క్యాన్సర్‌తో బాధపడుతూ ఉన్న తాతయ్య అన్నమాటలు గుర్తొస్తే ఇప్పటికీ నాకు కళ్లు చెమరుస్తాయి.

తనని ఎన్నో కష్టాలకు గురిచేసినా, ఏనాడూ తన భర్త ఇలాంటి వాడు, తనని కొడతాడు, తిడతాడు అని బయటకు పొక్కి ఎరగదు నాయనమ్మ. తాతయ్య చనిపోయిననాడు నాయనమ్మ పడిన బాధను చూస్తే నాకే ఆశ్చర్యమేసింది. ఆ భర్త ద్వారా తానేం సుఖపడిందని అలా యేడుస్తుంది. ఆమె జీవితాన్ని అడవిగాసిన వెన్నెలలా చేసి ఆమెకు ఆనందమంటే ఏమిటో తెలియకుండా చేసిన తాతయ్య చనిపోతే ఆనందించాల్సింది పోయి ఎందుకలా రోదించిందో నాకర్థం కాలేదు.

సంవత్సరం దాకా తాతయ్య జ్ఞాపకాలనుండి తేరుకోలేదు నాయనమ్మ. చేను గట్టుమీద తాను గడ్డి పీకుతుంటే వెనుక నుండి వచ్చి జుట్టు పట్టుకు లాగి డబ్బులివ్వమని బలవంతపెట్టటం, పక్కఊరి కరణంగారు భోజనానికి వస్తే ఆయన్ని డబ్బులు అడగటం, నాయనమ్మ లేకుండా చూసి జొన్నల బస్తా తీసుకుపోయి సుబ్బిరెట్టి బంకులో ఇచ్చి డబ్బులు తెచ్చుకోవటం, పెళ్లికి తన అమ్మ ప్రేమతో బహుకరించిన ఇత్తడి బుంగను తీసుకుపోయి సారాకొట్టులో ఇచ్చితాగటం గుర్తు తెచ్చుకొని 'ఏం చేస్తున్నాడో ఆ మహానుభావుడం'టూ కళ్లనీళ్లు పెట్టుకునేది.

సాయంత్రం నాలుగు గంటల ప్రాంతంలో ఒకగడ్డిమోపు నెత్తిన పెట్టుకొని, బర్రెను తోలుకొని చేనినుండి వచ్చింది నాయనమ్మ గడ్డి మోపును దింపి, అందులో చిన్నకందువాలో కట్టించిన బంతిపూలు తీసి, గేదెను గుంజకు కట్టేసి కాళ్లు, చేతులు కడుక్కుంటూ ఏమ్మా చెక్కపెట్టెలో గోదారి తిన్నావా అన్నది. 'లేదు నాయనమ్మా అన్నాను.

"అయ్యో ఎందుకని తల్లీ, పొద్దునెప్పుడో నిమ్మకాయంతన్నం తిన్నావు. ఇంతవరకూ ఏం తినలేదా? అంటూ ఒక కాకిచిప్పలో గోకు, ఒక ప్లేట్లో నాలుగరిసెలు పెట్టి ఇచ్చింది. నేతిలో చేసిన అరిసెలు ఎంతో రుచిగా ఉండటంతో సునాయాసంగా ఒకటి తినగలిగాను. ఈ లోపల 'రేపు పండక్కి ఏం చేసుకుందాం ? అని పూలు కడుతూ అడిగింది.

"నేను మిమ్మల్ని చూడటానికి వచ్చాను గాని తింటానికి రాలేదు" అన్నాను.

'బిడ్డలు వస్తారు, వస్తారు అని ఎదురు చూస్తాను. వచ్చారన్న సంతోషమే లేదు. ఏది పెట్టినా తినవు' అని కన్నీళ్లు పెట్టుకుంటున్న నాయనమ్మను చూస్తే చివుక్కుమన్నది ప్రాణం. అలా ఎందుకు నోరు జారానా అని బాధపడ్డాను. 'నీ యిష్టం నాయనమ్మా ఏదో ఒకటి చెయ్యి' అన్నాను మళ్లీ. ఇంకా బాధనుండి బయటపడని నాయనమ్మ ఏమీ మాట్లాడలేదు.

మరలా నేనే మాట్లాడుతూ 'పూర్ణాలు చేయి నాయనమ్మా తిని చాలా రోజులవుతుంది అన్నాను.

'అయితే కొట్టు దగ్గరకెళ్లి సెనగపప్పు బెల్లం తెస్తాన'ని ఉత్సాహంగా బాధనంతా మరచిపోయి అన్నది.

'జడేసి వెళతాను రామ్మా' అంది. నేనేసుకుంటాను, నువ్వెళ్లిరా నాయనమ్మా' అన్నాను.

మళ్లీ ఏడవటానికి సిద్ధంగా ఉన్న నాయనమ్మను చూసి వెయ్యమన్నాను. బుద్ధిగా నూనెడబ్బా దువ్వెన తీసుకొని వెళ్లి ఆమె ముందు కూర్చున్నాను నులకమంచంలో, తలనిండా నూనె పట్టించి, నున్నగా దువ్విజడవేయటానికి అరగంట పైనే పట్టింది. అప్పటిదాకా నేను దేవుడికని అనుకుంటున్న మూరెడు బంతిపూలను జడలో పెట్టింది. అవి పెట్టుకోవటం ఇష్టం లేకపోయినా ఆమె మనసును బాధ పెట్టటం ఇష్టం లేక మెదలకుండా కూర్చున్నాను.

పండుగ చాలా సంబరంగా గడిచింది. కనుమరోజు వెడతానని కూర్చున్నాను. ఆరోజు వెళ్లటానికి వీల్లేదంది నాయనమ్మ ప్రయాణాన్ని మరుసటిరోజుకు వాయిదా వేసి బట్టలూ అవీ సర్దుకుంటున్నాను. నాయనమ్మ ఎందుకో బాధపడుతున్నట్లు కనిపించింది. ఆరోజు రాత్రి పక్కలో కూర్చొని రేపు వెళ్లిపోతున్నావు గామ్మా, మళ్లీ ఎన్నాళ్లకో "అంటూ కన్నీళ్లు పెట్టుకుంది. నాయనమ్మ ప్రతి చిన్నవిషయానికీ ఎందుకిలా ఏడుస్తుందో నాకర్థం కాదు.

నేనెప్పుడు హాస్టలుకు వెళుతున్నా అమ్మ అలా ఏడవదు. ప్రతి సెలవల్లో సగం రోజులు అమ్మ నాన్న దగ్గర సగం రోజులు నాయనమ్మ దగ్గరా గడుపుతాను. నేనెప్పుడూ నాయనమ్మ ఏడ్చేలాగా ఏడవలేదు. అయినా ఆరునెల్లకొకసారి చుట్టం చూపుగా వచ్చి ఆమె పెట్టేవన్నీ తింటం తప్ప ఏపనీ చేయని నేనంటే ఆమెకెందుకంత ప్రేమో ఎంత ఆలోచించినా నాకంతు పట్టదు.

"ఇక్కడ ఒక్కదానివే ఏం చేస్తావు నాయనమ్మా , నాన్న దగ్గరికి వచ్చేయకూడదూ అన్న నా మాటలకు సమాధానం చెప్పకుండా



'గుండెల్లో ఏంటో బాధగా ఉందమ్మా' అంది నాయనమ్మ.

'గుండెల్లో అనకూడదు నాయనమ్మా గుండెలో అనాలి. గుండెల్లో అంటే నీకు ఒక్క గుండె కంటే ఎక్కువ ఉన్నాయా?" అన్నాను ఆమె వాక్యంలో తప్పుబట్టినందుకు కొంచెం గర్విస్తూ. ఎప్పుడు నిద్రలోకి జారుకున్నానో తెలియదుగాని పొద్దున్నే మూడింటికి నాయనమ్మ లేచి పనులు చేస్తుంటే మెలకువ వచ్చింది. ఒక పెద్ద టిఫెన్లో అరిసెలు, ఒక చిన్నటిఫెన్లో నెయ్యి తోటకూర, చింతచిగురు, ములక్కాయలు, బంతిపూలు ఒక సంచిలో పెడుతూ 'నాన్నకు కాకరకాయంటే ఇష్టం, ఈ టిఫెన్లో పెట్టాను. అక్కడికి పోగానే తీసి జాడీలో పెట్టమని అమ్మకు చెప్పు' అంది. 'ఇవన్నీ ఎందుకు నాయనమ్మా ? అక్కడ తింటానికి చాలా ఉంటాయి. వీటన్నిటినీ ఎవరూ తినను గూడా తినరు' అంటూ నాయనమ్మ ముఖం లోకి చూసిన నేను టక్కున మాట్లాడటం ఆపి, 'సరేలే నాయనమ్మా అలాగే చెపుతాను' అన్నాను.

ఒక భుజం మీద టిఫెన్, ఒక చేతిలో రెండు సంచులూ పట్టుకొని బస్సుదగ్గరకు బయలుదేరింది నాయనమ్మ, ఆమె పక్కనే హ్యాండ్ బ్యాగ్ పట్టుకొని వెళ్లాను నేను. 'బస్సు ఆరుగంటలకయితే అయిదింటికే వచ్చాం ఏం నాయనమ్మా?" అన్నాను. నాయనమ్మ ఏమీ మాట్లాడ లేదు. నేను వచ్చినరోజు ఆమె ముఖంలో కనిపించిన ఆనందం చూద్దామన్నాలేదు. ఒక అయిదు నిమిషాలు గడిచిన తరువాత ఏదో జ్ఞాపకమొచ్చినట్లు ఒక్కసారిగా 'అయ్యయ్యో జాజిచెట్టు మీద పూల చెండు అలాగే ఉంది, మరచిపోయాను. ఇక్కడే ఉండు, నేనిప్పుడే వస్తాను' అంటూ పరుగెత్తుతున్నట్లు నడుస్తూ ఇంటికి వెళ్లింది నాయనమ్మ.

నాయనమ్మ వెళ్ళి పావుగంటైనా ఇంకా రాలేదేంటబ్బా అనుకుంటూ వుండగా పిన్నిగారబ్బాయి వచ్చి—

'అక్కాయ్ నాయనమ్మ దారిలో పడిపోయింది. ఎంత పిలిచినా పలకటం లేదు. డాక్టర్‌ను తీసుకురావటానికి వెళ్ళారు. నువ్వు ఇంటికి రా' అన్నాడు.

ఏమీ అర్థంగాక అయోమయంగా ఇంటికి వెళ్ళాను. అప్పుడే ఊళ్లో డాక్టరు వచ్చి చూశాడు. నాడి చూసి నాయనమ్మ ప్రాణం గుండెపోటు వల్ల పోయిందని చెప్పాడు.

నాయనమ్మ చనిపోయిన పది సంవత్సరాలైనా ఆ జ్ఞాపకాలు ఇంకా నన్ను కలచివేస్తూనే వున్నాయి.

నాయనమ్మ గుండెల్లో నింపుకొన్న ప్రేమ నా కళ్ళముందు ఇంకా వర్షిస్తూనే వుంది.

❉

కవిత

# చీకటినే గమ్యంగా....

—నల్లపనేని విజయలక్ష్మి

వెలుగుల దారివెంట పయనించాననుకొంటూ
చీకటినే గమ్యంగా చేసుకొన్నావా?
ఏడవ తరగతిలోనే
రుక్మిణీ కల్యాణాలూ ప్రహ్లాద చరిత్రలూ
అద్భుతంగా పుక్కిట బట్టిన తరం
నిఘంటువుల్ని సైతం అలవోకగా
వల్లెవేసిన పాండిత్యం
ఏ డిగ్రీలూ లేకుండానే
శాసనాలను పరిష్కరించిన వైనం
గాథ పరిశోధనలు వెలయించిన శకం
ఏ దారి మలుపులోనో మాయం –



మిత్రుడా! గమనించావా?
చిటపట చినుకుల్లో తడిసినట్టు
అక్షరాల్లో తడిస్తే కలిగే ఆనందం
యతిప్రాసల నడుమ
ఒయ్యారాలు పోయే పద్యాల సోయగం
తడిసిన మట్టి వాసనలాంటి
పదకవిత్వ పరిమళాల్లో ఆహ్లాదం
అజంత భాషలోని ఆత్మీయ మమకారం
అన్నింటినీ గోతిలో కప్పేసి,
చిగురాకులా స్పందించే చైతన్యాన్ని
ఆస్వాదనలో సున్నితత్వాన్ని
అమ్మభాషపై అనురాగాన్ని
మళ్ళీ పైకి రాకుండా తొక్కేసి,
గొప్ప రహదారిని నిర్మించావు
పరభాషా తటిల్లతలు మెరిపించావు
అవే ఆరని దీపాలనుకొన్నావు

మహా ప్రస్థానాలూ
అమృతం కురిసిన రాత్రులూ
కనీసం చూసి చదవలేనితనం
కలానికి కులానికి తేడా తెలిసి
వ్రాయలేని 'నైపుణ్యం'
పర్సెంటేజీల వేటలో చదువులు
ప్లేజియరిజం నీడలో పరిశోధనలు
ఇదేనా నీ మార్గం?
వెలుగుల దారివెంట
పయనించాననుకొంటూ
చీకటినే గమ్యంగా మార్చుకొన్నావా?

–చలసాని నరేంద్ర,
98495 69050

# పేదరికానికి ప్రధాన కారణంగా మారిన వ్యసనం మద్యం

**సం**పూర్ణ మద్య నిషేధం కోరుతూ స్వాతంత్ర్య సమరం కాలం నుండి ఎన్నో మహోద్యమాలు జరుగుతూనే ఉన్నాయి. ఇటువంటి ఉద్యమాలలో మహిళలు ఎక్కువగా పాల్గొంటున్నారు. ఎందుకంటే ఇదొక వ్యసనంగా మారితే కుటుంబాలే నాశనం అవుతూ ఉన్నాయి. దుష్ప్రభావాలు ఎక్కువగా మహిళలపైననే పడుతున్నాయి.

మితిమించి తాగితే అనారోగ్యం కలిగించినా, రోజూ కొద్ది పరిమాణంలో మద్యం తీసుకొంటే గుండె జబ్బులు రావని, అందుకే తాము తాగుతున్నామని పలువురు మద్యపానాన్ని సమర్థించుకొనే ప్రయత్నం చేస్తూ ఉంటారు. అయితే మద్యం సేవించడంతో శరీరంలో కలిగే మార్పులను మాత్రం మరచిపోతూ ఉంటారు. అందులో ఉండే మాల్ట్ షుగర్ ద్వారా వాళ్ళ శరీరంలో అధికంగా కొవ్వు చేరుతుంది. రక్తపు పోటు పెరిగి గుండెకు నొప్పి వచ్చే అవకాశాలను పెంచుతుంది. లివర్ సంబంధ వ్యాధులు, మూర్ఛ, నరాల బలహీనత, లైంగిక లోపం, మానసిక వైకల్యం, క్యాన్సర్ వంటి అనర్థాలతో అకాల మరణాలకు దారితీసే అవకాశాలు మెండుగా ఉన్నాయి.

భారతదేశంలో పేదరికానికి ప్రధాన కారణం మద్యం సేవించడం అని ప్రపంచ ఆరోగ్య సంస్థ తన 2014 నివేదికలో స్పష్టంగా పేర్కొన్నది. కుటుంబాల ఆదాయం ప్రధానంగా పురుషులమీద ఆధార పడుతుంటుంది. వారిలో ఎక్కువమంది మద్యానికి బానిసలవుతూ ఉండడంతో కుటుంబాలకు 'మిగిలే' ఆదాయాలు గణనీయంగా తగ్గిపోతున్నాయని ఈ సంస్థ గణాంకాలు తెలుపుతున్నాయి. ప్రపంచంలో అత్యధికంగా మద్యం సేవించే ప్రజలు ఉన్న దేశాలలో రష్యా, ఎస్తోనియాల తరువాత భారత్‌లో 30 శాతం మంది ప్రజలు మద్యం సేవిస్తున్నారు.

**గతంలో మన దేశంలో మద్యం సేవించే వారి సగటు సంఖ్య 28 సంవత్సరాలు కాగా, ఇప్పుడది 17 సంవత్సరాలకు దిగినదని ఈ నివేదిక చెబుతున్నది. అంటే 10 నుండి 12 యేండ్ల నుండే మన బాలలు మద్యం వ్యసనానికి బానిసలు అవుతున్నారు అన్నమాట. త్రాగుడును నియంత్రించకపోతే భారత్ ఆర్థిక వ్యవస్థ కుప్పకూలుతుందని నిపుణులు హెచ్చరించారు. 15 నుండి 49 సంవత్సరాల మధ్య వయస్సు ఉన్నవారిలో మితిమీరిపోతున్న త్రాగుడు పనిగంటలు, పని దినాలపై తీవ్రప్రభావం చూపుతున్నట్లు ప్రపంచ ఆరోగ్య సంస్థ తెలిపింది. నేడు దేశంలోని పలు రాష్ట్రాలు మద్యం అమ్మకాలను ప్రధాన ఆదాయ వనరుగా మార్చుకొంటున్నాయి.**

లండన్‌లో ఉన్న సమయంలో మార్చి 14, 1891న 'ది వెజిటేరియన్' అనే పత్రికలో వ్రాసిన వ్యాసంలో "బ్రిటిష్ పాలన తెచ్చిపెట్టిన అత్యంత హానికరమైన చెడు లక్షణాలలో ఒక్కటిగా అందరూ భావించెడిది మద్యం దిగుమతి. అది మానవాళికి శత్రువు. నాగరికతకు శాపం" అని గాంధీజీ స్పష్టం చేశారు. దేశ స్వాతంత్ర్యం కోసం మన్యంలో వీరోచిత పోరాటం జరిపిన అల్లూరి సీతారామరాజు సహితం తన పోరాటంలో మద్యవ్యతిరేక ఉద్యమం కూడా భాగంగా చేసుకొన్నారు.

స్వాతంత్ర్య ఉద్యమం ప్రభావంతోనే మన రాజ్యాంగంలోని 47వ అధికరణంలో ప్రజల పౌష్టికాహారం, జీవన స్థాయిలను, ప్రజారోగ్యాన్ని మెరుగు పరచడం ప్రభుత్వ ప్రాథమిక విధి అని వుంది. ముఖ్యంగా ఆరోగ్యానికి హానికలిగించే మద్యం, మాదక ద్రవ్యాలు వంటి మత్తు పదార్థాలను వైద్య అవసరాలకు మినహాయించి ఉపయోగించకుండా నిషేధించాలి.


మనదేశంలో మద్య నిషేధం కోసం, మద్య నియంత్రణ కోసం తొలి నుండి ప్రయత్నాలు జరుగుతూనే ఉన్నాయి. మహాత్మాగాంధీ జన్మస్థలం అయిన గుజరాత్‌లో తొలినుండి ఇప్పటికీ మద్యనిషేధం అమలులో ఉంది. ఉమ్మడి మద్రాస్ ముఖ్యమంత్రిగా సి రాజగోపాలాచారి మద్యనిషేధాన్ని విజయవంతంగా అమలు పరిచారు. ముంబయి రాష్ట్రం ముఖ్యమంత్రిగా మొరార్జీ దేశాయ్ కూడా అమలు పరిచారు.

గతంలో ఆంధ్రప్రదేశ్, హర్యాణా, మిజోరాం వంటి పలు రాష్ట్రాలలో కొంతకాలం అమలులో ఉంది. ఇటీవల చరిత్రలోనే 1994 ఎన్నికలలో సంపూర్ణ మద్య నిషేధం హామీతో ఎన్నికలలో పోటీచేసిన ఎన్ టి రామారావు అధికారంలోకి రాగానే మద్యనిషేధం విధిస్తూ తొలి సంతకం చేశారు. అయితే ఆ తరువాత ఆ విధానాన్ని నిర్వీర్య పరచారు అనుకోండి. గత ఎన్నికలలో కేరళలో కూడా మద్యనిషేధం ప్రధాన నినాదంగా మారింది. రెండేళ్ల నుండి అక్కడ బార్ లైసెన్స్‌లపై నిషేధం విధించారు.

ఇప్పటికే ఈశాన్య ప్రాంతంలోని నాగాలాండ్‌లో 1984 నుండి, మణిపూర్‌లో 1991 నుండి మద్యనిషేధం అమలులో ఉంది. అండమాన్, లక్షద్వీప్‌లలో ఒక దీవిలో మినహా మిగిలిన అన్ని దీవుల్లో ఈ నిషేధం అమలులో ఉంది. మద్య నిషేధం విధించడం వల్లన ప్రభుత్వ ఆదాయం పడిపోతుందని, అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలకు ప్రభుత్వం వద్ద నిధులు ఉండబోవని సాధారణంగా వాదిస్తూ ఉంటారు. అయితే సుదీర్ఘకాలం నిషేధం అమలులో ఉన్న గుజరాత్ అభివృద్ధిలో దేశంలో మొదటి స్థానంలో ఉండటం గమనార్హం.

వాస్తవానికి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో రెండు ప్రాంతాల మధ్య విద్వేషాలు పెరిగి, చివరకు రెండు రాష్ట్రాలుగా విడిపోవడానికి దోహద పడిన మొదటి కారణం మద్యనిషేధంగా చెబుతూ ఉంటారు. ఉమ్మడి మద్రాస్ రాష్ట్రంనుండి విడిపోయి ఏర్పడిన ఆంధ్ర రాష్ట్రంలో మద్య నిషేధం అమలులో ఉండెడిది. ఆంధ్రప్రదేశ్‌గా ఏర్పడటం కోసం విలీనం చేసిన తెలంగాణ ప్రాంతంలో మద్యనిషేధం అమలులో ఉండెడిది కాదు. అందువల్లనే తెలంగాణ ప్రాంతానికి మిగులు ఆదాయం, ఆంధ్ర ప్రాంతానికి లోటు ఆదాయం ఉంటూ ఉండెడిది.

దీనిని ఆసరా చేసుకొని తెలంగాణ ప్రాంతపు ఆదాయాన్ని ఆంధ్ర ప్రాంతంలో ఖర్చు పెడుతూ దోచుకు వెడుతున్నారనే వాదనలు బయలు దేరాయి. ఈ వాదన తెలంగాణ ఉద్యమాన్ని 1969లో బలోపేతం చేయడంలో కీలక పాత్ర వహించింది. దానితో రెండు ప్రాంత ప్రజల మధ్య సమన్వయం కలిగించే ప్రయత్నం చేయవల సింది పోయి, తెలంగాణ ఉద్య మాన్ని అణచివేసిన అనంతరం ఆంధ్ర ప్రాంతంలో మద్యనిషే ధాన్ని రద్దు చేశారు.




దానితో ఆంధ్ర ప్రాంతం మిగులు ఆదాయం గల ప్రాంతంగా మారింది. అప్పుడు తమ ఆదా యాన్ని తెలంగాణ అభివృద్ధికోసం ఖర్చు పెడుతున్నారని వాదనలు బలం చేకూర్చుకొని 1972లో ప్రత్యేక ఆంధ్ర ఉద్యమానికి దోహద మయిందని కొందరు చెబుతున్నారు.

ప్రస్తుతం నెలకొన్న సామాజిక, రాజకీయ పరిస్థితులలో సంపూర్ణ మద్య నిషేధం ఏ మేరకు సాధ్యం అనే అంశాలను ప్రక్కన పెట్టి ముందుగా మద్యం వినియోగంపై నియంత్రణకు నడుం బిగించవలసి ఉంది. కేవలం నిషేధం వల్లనే, చట్టం ద్వారా మద్యపానం వ్యసనాన్ని రూపు మాపలేము. అనేక అంశాలపై చట్టాలు వచ్చినా అవి ఆచ రణలో అమలు కాకపోవడాన్ని చూస్తున్నాము. అందుకనే ముందుగా సమాజంలో మద్యం వినియోగం పట్ల విస్తృతమైన నియంత్రణను తీసుకు రావలసి ఉంది.

ఇప్పటికే జాతీయ పర్వదినాలుగా భావించే స్వాతంత్ర్య దినో త్సవం, రిపబ్లిక్ డే, గాంధీ జయంతి రోజులలో మద్యం అమ్మకాలను, వినియోగాన్ని పూర్తిగా నియంత్రిస్తున్నాం. గతంలో ప్రధానమంత్రిగా నెహ్రూ ఉన్న సమయంలో విదేశాలలోని భారత రాయబార/హై కమీష నర్ల కార్యాలయాలలో జరిపే రిపబ్లిక్ డే, స్వాతంత్ర్య దినోత్సవాల సందర్భంగా వచ్చిన అతిథులకు మద్యం ఇవ్వవద్దని సూచిస్తూ లేఖలు వ్రాశారు.

ఆ విధంగా చేస్తే ఉత్సవాలకు విదేశీ అతిథులు ఎవ్వరూ హాజరు కాకపోవచ్చని అనుమానం వ్యక్తం చేస్తూ రాయబార కార్యాలయ అధికారులు తిరిగి వ్రాశారు. ఈ సమాధానాలు విని నెహ్రూ ఆగ్రహం వ్యక్తం చేశారు. మన జాతీయ పర్వదినాలు జరుపుకోవాలి అంటే మద్యం తప్పనిసరిగా అందించవలసి వస్తే, మద్యం ఇస్తే తప్ప అతి థులు ఎవ్వరూ రారని అనుకొంటే అసలు అటువంటి ఉత్సవాలు జరుపకుండా ఉండటం మేలని ఆయన స్పష్టం చేశారు.

మద్యం దురలవాట్ల నుండి దేశ ప్రజలను ఆదుకోవాలని తీవ్రంగా ప్రయత్నించిన వారిలో మొరార్జీ దేశాయ్‌ని ప్రముఖంగా పేర్కొనవచ్చు. వివాహాలు, దీపావళి, ఓనం వంటి మతపర ఉత్సవా లలో సహితం మద్యం సేవించరాదని అయన స్పష్టం చేశారు. మద్య పానాన్ని జాతీయ శత్రువుగా పేర్కొంటూ మన దిగుమతుల విధా నంలో విదేశీ మద్యంపై నిషేధం విధించాలని ప్రముఖ న్యాయ కోవిదుడు వి ఆర్ కృష్ణ అయ్యర్ సూచించారు.

మద్యం అమ్మకాలను ప్రధాన ఆదాయ వనరుగా పరిగణించ డాన్ని ప్రభుత్వాలు విరమించుకోవాలి. ఇటువంటి ఆదాయం అవసర మనే దుర్మార్గపు ఆలోచనల నుండి బయట పడాలి. మహిళా జీవితాలు ఛిద్రం కావడం ద్వారా వచ్చే ఆదాయం మీద ఆధారపడటం కన్నా నీచత్వం మరొకటి ఉండదు. ఈ విషయంలో రాష్ట్ర ప్రభుత్వాలు దూరదృష్టితో విధానాలు రూపొందించాలి.

ప్రపంచ ఆరోగ్య సంస్థ సూచించిన విధంగా ప్రభుత్వాలు మద్యం అమ్మకాలను నియంత్రిస్తూ మద్యం వాడకాన్ని తగ్గించే కృషి జరపాలి. ధూమపానం తరహాలో బహిరంగ మద్యపానాన్ని సాంఘిక నేరంగా పరిగణించాలి. మద్యపానం దుష్ఫలితాల గురించి వివిధ రకాల మీడియా రూపాలలో ప్రభుత్వం విస్తృత ప్రచారం కలిగించాలి. తద్వారా ప్రజలను చైతన్యవంతం చేయడానికి కృషి చేయాలి.

ముందుగా బెల్ట్ షాపులను మూసివేయాలి. సాధారణ షాపుల కన్నా ఎక్కువ సమయం బార్లు, మద్యం షాపులను తెరచి ఉంచడాన్ని నిరోధించాలి. వాటి అమ్మకాలను ప్రోత్సహించే రీతిలో ప్రభుత్వం వ్యవహరించరాదు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు ఏరియా ఆసుపత్రు లలో మద్యపాన దుష్ఫలితాల పట్ల ప్రజలలో అవగాహన కలిగించడం కోసం కౌన్సిలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయాలి. జిల్లా కేంద్రాలలో "డి-అడిక్షన్" కేంద్రాలను పటిష్టం చేసి, డివిజన్ కేంద్రాలకు విస్త రించాలి.

జనావాసాలు, విద్యాలయాలు, దేవాలయాలు, జాతీయ రహ దారులకు సమీపంలో మద్యం దుకాణాల నిషేధాన్ని ఖచ్చితంగా అమలు పరచాలి. ❊

# బాదామీ(తొలి పశ్చిమ) చాళుక్యులు

-డా॥ఈమని శివనాగిరెడ్డి
సెల్ : 98485 98446

**క్రీ.శ.** 543లో బాదామి (కర్నాటకలోని వాతాపి) పట్టణాన్ని రాజధానిగా చాళుక్య రాజ్యాన్ని స్థాపించిన మొదటి పులకేశి, అక్కడొక కోటను కూడా నిర్మించాడు. అయితే చాళుక్యవంశ మూలపురుషుడు జయసింహుడనీ, అతని తరువాత రణరాగుడు రాజైనాడనీ, రణ రాగుని కొడుకే మొదటి పులకేశి అని తరువాతి శాసనాలు పేర్కొంటు న్నాయి. మొదటి పులకేశి(క్రీ.శ.544-566), కీర్తివర్మ (క్రీ.శ.567-597), మంగళేశుడు (క్రీ.శ.598-609), రెండో పులకేశి (క్రీ.శ. 609-642), మొదటి విక్రమాదిత్యుడు(క్రీ.శ.655-680), వినయా దిత్యుడు(క్రీ.శ.680-696), విజయాదిత్యుడు (క్రీ.శ.696-733), రెండో విక్రమాదిత్యుడు(క్రీ.శ.733-744), చివరగా రెండో కీర్తివర్మ (క్రీ.శ.744-755) చాళుక్య సామ్రాజ్యాన్ని పాలించారు.

బాదామీ చాళుక్యుల్లో రెండో పులకేశి గొప్ప విజేత. విష్ణుకుండి నులు బలహీనడడంతో తీరాంధ్రాన్ని స్వాధీనపరచుకొని తన తమ్ము డైన కుబ్జవిష్ణువర్ధనుడ్ని వేంగి సింహాసనంపై కూర్చోబెట్టి వేంగి రాజ్యాన్ని స్థాపించాడు. కుబ్జ విష్ణువర్ధనునితో ప్రారంభమైన రాజ్యాన్ని వేంగీ చాళుక్య లేక తూర్పుచాళుక్య రాజ్యమనీ, వీరిని తూర్పు చాళుక్య లని పిలిచారు. బాదామీ చాళుక్యులు శత్రురాజులను జయించి, రాజ్యాన్ని సామ్రాజ్యంగా తీర్చిదిద్ది, అనేక బిరుదుల్ని పొందారు. బాదామీ చాళుక్య 'వల్లభేంద్ర' మూలపురుషుడు జయసింహుడనీ, అతన్ని 'రాజు' 'నృప' అనే పదాలతో క్రీ.శ.599 నాటి మంగళేశుని మహాకూట శాసనంలోనూ, రెండో పులకేశి క్రీ.శ.635 నాటి ఐహోలు శాసనంలోనూ ప్రస్తావించటమైంది. అతని తరువాత రాజైనాడని పరోక్ష ప్రస్తావనగా తెలుస్తున్న రణరంగుని గురించిన వివరాలు తెలియటంలేదు. రణరంగుడు అంటే యుద్ధాలు కోరుకునేవాడు అనే అర్థం వుండటం వలన బహుశా ఇది అతని బిరుదై వుంటుందని కొందరు పరిశోధకులంటున్నారు.

నిజానికి బాదామీ వంశచరిత్ర మొదటి పులకేశి (క్రీ.శ.542-66)తో ప్రారంభమైంది. బాదామీలో కోటను కట్టి రాజ్యాన్ని విస్తరిం చిన పులకేశి **ఉరురణ పరాక్రమ** (యుద్ధరంగంలో భయంకరంగా పోరాడేవాడు) **చాళుక్య వల్లభేశ్వర** (చాళుక్య రాజుల్లో మేటి), **ధర్మమహా రాజు** (ధర్మయుతంగా పాలించిన గొప్పరాజు), **నళమౌర్య కదంబ కాళరాత్రి**(నళులు, మౌర్యులు, కదంబులను సంహరించినవాడు), **పరమభాగవత** (భాగవత ధర్మాన్ని పరమనిష్టతో ఆచరించినవాడు), **మహారాజాధిరాజ**(మహారాజులకే అధిపతి), **రణవిక్రమ** (యుద్ధ రంగంలో పరాక్రమాన్ని ప్రదర్శించినవాడు), **శ్రీ వల్లభ** (రాజ్యలక్ష్మిని వరించినవాడు-విష్ణుసమానుడు), **శ్రీ పృధ్వీవల్లభ** (భూమండలానికి అధిపతి), **సత్యాశ్రయ**(సత్యం, న్యాయం, నీతికి ఆశ్రయమిచ్చినవాడు) అనే బిరుదులను ధరించినవాడని చెబుతున్నాయి. ఇతని తరువాత రాజులైనవారు, వారి శాసనాల్లో మొదటి పులకేశిని **చళుక్యానామ్ కులమ్ అలంకరిష్ణుః, అశ్వమేధావభృధస్నాన పవిత్రీకృతగాత్రః, శ్రీపులకేశీ వల్లభ మహారాజః** అని కీర్తించారు.

మొదటి పులకేశి ఇద్దరు కొడుకుల్లో మొదటి వాడైన మొదటి కీర్తివర్మ (క్రీ.శ.566-598) అనేక బిరుదులు ధరించినట్లు మహాకూట శాసనంలో వుంది. ఇతడు బనవాసి కదంబులను, పశ్చిమానున్న మౌర్యులను, నళులను, ద్రమిళులను, చోళ, పాండ్య, కేరళ, మూషక, అంగ, వంగ, కళింగ, మగధ, మద్రక దేశాల రాజులను జయించి పరాక్రమవంతునిగా పేరుగాంచాడు. ఇతనికి **కీర్తివల్లభ** (ప్రశంసలు పొందిన రాజు), **చాళుక్య వంశాకుర**(చాళుక్యవంశంలో జన్మించిన వాడు), **ధర్మమహారాజు**(ధర్మయుతంగా పాలించిన వాడు), **నళమౌర్య కదంబ కాళరాత్రి**(నళులకు, మౌర్యులకు, కదంబులకు కాళరాత్రి వంటివాడు), **మహారాజాధిరాజ** (మహారాజులకే అధిరాజైనవాడు), **రణపరాక్రమ**(యుద్ధరంగంలో పరాక్రమవంతుడు), రణవిక్రమ (యుద్ధరంగంలో మేటి), **వల్లభరాజ** (రాజరాజ), **శ్రీ పృధ్వీవల్లభ** (భూమండలాధిపతి), **సత్యాశ్రయ** (సత్యానికి ఆశ్రయమిచ్చినవాడు, సత్యవాక్య పరిపాలకుడు) అనే బిరుదులున్నట్లు శాసనాలు ప్రస్తా విస్తున్నాయి.

మొదటి కీర్తివర్మ చనిపోయిన తరువాత అతని తమ్ముడైన మంగళేశుడు క్రీ.శ.598లో రాజైనాడు. 12 ఏళ్ళపాటు సమర్థంగా పాలించిన మంగళేశుడు, మొదటి కీర్తివర్మలాగానే **ఉరురణ పరాక్రమ, ఉరురణ విశ్రాంత** (భయంకర యుద్ధాల్లో గెలిచి, విశ్రాంతి కొన్న వాడు), **జయాశ్రయ** (జయం ఎప్పుడూ తనవద్దే ఉంచుకొన్నవాడు), **పరమ భట్టారక, పరమ భాగవత** (విష్ణుభక్తిలో పరమనిష్టగలవాడు-బాదామీలో విష్ణువుకు గుహను తొలిపించాడు), మహారాజాధిరాజ (మహారాజులకే అధిరాజైనవాడు), **రణపరాక్రమ** (యుద్ధంలో పరాక్ర మాన్ని చూపినవాడు), **రణవిక్రమ** (యుద్ధాల్లో విజయాలనే పొందే విక్రముడు), **రణవిశ్రాంత** (యుద్ధాల్లో విజయాన్ని పొందినవాడు), **శిరోమకుటమణి** (రాజులలో శ్రేష్ఠుడు, తలపై ధరించే మణులతో పొందిన కిరీటం లాంటివాడు), **శ్రీ పృధ్వీవల్లభ** (భూమండలాధిపతి) అనే బిరుదులను పొందాడు. చివరికి దాయాదిపుత్రుడైన రెండో పులకేశి చేతిలో క్రీ.శ.610లో జరిగిన అంతర్యుద్ధంలో మంగళేశుడు మరణించాడు.

క్రీ.శ.610లో బాదామీ సింహాసనాన్నధిష్టించిన రెండో పులకేశి క్రీ.శ.642 వరకూ పాలించి, చాళుక్య వంశ ప్రతిష్టను ఇనుమడింప జేశాడు. ఇతడు పశ్చిమగాంగులు, కాదంబులు, అళుపలు, మౌర్యులు, లాట, మాళవ, ఘూర్జరలను జయించాడు. హర్షవర్ధనుని ఓడించి, కళింగ, కోసల, తీరాంధ్రాన్ని పల్లవులను జయించి సామ్రాజ్యాన్ని విస్తృత పరిచాడు. తీరాంధ్రలో చాళుక్యపాలనకు శ్రీకారం చుట్టాడు. రెండోపులకేశి, ఐహోలు ప్రశస్తి శాసనం, అనంతపురంజిల్లా పెదవడు

గూరు శాసనం, హైదరాబాదు రాగిరేకు శాసనాలు, కొప్పరం రాగిరేకు శాసనాలు, తిమ్మాపురం రాగిరేకు శాసనాలు, మోర్లింబ్, రాగిరేకు శాసనాలు, మరుతూరు దానశాసనం, సతారా రాగిరేకు శాసనాలు ఇతని విజయాలను, అతను ధరించిన బిరుదులను ప్రస్తావిస్తున్నాయి. ఇతని కాలంలోనే చీనీ భిక్షుక యాత్రికుడు హుయాన్‌త్సాంగ్, పర్షియా రాజైన రెండోఖుస్రు కొలువుకు, తన రాయబారిని పంపిన సంఘట నలు జరిగాయి. రెండో పులకేశికి **అవనిజనాశ్రయ**(భూమండలంలోని ప్రజలను ఆశ్రయమిచ్చిన వాడు), **ఉరురణ పరాక్రమ, చళుకకులాం కార** (చాళుక్య కులానికే ఆభరణం లాంటివాడు), **దక్షిణాపథేశ్వర** (దక్షిణాపథం మొత్తానికి ప్రభువు), **నళ, మౌర్య, కాదంబ, కాళరాత్రి, పరమ భట్టారక, పరమ భాగవత, మహారాజాధిరాజ, రణవిక్రమ, శ్రీ పృథ్వీవల్లభ, సత్యశ్రయ** అనే బిరుదులున్నాయి. యుద్ధాల్లో గెలు పొందిన పులకేశి **మహారాజాధిరాజ, పరమేశ్వర భటార** అనీ పెదవడు గూరు శాసనంలోనూ **సమరసంసక్త పరనృపతి పరరాజయోపలబ్ద పరమేశ్వర నామధేయః** అని హైదరాబాదు రాగిరేకు శాసనంలోనూ, హర్షునిపై విజయం సాధించి **పరమేశ్వర అని మోర్లింబీ** శాసనం లోనూ, **సత్యాశ్రయ శ్రీపృథ్వీవల్లభ మహారాజు** అని మరుతూరు శాసనంలోనూ సత్యాశ్రయభటార అని కడమరకాలువ శాసనంలోనూ అతని బిరుదుల ప్రస్తావన వుంది. రెండో పులకేశి క్రీ.శ.642లో **'వాతాపికొండ'** బిరుదాంకితుడైన పల్లవ నరసింహవర్మ చేతిలో చని పోయాడు.

రెండో పులకేశి మరణం తరువాత, అతని మూడో కొడుకు మొదటి విక్రమాదిత్యుడు క్రీ.శ.654లో సింహాసనమెక్కి 681 వరకూ పాలించాడు. అతనిపాలన, విజయాలు, దానాలు, బిరుదులు గురించి తురిమెళ్ళ రాతిశాసనం కర్నూలు రాగిరేకు శాసనం, విజయాదిత్యుని అలంపురం రాతిశాసనం, విక్రమాదిత్యుని తెంబురి (మహారాష్ట్ర) తలమంచి, గద్వాల, హైదరాబాదు రాగిరేకు శాసనాలు, రామాపురం రాతిశాసనం, కడమరకాలువ, చిన్నమారూరు శాసనాలు తెలియజేస్తు న్నాయి. మొదటి విక్రమాదిత్యుడు **అనివారిత** (యుద్ధాల్లో నివారించ లేనివాడు), **చాళుక్యవంశోద్భవ, పరమేశ్వర, భట్టారక**(పూజ్యనీయ, గౌరవనీయ), **మహారాజాధిరాజ, రణకేసరి**(యుద్ధంలో సింహంలా పోరాడేవాడు), **రణరసిక**(శత్రువులను జయించటానికి చేసే యుద్ధాల్లో ఆసక్తి కలవాడు), **రాజమల్ల**(రాజుల్లో యోధుడు), **శ్రీపృథ్వీవల్లభ, సత్యాశ్రయ** అనే బిరుదులను ధరించాడు.

విక్రమాదిత్యుని తరువాత అతని కొడుకు వినయాదిత్యుడు క్రీ.శ.681లో చాళుక్య సింహాసనాన్ని అధిష్టించి క్రీ.శ.696 వరకూ పాలించాడు. అతని విక్రమ పరాక్రమ పాలనా విశేషాలు, బిరుదుల గురించి అతడు విడుదల చేసిన పణియల్ దానశాసనం, మాయ లూరు, వీరారెడ్డిపల్లి, కర్నూలు రాగిరేకు శాసనాలు, దయ్యందిన్నె, ఇగడు శాసనాలు తెలియజేస్తున్నాయి. ఇతనికి **జయాశ్రయ, త్రైరాజ్య కాంచీపతి**(కంచీపురాన్ని జయించి మూడు రాజ్యాలకు అధిపతి అయినవాడు), **దుర్దరమల్ల** (మల్లయుద్ధంలో మేటి), **పరమేశ్వర భట్టా రక, పరమభాగవత,** పరమ మాశేశ్వర(పరమ శివభక్తుడు), **పరమే శ్వర** (చక్రవర్తి), **మహారాజాధిరాజ,** యుద్ధమల్ల(యుద్ధరంగంలో పరా క్రమవంతంగా పోరాడే యోధుడు), **శ్రీపృథ్వీవల్లభ, సత్యాశ్రయ సాహసరసి** (శౌర్య, సాహస ప్రదర్శనలో ఆసక్తిగలవాడు) అనే బిరుదులున్నాయి.

వినయాదిత్యుడు మరణించిన తరువాత అతని కుమారుడైన విజయాదిత్యుడు, క్రీ.శ.696లో పట్టాభిషిక్తుడైనాడు. ఇతని పాలనా విశేషాలను, బిరుదులను గురించి అలంపూరు, ప్రశస్తిశాసనం, జమల గామే(మహారాష్ట్ర), నిట్టూరు, చందన, కొత్తపల్లె, మాయలూరు రాగి రేకు శాసనం, కొత్తూరు, అలంపురంలోని కన్నడ, దేవనాగరి లిపుల్లో వున్న శాసనం, బేతపల్లి, కొండుపల్లి, అరకటువేముల, నేరూరు, ఉల్చాల శాసనాలు తెలియజేస్తున్నాయి. ఇతడు **పరమభట్టారక, పర మేశ్వర, మహారాజాధిరాజ, రణరసిక, శ్రీపృథ్వీవల్లభ, సాహసరసిక** అనే తండ్రి ధరించిన బిరుదులనే ధరించాడు.

క్రీ.శ.734లో విజయాదిత్యుని మరణం తరువాత అతని కొడుకు రెండో విక్రమాదత్యుడు సింహాసనాన్నధిష్టించి పదేళ్ళపాటు రాజ్యమేలాడు.ఇతని పాలన, బిరుదులు గురించి లక్ష్మీశ్వరి, తిప్ప లూరు శాసనాలు తెలియజేస్తున్నాయి. ఇతడు పాండ్య, చోళ, కేరళ, కళభ్రుల భూభాగాలను జయించాడు. తరువాత శాంతియుత పాలన నందించాడు. సర్వమత సహనాన్ని పాటించిన విక్రమాదిత్యుడు బ్రాహ్మణ మతంతోపాటు జైనమతానికి కూడా చేయూత నిచ్చాడు. రెండో విక్రమాదిత్యుడు, **అనివారిత, కంజియంగొండ** (కంచిని జయించినవాడు), **కాంచీపుర విమర్ధన** (కాంచీపురాన్ని యుద్ధంలో వంశం చేసుకొన్నవాడు) **పరమ భట్టారక, పరమేశ్వర, మహారాజాధి రాజ, వల్లభనరేంద్ర, శ్రీపృథ్వీవల్లభ, సత్యాశ్రయ** అనే బిరుదుల్ని పొందాడు.

క్రీ.శ.744లో రెండో విక్రమాదిత్యుని అనంతరం అతని కుమారుడైన రెండో కీర్తివర్మ సింహాసనాన్నధిష్టించాడు. ఇతని రెండు శాసనాలు అనంతపురం జిల్లాలోని చందన (చెంజోడు), పెద్దపేటలలో వున్నాయి. ఇతనికి **త్రికుందపురవరేశ్వర, నృపసింహరాజు, పరమేశ్వర భటార, మహారాజాధిరాజ, సత్యాశ్రయ, శ్రీపృథ్వీవల్లభ** అనే బిరుదుల్ని ధరించాడు. చందన శాసనంలో ఇతన్ని తండ్రితో కలిపి **'శ్రీవిక్రమా దిత్య సత్యాశ్రయ శ్రీపృథ్వీవల్లభ మహారాజాధిరాజ పరమేశ్వర కీర్తివర్మ భటార'** అని పేర్కొనబడింది. క్రీ.శ.755లో రాష్ట్రకూట రాజైన దంతి దుర్గుడు చాళుక్య రాజ్యంపై దండెత్తి, స్వాధీనం చేసుకోవటంతో దాదాపు 250 సం॥రాల పాటు కొనసాగిన బాదామీ చాళుక్యుల పాలన అంతమైంది. ❋


## 'అమ్మనుడి' లభించుచోట్లు

నవోదయ బుక్ హౌస్, ఆర్యసమాజ్ భవనం ఎదురుగా,
కాచిగుడా. **హైదరాబాదు - 500 027.**
ఫోన్ :040-24652387

మైత్రీ బుక్‌హౌస్, జలీల్ వీధి, కార్ల్‌మార్క్సురోడ్డు
(ఏలూరు రోడ్డు) **విజయవాడ - 520 002.**
ఫోన్ : 9866211995

మణి బుక్‌స్టాల్, షాప్ నెం.58, సండేమార్కెట్,
**నెల్లూరు**-1. ఫోన్:7386223538.

డా॥ఇమ్మానేని సత్యసుందరం,
9440040061

# మద్దూరి వేంకట సుబ్బారావుగారూ నేనూ...



**మ**ద్దూరి వేంకట సుబ్బారావుగారు 90 ఏళ్ల జీవితం పూర్తి చేసుకున్నారు. ఆయన 1926 నవంబర్ 19న (కార్తీక పౌర్ణమి) రాజమండ్రిలో జన్మించారు. వారితో నాకు 50 ఏళ్ల స్నేహం.

1923లో మచిలీపట్నంలో స్థాపించిన ఎం.శేషాచలం అండ్‌కో అప్పుడు పెద్ద ప్రచురణ సంస్థ. పాఠ్యపుస్తకాలు జాతీయంకాక ముందు ఈ సంస్థ అనేక పుస్తకాలు ప్రచురించింది. ఆచార్య మామిడిపూడి వేంకట రంగయ్య లాంటి వారు ఈ సంస్థకు పుస్తకాలు వ్రాశారు. సుబ్బారావుగారి తండ్రి శేషాచలంగారు. హిందూ ప్రెస్ చాలా పెద్దది. సుబ్బారావుగారు న్యాయవాదిగా కొనసాగలేదు. పూర్తిగా ముద్రణ ప్రచురణ వ్యవహారాలు చూస్తుండేవారు. శేషాచలం గారు 1960 దశకంలో కూడా ప్రెస్‌కి వస్తూండేవారు. సుబ్బారావు గారి అన్న కీ.శే.ఎం.ఎన్. రావుగారు మద్రాసు ఆఫీసు చూసుకునే వారు. ఆయన కొన్ని పుస్తకాలు, ముఖ్యంగా భారతీయ విద్యాభవన్ సాధారణ ప్రచురణలను బౌండ్ చేయించి విదేశాలకు పంపించేవారు. వీళ్ళకి సికింద్రాబాద్‌లో శాఖ వుండేది. ఎం.ఎన్.రావు గార్కి ప్రచురణ రంగంలో మంచి పేరుండేది. ఆయన 1978లో ఢిల్లీలో గుండె పోటుతో మరణించారు.

ప్రజలలో పఠనాసక్తిని పెంచడానికి తక్కువ ధరకు పుస్తక ప్రచురణ ప్రారంభించింది ఎం.శేషాచలం అండ్ కో (ఎమెస్కో) 1960 దశకంలో పాకెట్ పుస్తకాలు (నవలలు, కథలు మొదలైనవి) కేవలం రెండు రూపాయలకే పాఠకులకు అందజేసింది. కొంత డబ్బుకడితే నెలనెలా నాలుగు పుస్తకాలు పాఠకులకు అందించింది. అవి పాఠకుల ఆదరణను పొందాయి. 'పుస్తక ప్రపంచం' అనే మాసపత్రికను ప్రచురించింది. 'ఎడ్యుకేషనల్ ఇండియా' అనే ఆంగ్ల మాసపత్రికను 1934లో ప్రారంభించి, చాలాకాలం నడిపింది. దీనికి ఆచార్య మామిడిపూడి వేంకట రంగయ్యగారు సంపాదకులు. తెలుగు సాహిత్యానికి సంబంధించి అనేక పుస్తకాలను ఎమెస్కో ప్రచురించింది. ఆరుద్ర వ్రాసిన సమగ్రాంధ్ర సాహిత్యం 13 సంపుటాలు ప్రచురించిన గొప్పదనం ఎమెస్కోదే.

**ఆదర్శ ప్రాయుడు :**

సుబ్బారావుగారు ఒక విశిష్ట వ్యక్తి. సామర్థ్యంగల వ్యక్తులను ఆయన ప్రోత్సహించారు. ప్రచురణ రంగంలో వుండటం వల్ల రచయితలను బాగా ప్రోత్సహించేవారు. రచయితలకు రాయల్టీ ఇచ్చే పద్ధతిని శేషాచలంగారు ప్రవేశపెట్టారు. అందువల్ల తనకు మంచి ఆదాయం వచ్చిందని ఆచార్య మామిడిపూడి వేంకటరంగయ్య గారు తన ఆత్మకథలో వ్రాసుకున్నారు. మొదటి నుండి సుబ్బారావుగారు ఇతరులకు సహాయపడాలని చూస్తూండేవారు. థియసాఫికల్ సొసైటీకి, రోటరీ క్లబ్‌కు మూడు దశబ్దాలకు పైగా, స్కౌట్ ఉద్యమానికి ఆరు దశబ్దాలకు పైగా తన సేవలను అందించారు. ఎవరు తన సహాయం అడిగినా కాదనలేదు. కొంతమంది. ఉపాధ్యాయులకు పురస్కారాలకు దరఖాస్తులను తానే పూర్తి చేసి వారిని ప్రోత్సహించారు. లాభాలు పొందటానికి అనేక వ్యాపారాలు చేయవచ్చు. అయితే, ప్రచురణ రంగం కేవలం లాభం పొందటానికే పరిమితం కాకూడదని సుబ్బారావుగారు, ఆయన తండ్రి శేషాచలంగారు గట్టిగా నమ్మారు. ఈ స్ఫూర్తితోనే వీరు కొన్ని దశాబ్దాలు ముద్రణ, ప్రచురణ రంగానికి తన సేవలను అందించారు.

వ్యక్తిగా సుబ్బారావుగారిది ఆధ్యాత్మిక దృక్పథం. హిందూమతానికి సంబంధించి అనేక ప్రాచీన గ్రంథాలు చదివారు. ఇంట్లో పెద్ద లైబ్రరీ వుంది. గీతాప్రెస్, గోరఖ్‌పూర్ నుండి అనేక పుస్తకాలు తెప్పించుకున్నారు. ఆయన సుఖ, దుఃఖాలకు అతీతంగా జీవిస్తున్నారు. ఎటువంటి సమస్యలొచ్చినా లెక్కచేయరు. ఆయన ఇంతకాలం జీవించటానికి ఇదొక కారణం. కుల, మతాలకు అతీతంగా సేవలు అందించారు. కాసేపు మాట్లాడితే ఆయన విశాల దృక్పథం ఎవరికైనా అర్థమవుతుంది. నేనొకసారి ఆయనతో అన్నాను "నాస్తికుడిని కాక పోయినా నాకెందుకో గుళ్లకు వెళ్లాలని అనిపించడం లేదు" అని. "మీకు మీ పత్రికలు, పుస్తకాలే దేవుళ్లు, గుళ్లు" అని అన్నారు! ఎవరికి ఎటువంటి అభిప్రాయాలున్నా వాటిని గౌరవించారు. ఎవరి గురించీ తక్కువగా మాట్లాడరు. సుబ్బారావు గారికి ఇద్దరు కుమారులు. పెద్ద కుమారుడు తండ్రి దగ్గరే వుంటున్నాడు. రెండవ కుమారుడు అమెరికాలో సాఫ్ట్‌వేర్ ఇంజనీరు. భార్య 1994లో పరమపదించారు. ఇప్పుడు ఆయన మంచి జ్ఞాపకశక్తితో ఆరోగ్యంగా మచిలీపట్నంలో ఇంటికి పరిమితమై విశ్రాంతి తీసుకొంటున్నారు.

**నా అనుభవాలు :**

నా జీవితంలో సుబ్బారావుగారితో స్నేహమే కీలకమైనది. మచిలీపట్నం హిందూ కాలేజీలో చదువుతున్నప్పుడు 16 సంవత్సరాల వయస్సులోనే ఇంగ్లీషుపై పట్టు సాధించాను. 21 సంవత్సరాల వయస్సులో (1968) ఆంధ్ర విశ్వవిద్యాలయంలో ఎం.ఏ (అర్థశాస్త్రం) ద్వితీయ సంవత్సరంలో వున్నప్పుడు పది అధ్యాయాల పుస్తకం 'ఎడ్యుకేషన్ ఎట్ క్రాస్‌రోడ్స్' అనే పుస్తకం వ్రాసి ప్రచురించాను. నాకు ఈ శక్తి నిచ్చింది సుబ్బారావుగారే. అది ఎలా జరిగిందంటే...

1963-67 సంవత్సరాలలో కాలేజీలో చదువుతున్నప్పుడు నేను

కాలేజీ మేగజైన్‌కి ఆంగ్లంలో వ్యాసాలు వ్రాస్తూ వుండేవాణ్ణి. వ్యాస రచన, వకృత్వ పోటీలలో నాకు బహుమతులు వచ్చేవి. 'భారమైన సిలబస్‌వల్లే విద్యాప్రమాణాలు దిగజారినవి' అనే అంశంపై ఆంగ్లంలో మాట్లాడి బహుమతి పొందాను. కాలేజీలో 'ఎడ్యుకేషనల్ ఇండియా' పత్రిక చూశాను. నేను మాట్లాడిన అంశంపై వ్యాసం రాసి ఈ పత్రికలో ప్రచురించుకోవాలని కోరిక కల్గింది. నాకు ఎవరూ తెలియదు.

పత్రికలో ముద్రణ, ప్రచురణ ఎం.శేషాచలం అండ్ కో అని వుంది. సంపాదకులు ఆచార్య మామిడిపూడి వేంకట రంగయ్యగారు. నేను వ్యాసం పూర్తిచేసి హిందూ ప్రెస్‌కి వెళ్ళాను. అక్కడ గుమస్తా నరసింహారావు గార్నీ కలిశాను. కొంతదూరంలో ఒకాయన ప్రూఫులు చూస్తున్నారు. తలవెంట్రుకలు పూర్తిగా తెల్లబడ్డాయి. ఆయనే శేషాచలంగారు అనుకొన్నాను. ఆయన శేషాచలం గారబ్బాయి సుబ్బారావు గారని గుమస్తా చెప్పారు. 'ఎడ్యుకేషనల్ ఇండియా' జాతీయ స్థాయిలో గుర్తింపుగల పత్రిక. నేను నా వ్యాసాన్ని సుబ్బారావుగార్కి ఇచ్చి పత్రికలో ప్రచురించవలసిందిగా కోరాను. ఆయన వ్యాసాన్ని చూసి ప్రచురించడానికి అంగీకరించారు. అది 'ఎడ్యుకేషనల్ ఇండియా' 1967 మే- జూన్ సంచికలో ప్రచురించబడింది. వేసవి శెలవులు గనుక మే-జూన్ మాసాలకి మాత్రం ఒక సంచిక వచ్చేది. ఈ వ్యాస ప్రచురణ జరిగేనాటికి నావయస్సు సరిగ్గా 20 సంవత్సరాలు. ఈ వ్యాస ప్రచురణ నా జీవితాన్నే మార్చేసింది.

ఆంధ్ర యూనివర్సిటీలో చదువుతూ 'ఎడ్యుకేషనల్ ఇండియా' కు ఉత్తరాలు వ్రాస్తుండేవాడ్ని. వాటిని సుబ్బారావు గారు ప్రచురించేవారు. విద్యార్థిగా వుండగానే 1968లో విద్యారంగంపై పుస్తకమే వ్రాయాలని కోరిక కలిగింది. ఆ దిశగా కృషి చేశాను. యూనివర్సిటీ లైబ్రరీని ఉపయోగించుకుని 10 అధ్యాయాలతో పుస్తకాన్ని పూర్తి చేసి ప్రచురించాను. దానిపేరు 'ఎడ్యుకేషన్ ఎట్ క్రాస్‌రోడ్స్'. ఆచార్య మామిడిపూడి వేంకట రంగయ్యగారు (సర్వేశ్వరరావు గారి గురువు గారు) పుస్తకానికి 'ముందుమాట' వ్రాశారు. అది నేను డాక్టర్ ఎస్. రాధాకృష్ణన్‌కు అంకితమిచ్చాను. ఇది నా జీవితంలో మరొక మలుపు.

నేను వ్యాసరచన, వక్తృత్వ పోటీలలో బహుమతులు గెల్చుకున్నా పోటీపరీక్షలకు వెళ్ళలేదు. రచన పైనే శ్రద్ధ చూపాను. ఇక ఉద్యోగ విషయానికి వస్తే, నా గురువుగారు ఆచార్య భావరాజు సర్వేశ్వరరావు గారు (అమ్మనుడి, 2016 జనవరి సంచిక చూడండి) నన్ను ఆంధ్ర యూనివర్సిటీలో పరిశోధన చేయమన్నారు. ఒక సంవత్సరంలో ఖాళీలు వస్తాయి, లెక్చరర్ అవ్వచ్చు అన్నారు. కానీ అలా జరగలేదు.

నేను ఎం.ఏ పూర్తి చేయగానే (1969లో) నేను చదివిన మచిలీపట్నం హిందూ కాలేజీలోనే అర్థశాస్త్ర శాఖలో ఖాళీలు వచ్చాయి. పత్రికా ప్రకటన వచ్చింది. కళాశాల కార్యదర్శి శ్రీ దైత శ్రీరాములు గారు 1948 నుండి ఆయన కార్యదర్శిగా వుంటున్నారు. ఆయన మాటకు తిరుగులేదు. ఆయనంటే అందరికీ హడలే. ఆయనకు దరఖాస్తు ఇచ్చేముందు హిందూ ప్రెస్‌కి వెళ్ళి సుబ్బారావుగార్ని కలిశాను. ఏం ఫరవాలేదు మీకు ఉద్యోగం వస్తుంది అన్నారు. శ్రీరాములు గారు న్యాయవాది. క్షణాలలో మనుషుల్ని, పరిస్థితులను అర్థం చేసుకోగలరు. ఆయన భవనాలు కట్టడంలో దిట్ట. 1959-60 లో ఆయన కట్టించిన ఆడిటోరియం లాంటిది ఆ రోజుల్లో ఏ కాలేజీలోనూ లేదు.

నేను దరఖాస్తు తీసుకుని హిందూ ప్రెస్ నుండి బయలుదేరి శ్రీరాములు గార్ని కలిశాను. ఆయన నా దరఖాస్తును చూశారు నేను వ్రాసిన పుస్తకాన్ని కూడా ఇచ్చాను. పైపైన చూశారు. నేను కాలేజీ పూర్వ విద్యార్థిని అని, తల్లిదండ్రులను చూసుకోవాలని, తమ్ముళ్ళను చదివించాలని, ఆర్థిక పరిస్థితి బాగుండలేదని చెప్పాను. నా పరీక్షా ఫలితాలు వచ్చినా మార్కుల షీటు తీసుకోలేదు. "మీరు మార్కుల షీటు తెచ్చుకోండి" అన్నారు శ్రీరాములుగారు...నేను వెంటనే సుబ్బారావు గార్ని ప్రెస్‌లో కలిసి జరిగింది చెప్పాను. ఉద్యోగం వచ్చినట్లే అన్నారు సుబ్బారావుగారు.

1969 సెప్టెంబర్‌లో హిందూ కళాశాలలో లెక్చరర్‌గా చేరాను. కొద్ది నెలలలోనే సుబ్బారావుగారు రోటరీ క్లబ్‌లో విద్యారంగంపై నా చేత ఉపన్యాసం ఇప్పించారు. కళాశాల పి.జి. శాఖను ప్రారంభించింది. సర్వేశ్వరరావుగారు నన్ను ఈ శాఖలో నియమించారు. 1973-74 నుండి ఈశాఖలో బోధన ప్రారంభించాను. 2004లో పి.జిసెంటర్ డైరెక్టర్‌గా పదవీ విరమణ చేశాను. ఆ తర్వాత నాలుగు సంవత్సరాలు (2004-08) ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో గ్రామీణాభివృద్ధి శాఖలోను, రెండు సంవత్సరాలు (2004-06) జర్నలిజం శాఖలోనూ బోధన చేశాను. 'ఎడిటింగ్' పేపరు చెప్పాను. ఆ తర్వాత ఒక సంవత్సరం (2010లో) కళాశాల ఎం.బి.ఏ డైరెక్టర్‌గా వున్నాను.

గత 45 సంవత్సరాలలో ఆర్థిక విద్యా, సామాజిక అంశాలపై కొన్ని వేల వ్యాసాలు ఆంగ్ల పత్రికలకు రాశాను. సుమారు 500 ఆంగ్ల పుస్తకాలను సమీక్ష చేశాను. ఇప్పటికీ వ్యాసాలు వ్రాస్తూనే వున్నాను. ప్రస్తుతం 'భవన్స్ జర్నల్'లో నా వ్యాసాలు చూసి సుబ్బారావు గారు ఎంతో సంతోషిస్తున్నారు. అంచెలంచెలుగా సాగిన నా ఎదుగుదలను చూసిన వ్యక్తి సుబ్బారావుగారు. ఆయన నాకంటే 21 సంవత్సరాలు పెద్దవారు. అయినా మా స్నేహం 50 ఏళ్లనుండి కొనసాగుతూనే ఉంది. ఇందుకు ప్రధానకారణం ఇద్దరం కూడా జీవితంలో ఇతరులకు చేయగలిగిన సహాయం చేయాలని నమ్మిన వాళ్ళం. ఇలా జీవితం సాగినప్పుడు ఆటంకాలు వచ్చినా అని ఎంతోకాలం వుండవు. సంకల్ప బలంతో కొన్ని సాధించవచ్చునని మా నమ్మకం. ❋

కవిత

## మన తెనుగు

తీరైన అక్షరాల పూమాలిక
తేట పదాల మధుర గీతిక
తెమ్మెరల సుగంధ వీచిక
తియ్యందనాలొలుకు రస గుళిక
సంస్కృతీ వైభవ సూచిక
సంప్రదాయాలను గుబాళించు మల్లిక
జన హృదయ స్పందనల ప్రతీక
జాతి సభ్యతను చాటు కీర్తిపతాక...
మన తెనుగు భాష!

**-శ్రీమతి ఎస్.కాశింబి,** 90522 16044

# పత్రికల పదసృష్టి

-గోవిందరాజు చక్రధర్
ఫోన్ : 99122 29932

**మా**నవ జీవన గమనం మాదిరే భాషకూడా నిత్య పరిణామశీలి. శాస్త్ర, సాంకేతిక రంగాల అభివృద్ధి, ఆర్థిక సంస్కరణల ప్రభావం కారణంగా ప్రపంచ భాషల్లోకి కొత్తపదాలు, భావనలు నిరంతరం వచ్చి చేరుతున్నాయి. ఇంటర్నెట్ అనుసంధానంగా అందుబాటులోకి వచ్చిన యూట్యూబ్, ఫేస్‌బుక్, ట్విటర్ వంటి పలు సామాజిక వేదికలు కొత్త పలుకుబళ్లకు, వ్యక్తీకరణలకు బాట వేస్తున్నాయి. 'లైకులు', 'కామెంట్లు', 'పోస్టులు' నిత్యవ్యవహారాలయ్యాయి.

ఏ భాష అయినా జీవనదీ ప్రవాహం. నదీ గమనంలో అనేకానేక నీటి పాయలు, కల్మషాలు వచ్చి చేరుతున్నట్లే, జీవద్భాషా ప్రవాహంలో కూడా కొత్తపదాలు, అపభ్రంశాలు కలుస్తుంటాయి. ప్రజల అవసరాలకు అనుగుణంగా భాష ఎదిగి అండగా 'నేనున్నానని' అంటుందేగానీ ఆభాష మాట్లాడే ప్రజలను ఇబ్బంది పెట్టదు. కొత్తపదాలను కొన్నిసార్లు సహజ రూపమన్నంతగా ఒడిలోకి తీసుకోనూవచ్చు. ఆయా ప్రాంత ప్రజల అవసరాలకు బట్టి, భౌగోళిక వాతావరణ స్థితిగతులను బట్టి కొన్ని భాషల్లో కొన్ని వ్యక్తీకరణలకు ఎక్కువ పదజాలం అందుబాటులో ఉండవచ్చు. ఆ పరిస్థితులు లేని ప్రాంతాల్లో అంతటి పరిపుష్ట పద జాలం ఉండదు. హిమాలయ ప్రాంతాల్లో నివసించే కొన్ని తెగల ప్రజలు మాట్లాడే భాషల్లో మంచుకూర్పులకు సంబంధించి స్వల్ప ఛాయా భేదాలను చెప్పటానికి కావలసినన్ని పదాలున్నాయి. తెలుగులో పొగమంచు, గూడమంచు తర్వాత మాటలను వెతుక్కోవాలి. హిమాలయాల దాకా ఎందుకు? మన ఆవకాయ, మాగాయ, మెంతికాయ, గుత్తికాయ, నీళ్లావకాయ, పెసరావకాయ, వెల్లుల్లి ఆవకాయ, ముక్కల పచ్చడి, రోటి పచ్చడి, కొబ్బరి మామిడి పచ్చడి వగైరా వివిధరకాల పచ్చళ్లకు ఇంగ్లీషులోనో, వాటి వినియోగం లేని భాషల్లోనో పదాలు దొరకవు.

తెలుగునాట గ్రాంధిక, వ్యవహారిక భాషారీతులను దాటుకుని చాలా ముందుకు వచ్చాం. పత్రికాభాష అనే ప్రత్యేక భాషారీతిని కూడా గుర్తిస్తున్నాం. అనేక విశ్వవిద్యాలయాలు, పరిశోధనలకు వాడదగిన ప్రమాణభాషగా పత్రికాభాషకు పట్టం గట్టాయి. ప్రచార సాధనాల విస్తృతి, వ్యాప్తికారణంగా ప్రజలపై పత్రికలు, టీవీల భాషల ప్రభావం కూడా ప్రబలంగానే ఉంది.

ప్రచార సాధనాలు సమాచార నివేదన కోసం ఓ ప్రత్యేక తరహా పదజాలం ఏర్పరచుకుని వాడుతున్నాయి. 'ఘాటుగా విమర్శించారు, ఉద్ఘాటించారు, ఉటంకించారు, ఉల్లేఖించారు, విశ్లేషించారు. వంటి పదాలు ప్రజల సామాన్య వ్యవహారంలో విన్పించవు. కానీ రాజకీయ నాయకులు సహా అనేక మందిపై పత్రికా భాష ప్రభావం కన్పిస్తోంది. నేతల ప్రసంగాల్లో, ప్రకటనల్లో రాతల్లో ఈ పదాలు విన్పిస్తున్నాయి. కన్పిస్తున్నాయి, 'ఈ ప్రకటనను తాను ఖండిస్తున్నా' నంటాడో నేత. తీవ్రవాదులు ప్రధాన జనజీవన స్రవంతిలోకి రావాలని విజ్ఞప్తి చేస్తున్నాను' అంటాడు మరో నాయకుడు.

అక్షరాస్యత ఇంతలేని రోజుల్లో సినిమాల మాటల ప్రభావం కన్పించేది. ఇప్పటికీ ఆధోరణి కొనసాగుతూనే ఉంది. సినిమా రచయితలు కూడా ప్రజల వ్యక్తీకరణకు పట్టం కడుతుండటంతో సినిమాల ద్వారా అవి మరింత విస్తృత ప్రజానీకానికి చేరుతున్నాయి. అస్మదీయులు, తస్మదీయులు, లైట్ తీస్కో లాంటి పదాలను ఉదహరించవచ్చు.

**కొత్త పదకల్పన :**

ముందే చెప్పుకున్నట్లు శాస్త్ర, సాంకేతిక రంగ అభివృద్ధి, ఆర్థిక సంస్కరణల ఫలితంగా అనేక కొత్త భావనలు, పదాలు వెల్లువలా ముంచెత్తుతున్నాయి. వీటికి తెలుగులో సమాన పదాలను రూపొందించే బాధ్యతను కొంతకాలంగా ఈనాడు పత్రిక భుజాని కెత్తుకుంది.

కొత్త పదాలను పత్రికలు సృష్టించటం అనేది పూర్వం నుంచీ ఉన్నదే. డ్రెడ్జర్‌కు తవ్వోడ అని-ప్రజల పలుకుబడి నుంచి గ్రహించి ఉపయోగించారు. నాన్ ఎలైన్డ్ మూవ్‌మెంట్‌కు ప్రాముఖ్యం ఉన్న రోజుల్లో అలీనోద్యమం అనే పదాన్ని స్థిరపరచుకున్నాం. ఆంధ్రపత్రిక వారు విబంధ ఉద్యమం అని రాసేవారు. అలీనోద్యమం కంటే విబంధ ఉద్యమం మరింత అర్థ స్ఫోరకంగా ఉన్నా నిలబడలేక పోయింది. బ్లూస్టార్ ఆపరేషన్‌కు చేసిన నీలినక్షత్ర యుద్ధం కూడా నిలబడలేదు. ఆయా పత్రికల ప్రాచుర్యం కూడా భాషారీతులను తీర్చిదిద్దడంలో పాత్ర పోషిస్తోంది. సర్క్యులేషన్ ఎక్కువగా ఉన్న పత్రికలో వచ్చిన పదమే మంచిచెడ్డల ప్రసక్తి లేకుండా ప్రజల నాల్కలపై నడయాడుతోంది. సమష్టి సరైన రూపమే అయినా పత్రికల వాడకం వల్ల సమిష్టిగా చలామణి అవుతోంది.

పత్రికల్లోని ఉపసంపాదకుడు అర్ధరాత్రి వేళ వడివడిగా వార్తలను అనువదిస్తూ అప్పటికప్పుడు కొత్త పదాన్ని ఆ క్షణంలో బుద్ధికి తోచిన రీతిలో ప్రయోగించి ప్రజలమీదకు సంధిస్తాడు. ఆ మరునాడు తాపీగా కూర్చొని ఆలోచించినపుడు ఇతరులకు అంతకంటే మెరుగైన పదం స్ఫురించవచ్చు కానీ పత్రికలో వచ్చేసింది కనుక ఆ పదమే ప్రజల్లోకి చొచ్చుకు వెళుతుంది.

'ఈనాడు'లో వాడుతున్న కొన్ని పదాలు ఇలా ఉన్నాయి :

మొబైల్ ఫోను – చేవాణి
ఇంటర్నెట్ – అంతర్జాలం
వైఫై – నిస్తంత్రీజాలం
స్క్రాప్‌బుక్ – ఖాళీపుస్తకం
ప్రొటోకాల్ – శిష్టాచారం
ఫుడ్ సప్లిమెంట్– సంపూరకాహారం
కంట్రాక్టర్ – గుత్తేదారు
ఫైలు – దస్త్రం

ఈ పదాలను ప్రజలు తమ వాడకంలో ఉపయోగించే అవకాశాలు తక్కువకనుక ప్రయాస పడి తెలుగు పదాలను సృష్టించటం వృధా అని వాదించే వారున్నారు. మొబైల్ ఫోనుకు చేవాణి, చరవాణి అని ఎవరూ వాడటం లేదు, వాడినా కృతకంగా ఉంటుందని వారు

భావిస్తున్నారు. నిజానికి ఏ కొత్త పదమైనా మొదటిసారి విన్నపుడు చెవికి ఇంపుగా అన్పించదు. ప్రయోగానికి వీలుకాదనో, వినసొంపుగా లేదనో ఆపదాన్ని తిరస్కరించటం సబబుకాదు.

ఇతర దక్షిణాది రాష్ట్రాల్లో భాషాభిమానం ఎక్కువ. జాతీయ, అంతర్జాతీయ వేదికల నుంచి కూడా తమిళంలో మాట్లాడటానికి వెనకాడరు. ఇంగ్లీషులో ప్రసంగించ గలిగివుండీ కేవలం మాతృభాష మీద ఉన్న అభిమానంతో తమిళంలోనే మాట్లాడుతారు. పార్లమెంటు ప్రసంగాల్లోనూ దీన్ని చూడవచ్చు. కొత్తగా ప్రవేశిస్తున్న పదాలకు తమిళ సమానార్థకాలను తయారు చేసుకుని విరివిగా వాడుతున్నారు. ఇది హర్షించదగిన విషయమే.

ఇంగ్లీషులోకి వచ్చి చేరుతున్న పదాలను యథాతథంగా ఉప యోగిస్తూ వెళితే కొంతకాలం తర్వాత మన భాష మనది కాకుండా పోయే ప్రమాదం ఉంది. మనమాట, పలుకుబడి, వ్యవహారాలకు విఘాతం కలుగుతంది. తెలుగు పదసృష్టి కేవలం మౌలిక భాషావసరా లకే కాక లిఖిత భాషావసరాలకు కూడా తప్పనిసరి. ఇంగ్లీషులోని వివిధ శాస్త్రాలను, విషయాలను తెలుగులోకి తర్జుమా చేసుకోవలసి వచ్చినపుడు సమాన పదం అవసరం ఏర్పడుతుంది.

**ఈ విషయంలో పత్రికల కృషి మరింత సార్థకం కావాలంటే ఈ దిగువ అంశాలపై దృష్టి సారిస్తే మంచిది.**

1. కొత్త పదాలను సృష్టించి మెరుగైన రూపాన్ని ఖాయపరచ టానికి ప్రతి పత్రికలో భాషావిభాగాన్ని నెలకొల్పాలి.

2. ఖరారు చేసిన పదాలను తమ పత్రికలోని వివిధ ప్రచురణ కేంద్రాలలోని సిబ్బంది అదే రూపంలో వాడేందుకు చర్యలు తీసుకో వాలి. ఇందుకోసం నిర్ణీత కాలవ్యవధుల్లో భాషా సమాచార లేఖలను పంపవచ్చు. ప్రచురణ కేంద్రాలలోని సిబ్బంది అదే రూపంలో వాడేం దుకు చర్యలు తీసుకోవాలి. ఇందుకోసం నిర్ణీత కాలవ్యవధుల్లో భాషా సమాచార లేఖలను పంపవచ్చు. శైలీ పత్రాలనూ రూపొందించు కోవచ్చు.

3. వివిధ తెలుగు పత్రికల సంపాదకులు సమావేశమై అన్ని పత్రికల్లో ఒకే రీతిలో పదాలు వాడేందుకు నిర్ణయం తీసుకోవాలి. ఈ విషయంలో ప్రెస్ అకాడమీ వంటి సంస్థలు చొరవ తీసుకుని సమన్వయ బాధ్యత వహించవచ్చు.

4. ప్రజలలో ఇప్పటికే వాడుకలో ఉన్న రూపాలను స్వీకరించి విరివిగా ప్రచారంలోకి తేవచ్చు. అది మాండలిక పదమైనా సరే, బాగుందనుకున్నపుడు సాధారణీకరణం చేయటం అవసరం. రైల్వేసిగ్నల్‌కు రెక్కమాను అనే వ్యవహారం కొన్ని ప్రాంతాల్లో ఉంది. ఆ పదాన్ని వాడటంలో అభ్యంతర మెందుకు ఉండాలి? అలాగే ఫ్లై ఓవర్‌కు పైదారి, పై బాట అనే రూపాలను ప్రజలు ఉపయోగిస్తు న్నారు. ఇలాంటి వాటిని సేకరించి ప్రాచుర్యంలోకి తేవలసిన బాధ్య తను పత్రికలు, టీవీలు స్వీకరించాలి.

5. వృత్తి మాండలికాలు, కులమాండలికాల నుంచి కూడా సాధారణీకరించదగ్గ పదాలను ఎంచుకోవచ్చు.

**మన సంస్కృతి, సంప్రదాయాలు అన్నింటికీ మూలం మన భాషే. ఆభాష పట్ల నిరాకరణ చూపటమంటే మన సంస్కృతి సంప్ర దాయాల నుంచి దూరం వెళ్లటమే. తెలుగు జాతి అస్తిత్వం తెలుగు భాషతోనే ముడిపడి ఉందన్న వాస్తవం మరవద్దు.** ❋

**సవరణలు**

**1.** అక్టోబరు సంచికలో ప్రచురించిన మద్రాసు హైకోర్టు తీర్పు తెలుగు అనువాదం ముద్రణలో చోటు చేసుకొన్న ఈ క్రింది తప్పులను దయచేసి సవరించుకొన ప్రార్థన.

పుట -9

తీర్పులో మూడవ వాక్యంలో '24 భాషలకు' అనుటకు బదులుగా 25 భాషలకు అని వుంది. ఇదే పుటలో రెండవ వరుసలో 8వ లైనులో 29-11-2004 తప్పు. దీనిని 29-10-2004 అని సవరించుకోవాలి.

13 వ పుట రెండవ వరుసలో 4వ లైనులో (Language carriers) అని వున్న దానిని (Carriers of culture) అని మార్చు కోవాలి.

15వ పుట మొదటి వరుసలో 33వ లైనులో 'కిరాణార్జునీయ'ను 'కిరాతార్జునీయ'గా చదువుకోవాలి.

37వ లైనులో బి.లివిస్‌దిన్‌ను బి.లెవిస్ రైస్‌గా చదువుకోవాలి.

38వ లైనులో 'పుంస'ను 'పంప' అని చదువుకోవాలి.

**2.** 5వ పుటలో నున్నా వేణుగోపాలరావు గారి ఫోను నెం. తప్పుగా పడింది. సరైన నెం. 93464 48149. అక్కడే హరీంద్రనాథ్ చట్టోపాధ్యాయ అని వుండవలసినది- హరిశ్చంద్ర ఛటోపాధ్యాయ అని తప్పుగా పడింది. హరీంద్రనాథ్ చట్టోపాధ్యాయ గారు సరోజిని నాయుడు గారి తమ్ముడు. మొదటి లోక్‌సభకు విజయ వాడ పార్లమెంటు లోక్‌సభ స్థానానికి కమ్యూనిస్టుల మద్దతుతో స్వతంత్ర అభ్యర్థిగా గెలిచారు. అదే పేజీలో మరొక ఫోన్ నెం -శ్రీ చలసాని సుబ్బారావు గారి కుమారుడు సుధాకరరావు గారిది- కూడా తప్పు పడింది. సరైన నెం : 99596 85305

30 వ పుట రెండవ వరుసలో నాలుగవ, 8వ లైన్లలో -2018ని 2013గా సరిదిద్దుకోవాలి. -సం.


## 'భిలాయివాణి' పురస్కారాలు డిసెంబరు 25న భిలాయిలో

భిలాయిలో తెలుగువారు నడుపుతున్న 'భిలాయివాణి' పత్రిక నిర్వహించిన కవితల పోటీలో మొదటి 3 బహుమతులు పొందినవి- బి.కళాగోపాల్(నిజామాబాద్), ఎరుకలపూడి గోపీనాథరావు (విజయ వాడ), మల్లారెడ్డి మురళీమోహన్ (బెంగళూరు) గార్లకు 2016 భిలాయివాణి పురస్కారాలను భిలాయిలోని భిలాయి హోటల్‌లో డిసెం బరు 25 ఉదయం 10 గంటలకు జరిగే సభలో నగదుతో పుర స్కారాన్ని అందించి సన్మానిస్తారు

## డిసెంబరు 25న విమలాశాంతి సాహిత్య పురస్కారాలు

2016 శాంతి రజనీకాంత్ స్మారక కవితా పురస్కారాలను డా॥ప్రసాదమూర్తి (హైదరాబాద్) గారి 'పూలండోయ్ పూలు' కవితా సంపుటికి, బాలసుధాకరమౌళి (విజయనగరం జిల్లా) గారి 'ఎగరా ల్సిన సమయం' కవితా సంపుటికి ప్రకటించారు. డిసెంబరు 25న విజయవాడలో జరిగే సభలో వీరికి నగదుతో పురస్కారాన్ని అందించి సన్మానిస్తారని డా॥శాంతినారాయణ తెలియజేస్తున్నారు. (ఫోన్ : 99166 71962) ❋

# 'తెనుగులెంక'సూక్తులు-17



**కలమెత్తిన హలమెత్తిన**
**మలమెత్తిన వారి నొక్కమై జూడవలెన్**
**వలతియు నలతియు లేదిట**
**పలువృత్తులు సాగినపుడె బ్రతుకులు సాగున్**

'తెనుగు లెంక' 'అభినవ తిక్కన'
**తుమ్మల సీతారామమూర్తి.**

**మ**నిషి ఎలాగో ఒకలాగు బ్రతకాలంటే ఇతరులతో కలవకుండా, ఇతరులకు సహాయపడకుండా, ఇతరుల సహాయం పొందకుండా బ్రతుకవచ్చేమో గాని సుఖంగా సౌకర్యవంతంగా, ఆరోగ్యంగా, అందంగా ఆనందంగా బ్రతకాలంటే మాత్రం ఇతరుల సహాయాన్ని పొందవలసిందే.

తిండి తినాలంటే రైతుల సాయం కావాలి. సిగ్గు కాపాడుకోవాలంటే సాలీల సాయం కావాలి. అందంగా కనిపించాలంటే మంగలి కావాలి. ఆకర్షణీయమైన బట్ట ధరించాలంటే దర్జీ కావాలి. పరిశుభ్రమయిన బట్టలు కట్టుకోవాలంటే చాకలి కావాలి. వాహనాల మరమ్మత్తులకు మెకానిక్కు కావాలి. నగలు చేయించుకోవాలంటే కంసాలి కావాలి. ఇలా జీవితంలో ఏది కావాలన్నా ఎవరో ఒకరి సాయాన్ని పొందాల్సిందే. మనం ఎలా ఇతరుల సహాయాన్ని పొందుతున్నామో, మనమూ ఇతరులకు మనకు చేతనయిన సాయం చేయవలసి ఉంటుంది. అందరూ పరస్పరం ఇచ్చిపుచ్చుకోవడం వల్లనే సమాజపు మనుగడ సాగుతున్నది.

వృత్తి అంటేపని. కర్మ అంటేపని పనిని బట్టే వర్ణాలు, కులాలు- 'ఖర్మ'ను బట్టి కాదు. రాజ్యపాలన చేసిన క్షత్రియులు, చదువుకొని మంత్రాంగం నెరపుతూ, దేవుడికి మధ్యవర్తిగా ఉన్నామని చెప్పే బ్రాహ్మణులు ఇతర వర్ణాలవారిని అంటే ఇతర పనులు చేసేవారిని అణగదొక్కారు. ఊరికిదూరంగా ఉంచారు. వారిని తాకనీయలేదు. వారు పండించే ధాన్యాన్ని కూరగాయలను తింటారు గాని వారిని స్పృశించరు. వారు పితికిన పాలుతాగుతారు గాని వారిని దగ్గరకు రానీయరు. ఈ విధంగా కొన్ని పనులు చేసేవారి చేత చేయిస్తూ, మంచివనుకొనే పనులు వారు సొంతం చేసుకున్నారు. వీరిస్వార్థంగానే సమాజంలో అంతరాలు పెరిగాయి. అశాంతి పెరిగింది. పరస్పరం దాడులు మొదలయ్యాయి.

సమాజంలో ఏ ఒక్క వృత్తికి సంబంధించిన వారైనా తమ వృత్తి చేయము అంటే ఏమవుతుందో తెలుసు. పారిశుద్ధ్య కార్మికులు నాలుగురోజులు పని మానేస్తే నగరం దుర్గంధభూయిష్ఠమై, రోగాలకు నిలయమవుతుంది. పోలీసులు పదిరోజులు కర్తవ్యం చేయకుంటే సమాజం అస్తవ్యస్తమై అరాచకం కార్యమేలుతుంది. వైద్యులు నాలుగు రోజులు వైద్యానికి దూరంగా ఉంటామంటే శ్మశానాల్లో ఖాళీ ఉండదు. రైతులు నాగళ్ళు మూలపడేస్తే ప్రపంచం ఆకలితో అలమటిస్తుంది. కవులు, పండితులు కలాల్లో సిరా నింపకపోతే ఆనందానుభూతి లేక ఆర్ద్రహృదయాలు అల్లాడిపోతాయి. ఒకరేమిటి! సమాజంలో ఉన్న ఏ వృత్తికి చెందిన వారైనా తమ వృత్తిని విడిచి పెట్టారంటే, సమాజం కష్టాల కడలిలో చిక్కుకుంటుంది. కటకటలాడిపోతుంది.

ఎక్కువ సంపాదన ఉండే వృత్తి గొప్పదని. తక్కువ సంపాదన ఉండే వృత్తి అల్పమైనదని భావించే దృక్పథం బాగా బలిసిపోయింది సమాజంలో వృత్తి విలువలను ఆర్థిక దృక్కులతో చూడడమే దీనికి కారణం. ఈ వివక్ష వలననే కొన్ని జాతులు. అసహనానికి గురవుతున్నాయి. అసంతృప్తితో రగిలిపోతున్నాయి. ఈ భావనే ఎన్నెన్నో సామాజిక రుగ్మతలకు దారి తీస్తున్నది.

ఒకప్పుడున్న అంటరాని తనంవంటి రుగ్మతలు ఇప్పుడు అంత తీవ్రంగా లేవు. ఇప్పుడు కులాలవారీ వృత్తులు లేవు. అగ్రవర్ణాల వారు చెప్పుల అంగళ్లను పెడుతున్నారు. దళితులు రాజ్యాధికారం చలాయిస్తున్నారు. ఏ వ్యాపారంలో లాభాలు ఆర్జించవచ్చో, అలాంటి వాటికి ఇతర వర్ణాలు పోటీపడుతున్నాయి. కనుక ఒకప్పుడు పని ఆధారంగా ఏర్పడిన వ్యవస్థ ఇప్పుడు చిన్నాభిన్నం అయిపోయింది.

ఇప్పుడున్నదల్లా ఆర్థికవ్యవస్థ. డబ్బు సంపాదించేవాడిని గౌరవించడం. అధికంగా సంపాదించలేనివాడిని అగౌరవంగా చూడడం. అది తప్పు. అన్ని వృత్తులు సమానమే! ఎవడి వృత్తి వాడికి గొప్పది. ఆ వృత్తి ఆ వ్యక్తి చేయకపోతే సమాజం నడవదు. అందుకే అందరినీ సమానంగా చూడాలని తెనుగులెంక హితోక్తి పలికాడు.

"కవిని, రైతును, పాకీవానిని ఒకే విధంగా చూడాలి. ఆ వృత్తులలో హెచ్చుతగ్గులు లేవు. అన్నీ వృత్తులే! అన్నీ సమానమైనవే. అన్ని వృత్తులు సక్రమంగా సాగితేనే సమాజంలోని మనుషుల జీవితాలు సక్రమంగా సాగుతాయి" అన్నారాయన.

కాబట్టి అందరినీ గౌరవించాలి. అందరినీ ఆదరించాలి. మనం బ్రతకాలి. మనం సజావుగా బ్రతకడానికి సహాయపడే అన్నివృత్తుల వారికి మనం చేతనయిన సాయం చేయాలి. సమాజం సక్రమంగా సాగేటట్లు సహకరించాలి.

**-డాక్టర్ నాగభైరవ ఆదినారాయణ,**
98497 99711


## స్పందనను వ్రాయండి

**'అమ్మనుడి'**లో రచనలపై
మీ స్పందనను వ్రాసి పంపండి!
సంపాదకుడు **'అమ్మనుడి',**
జి-2, శ్రీ వాయుపుత్ర రెసిడెన్సీ, హిందీ కళాశాల వీధి,
మాచవరం, విజయవాడ-520 004.
ఇ-మెయిల్ : *editorammanudi@gmail.com*

## పురస్కార ప్రదానం

ప్రఖ్యాత రచయితలు శ్రీ అట్టాడ అప్పల్నాయుడు గారికి, శ్రీమతి చంద్రలత గారికి 'పెద్దభొట్ల సాహితీ స్ఫూర్తి' పురస్కారాలను 2016 డిసెంబరు 15 సాయంత్రం 6-30 గంటలకు ప్రముఖ రచయిత పెద్దిభొట్ల సుబ్బరామయ్య గారి జన్మదిన సందర్భంగా ఇస్తారు. వేదిక విజయవాడ-మొగల్రాజపురంలోని మధుమాలక్ష్మి ఛాంబర్స్.

# మన మంచి తెలుగు




నూట ఇరవై ఐదు పుస్తకాలు రచించి, సుమారు నలభై అవార్డులు– బిరుదులు పొందిన డా॥మలయశ్రీ రచన ఇది. తెలుగు భాష పుట్టు పూర్వోత్తరాలను వివరించడంతో పాటు వ్యవహారంలో మారిపోయిన సామెతల అసలు స్వరూపాలు, పురాణ పురుషుల పేర్లకు ఉన్న అర్థాలు, ఇప్పటి చలం, జగన్ మొదలైన పేర్లలోని అనౌచిత్యం గురించి మలయశ్రీ ఇందులో వివరించారు. ఇది భాషాప్రియులతో పాటు సామాన్య పాఠకులకు కూడా భాషాజ్ఞానాన్ని కలిగిస్తుంది. వ్యవహారంలో ఉన్న మాటలు ఏ విధంగా వ్యతిరేకార్థాన్ని కలిగించాయో తెలియజేయడం విజ్ఞాన దాయకంగా ఉంది. దేవతల పేర్లు, కాలదోషంపట్టిన పదాల వివరణలతో వ్యాకరణ అంశాలను గూడా పరిశీలించడం వారి పాండిత్యానికి నిదర్శనం. తెలంగాణ మాండలికానికి, ఇతర మాండలికాలకు గల భేదసాదృశ్యాలను చెప్పి, మాండలిక భాష ఆవశ్యకతను తెలియజేయడం వారి భాషాభిమానాన్ని తెలియజేస్తుంది. అన్నమయ్య, క్షేత్రయ్య వంటి ప్రముఖుల రచనల్లో సంస్కృతరూపాలు, తెలుగురూపాలు ఏ విధంగా మార్పు చెందాయో, అవి వ్యవహారంలో ఏ విధంగా ఉపయోగిస్తున్నారో తెలియజేయడం బాగుంది.

రామాయణంలో పిడకలవేట, బెల్లం కొట్టిన రాయి మొదలైన సామెతల గురించి రెండు చోట్ల చెప్పడం ఎందుకో అర్థం కాదు. పుస్తకంలోని విషయానికి, పుస్తకం పేరుకు పొంతన లేదు. మలయశ్రీ గారు ఆలోచించలేదు గాని, ఇంతకంటె మంచి పేరు పెట్టలేరా?

(మన మంచి తెలుగు– రచయిత : డా॥ మలయశ్రీ ; వెల; రూ 80/– ప్రతులకు డా॥ మలయశ్రీ; ఆదిత్యభవన్, వేమననగర్, ఇం.నెం.1–113/7 రేకుర్తి, కరీంనగర్ – 585451. సెల్ – 98665 46220.

**– డా॥నాగభైరవ ఆదినారాయణ,** 98497 99711

# గిడుగుకు నిజమైన వారసుడు 'పురిపండా'



**వి**శాలాంధ్ర పుస్తక ప్రదర్శన సందర్భంగా ఆంధ్రప్రదేశ్ అభ్యుదయ రచయితల సంఘం విశాఖ శాఖ ఆధ్వర్యంలో నవంబరు 27న ప్రముఖ కథా రచయిత సింగమనేని నారాయణను పురిపండా అప్పలస్వామి అవార్డునిచ్చి సత్కరించారు.

ముఖ్య అతిథిగా పాల్గొన్న యుపిఎస్సి పూర్వసభ్యులు ఆచార్య కె.ఎస్.చలం మాట్లాడుతూ – ఉత్తరాంధ్రకు చెందిన ముగ్గురు మహనీయులు, తొలి పదకవితా పితామహుడు శ్రీకాన్త కృష్ణమాచార్యులు, బంకుపల్లి మల్లయ్యశాస్త్రి, పురిపండా అప్పలస్వామిల సేవలను తెలుగు సమాజం విస్మరించిందని ఆవేదన వ్యక్తం చేశారు. గిడుగు రామ్మూర్తి శిష్యునిగా పురిపండా వ్యావహారిక భాషాభివృద్ధికి ఆజన్మాంతం సేవలందించారని నివాళులర్పించారు.


"వాడుక భాష ఉద్యమ వ్యాప్తికి ఎంతో కృషి చేసిన గొప్ప రచయిత పురిపండా అప్పలస్వామి. తెలుగు భాషా పరిరక్షణకు పాటుపడుతున్న కథా రచయిత సింగమనేని నారాయణకు పురిపండా పేరిట అవార్డు నివ్వడం చాలా సముచితమైన నిర్ణయ"మని అరసం జాతీయ కార్యదర్శి పెనుగొండ లక్ష్మీనారాయణ అభినందించారు.


ఆచార్య ఇక్బాల్ మాట్లాడుతూ– 'పురిపండా ఎప్పుడూ తనకు ఇద్దరే శత్రువులు అనేవారని, ఒకరు గ్రాంథిక భాషావాదులు, మరొకరు తనను వృద్ధుడు అనేవారు' అని అంటుండేవారని అన్నారు. పురిపండా, తన పుస్తకాలన్నింటినీ ఆంధ్ర విశ్వవిద్యాలయం తెలుగుశాఖకు గాక, హిందీ శాఖకు గ్రంథాలయం నిమిత్తం అందజేశారని, అందుకు కారణం విశ్వవిద్యాలయ తెలుగుశాఖ వ్యావహారిక భాషా వాడుకకు ప్రాధాన్యం యివ్వకపోవడమేనని చెప్పేవారన్నారు.

అవార్డు గ్రహీత, కథా రచయిత సింగమనేని తన ప్రతిస్పందనలో – ప్రతి ఇల్లు మార్కెట్ మయంగా మారిపోయిందని, మార్కెట్ శక్తులు తమ ప్రయోజనాలు నెరవేర్చుకోవడానికి మాతృభాషను నాశనం చేస్తున్నారని అన్నారు. భాష లేనిదే ఏ జాతికీ మనుగడ లేదని, మాతృభాషాపరిరక్షణకు ప్రతివారూ కృషి చేయాలని కోరారు. అరసం విశాఖ శాఖ అధ్యక్షులు ఆచార్య చందు సుబ్బారావు అధ్యక్షత న జరిగిన సభలో అరసం రాష్ట్ర శాఖ కార్యదర్శి, రచయిత వల్లూరు శివప్రసాద్, సిపిఐ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి జె.వి. సత్యన్నారాయణమూర్తి, విశాఖపట్నం కోఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ ఛైర్మన్ చలసాని రాఘవేంద్రరావులు పాల్గొన్నారు.


**–బి.వి.అప్పారావు,** విశాఖపట్నం

'మహిళను గౌరవించు అనే సందేశం **'మహిళ'.** రచయిత : బి.హనుమారెడ్డి, **'మహిళ'** పుటలు : 196, వెల : రు.100/-లు. ప్రతులకు : విశాలాంధ్ర బుక్‌హౌస్‌లు మరియు బి.హనుమారెడ్డి, న్యాయవాది, ప్రకాశంజిల్లా రచయితల సంఘం అధ్యక్షులు, రాజాసానగల్ రోడ్, ఒంగోలు - 523 002.





**'మావోయిస్టుల రక్తచరిత్ర'.** రచయిత : ఉప్పల నరసింహం , **'మావోయిస్టుల రక్తచరిత్ర'**, పుటలు : 156, వెల : రు.150/-లు. ప్రతులకు : జ్ఞానం పబ్లికేషన్స్ మరియు అన్ని ప్రముఖ పుస్తక కేంద్రాలు.





డా॥ ఉప్పల లక్ష్మణరావు గారి జీవిత సంగ్రహము **'బతుకు పుస్తకం'.** రచయిత : డా॥ ఉప్పల లక్ష్మణరావు, **'బతుకు పుస్తకం'** (ఆత్మకథ), పుటలు : 216, ప్రతులకు : సాహితీమిత్రులు, మసీదువీధి, అరండల్‌పూట, కారల్‌మర్క్స్ రోడ్డు, విజయవాడ-520 002.

రైతు కవిత్వం **'వెన్నువిరిగిన కంకులు'.** రచయిత : డా॥ మక్కెన శ్రీను, **'వెన్నువిరిగిన కంకులు'**, పుటలు : 50, వెల : రు.160/-లు. ప్రతులకు : డా॥మక్కెన శ్రీను, టి.ఎఫ్.3,బొడ్డపాటి మాన్షన్,ఇ.ఎస్.ఐ.బస్టాప్ దగ్గర, గుణదల,విజయవాడ-520 004.



ఖండాంతరాల నుండి రసఖండికలు **'న్యూజిలాండ్ నానీలు'.** రచయిత : సతీష్ కుమార్ గొల్లపూడి, **'న్యూజిలాండ్ నానీలు'** పుటలు : 112, వెల : రు.100/-లు. ప్రతులకు : గొల్లపూడి సతీష్ కుమార్, 4-11-302, చైతన్యపురి కాలనీ, నల్గొండ-1, తెలంగాణ, సతీష్ కుమార్ గొల్లపూడి, 194, హాల్స్‌వెల్ రోడ్, హిల్‌మోర్టన్, క్రీస్ట్‌చర్చ్-8025, న్యూజిలండ్.






సత్యవీక్షణాలు **'సిరిమువ్వలు'.** రచయిత : డా॥ సమ్మన్న ఈటెల, **'సిరిమువ్వలు'**, పుటలు : 46, వెల : రు.50/-లు. ప్రతులకు : డా॥ సమ్మన్న, ఫ్లాట్ నెం.207, లైన్ నెం. 9, సిరి రెసిడెన్సీ, స్ట్రీట్‌నెం.2, ఇం. నెం.12-13-367,12-13-367/1, తార్నాక, హైదరాబాద్-500 017. మరియు ప్రగతి యూత్ అసోసియేషన్, కమలాపూర్, కరీంనగర్ జిల్లా.




**'పరాగభూమి కథలు'.** రచయిత : కలువకొలను సదానంద, **'పరాగభూమి కథలు'** (కథల సంపుటి), పుటలు : 220, వెల : రు.150/-లు. ప్రతులకు : పలమనేరు మిత్రసాహితి, 6-219, గుడియాత్తం రోడ్డు, పలమనేరు-517 408, చిత్తూరు జిల్లా, మరియు నవోదయ, ప్రజాశక్తి, విశాలాంధ్ర బుక్‌హౌస్‌లు.

**'విశాలాంధ్రము'.** రచయిత : ఆవటపల్లి నారాయణరావు, **'విశాలాంధ్రము"** పుటలు : 280, వెల : రు./-లు. ప్రతులకు : బొమ్మిడాల శ్రీకృష్ణమూర్తి ఫౌండేషన్, గుంటూరు



50 మంది అభ్యుదయ రైతుల విజయ గాధలు **'ప్రకృతి నేస్తాలు'.** రచయిత : క్రాంతి, **'ప్రకృతి నేస్తాలు'**, పుటలు : 256, వెల : రు.150/-లు. ప్రతులకు : రైతునేస్తం పబ్లికేషన్స్, 6-2-959, దక్షిణభారత హిందీ ప్రచారసభ కాంప్లెక్స్, ఖైరతాబాద్, హైదరాబాద్ - 500 004.






**'రాయలసీమ రాష్ట్రం ఒక డిమాండ్'.** రచయిత : భూమన్, **'రాయలసీమ రాష్ట్రం ఒక డిమాండ్'** పుటలు : 46, వెల : రు.50/-లు. ప్రతులకు : నవోదయ, ప్రజాశక్తి, విశాలాంధ్ర బుక్‌హౌస్‌లు మరియు అన్ని ప్రముఖ పుస్తక కేంద్రాలు.

శ్రద్ధాంజలి

# యుగపురుషుడు – మంగళంపల్లి బాలమురళీకృష్ణ





**శ్రీమతి** ఎమ్.ఎస్.సుబ్బలక్ష్మిగారు మన దాక్షిణాత్య సంగీత వైభవాన్ని విస్తరింపజేస్తే, ఒక ఆంధ్ర బాలమేధావి బాలమురళీకృష్ణ ఈ వైభవాన్ని జాతీయ స్వరూపంగా ఆవిష్కరించాడు. పుష్టిగల గళం, విశిష్ట మేధాసంపత్తి గల వ్యక్తిత్వం, వ్యుత్పత్తిని విస్తరించే ఆకాంక్షతో శాస్త్రీయ పరిధులనవలీలగా అధిగమించే ప్రత్యేక శైలితో పండిత పామర జనరంజకమైన గానాన్ని అందించిన మహనీయుడు బాలమురళీకృష్ణ.

1930 జులై 6న తూర్పుగోదావరిజిల్లా శంకరగుప్తంలో ఉదయించిన బాలమురళీకృష్ణ కారణజన్ముడు. తల్లి సూర్యకాంతంగారు జన్మనిచ్చి గతిస్తే, పెదతల్లి సుబ్బమ్మ జీవితాంతం ప్రేమను వర్షించి పెంచింది. తండ్రి తిరిగి వివాహం చేసుకోకుండా తోడునీడగా కొడుకుని తన నీడన రక్షించుకొన్నాడు. "కులములో ఒకండు గుణవంతుడుండిన కులము వెలయు వాని గుణముచేత. వెలయు వనములోని మలయజం బున్నట్లు"గా వర్ధిల్లి బాల్యంలోనే అగ్రశ్రేణిస్థాయినందుకొని వైదుష్య వృద్ధితో దాక్షణాత్యాగ్రేసరుల సరిసాటిగా గళంవిప్పి ఆకాశవాణిలో ధృవ తారగా మెరసిన తెలుగుతేజం మన మంగళంపల్లి. ఆయన కాయనే సాటి. విద్వాంసుడననే అహంకారం చూపక, సదా స్మితవదనంతో పెద్దలనూ చిన్నలనూ సమదృష్టితో భావించి "నిర్మమో నిరహంకారో" యన్నట్లు జీవితమంతా ఒకే పరిణతితో నెఱపిన స్థితప్రజ్ఞుడు. ఏ పాఠ శాలలో చదువు నేర్వకనే తన స్వయంకృషితో అశేష విశ్వవిద్యాలయాల విశిష్ట గుర్తింపు పురస్కారాలను గ్రహించిన ప్రతిభాశాలి.

* * *

- అతి బాల్యంలో దక్షిణదేశంలో పెద్ద పురస్కారమైన మదరాసు మ్యూజిక్ అకాడెమీ వారి "సంగీత కళానిధి" బిరుదునందుకున్నాడు.
- పద్మశ్రీ, పద్మభూషణ, పద్మవిభూషణలతో సహా ఎన్నో బిరుదులు, పురస్కారాలు, సన్మానాలు అందుకున్నారు.
- ముసునూరివారి ఆశీస్సులతో గురుపూజలలో విజయవాడలో మురళి బాలమురళిగా అవతరించాడు.
- ఆకాశం నుంచి క్రిందకు దిగి పాదం మోపితే ఆ తావులో స్వీకారంతో వెంటనే వసంతకాలం ప్రభవించి ఆయనపై సౌజన్యాన్ని వర్షించే శిష్యులూ, జదారులూ, అభిమానులూ, ప్రేమికులూ ఇంకా ఎందరెందరో ఆయనకు..
- త్యాగరాయార్య సమకాలికుడైన, బహు భాషల ప్రజ్ఞగల ప్రభువైన వాగ్గేయకారుడు, భక్తియుతుడూ మహారాజా స్వాతి తిరునాళ్ వంశీకుడైన ప్రిన్సు రామవర్మ తానుగా వచ్చి బాలమురళిగారిని గురువుగా ఆరాధించి గాంధర్వాన్ని గ్రహించి అన్నిచోట్లా భక్తిశ్రద్ధలతో వితరణ చేయడం.
- అతి బాల్యంలో గీర్వాణభాషలో 72 మేళకర్త రాగాలలో కృతులు రచించి ఆ కాలపు పెద్దలైన కాశీ కృష్ణాచార్యులు, చెళ్ళపిళ్ళ వెంకట శాస్త్రులు, హరినాగభూషణం, విశ్వనాథ సత్యనారాయణ, దీక్షిత దాసు వంటివారి ఆశీస్సులూ, గుర్తింపూ పొంది ప్రేమను పంచుకొన్న ధీశాలి. అనేకానేక నూతన రాగకర్త.
- సాటి విద్వాంసులను పెద్దచిన్న యని విభేదించక "విద్య యొసగును వినయము" వరవడిగా గురువుగారి గాత్రానికేగాక ఇంకా చాలా పెద్ద విద్వాంసులకు వాయులీన సహకారం అందించి, జంత్రగాత్రాలతో అనేకానేక వాయిద్యాల ప్రదర్శనా నైపుణ్యం ప్రదర్శించారు.
- ఆంగ్లభాషా పరిజ్ఞానాన్ని స్వయంకృషితో సంపాదించుకొని విశ్వమంతా విహరించి తన గానమాధుర్యాన్ని ప్రపంచ మానవాళికి అందించిన ఘనుడు.

**కొందరి ప్రముఖుల కితాబులివి :**

మహామహోపాధ్యాయ నూకల చిన సత్యనారాయణగారు : "ఆయన గొప్పేమిటంటే ఆయన పాడినట్లు ఎవరూ పాడలేరు. మూడు స్థాయిల రేంజ్ ఎవరికీ వుండదు."

జ్ఞానపీఠ గ్రహీత విశ్వనాథ : "తానుగా పిన్నయై యవతారమెత్తె మాకొరకుగాను ప్రేమతో మరల మురళి"

చెళ్ళపిళ్ళ : "నావలెనే వృద్ధుడవై నా వలెనే కీర్తిగాంచి శ్రీదేవీ పదభక్తుడవై భూవలయము తిరుగుమోయి మురళీకృష్ణా"

జ్ఞానపీఠ గ్రహీత డా॥ సి.నా.రె. "ఏ వాణికి పుంభావమో, ఏ వరాల తొలిపంటయో, ఈ స్వరాల వన్నెకాడు, ఈ మురళీ నామధరుడు"

సహాధ్యాయి నాదసుధార్ణవ అన్నవరపు : బహుముఖ ప్రజ్ఞాశాలి. సంగీత జగత్తులో ఎన్నో కీర్తిపతాకా లెగురవేసిన ఘనత ఆయనదే. వైకుంఠం నుండి నారదుడు వచ్చినట్లుగా భావిస్తాను.

ఆచార్య బాలాంత్రపు రజనీకాంతరావు : వాగ్గేయకారులందరిలో అతి విశిష్ట ఖ్యాతి గలవాడు. మన యుగానికి గొప్పపేరు తెచ్చినవాడు. "మురళీ గానకళా సుస్వర సంజనక ప్రశస్త సంస్థానము"

ఇంతటి అసాధారణ ప్రజ్ఞావంతుడు చెన్నయ్‌లో నవంబరు 22న ఈ లోకాన్ని వీడి పరమపదాన్ని చేరుకున్నాడు. తనకు తానే సాటిగా వర్ధిల్లిన ఈ యుగపురుషుడు మళ్లీ ఈ నేలపై తెలుగువాడిగా ప్రభవించాలని కోరుకుందాం.

**–టి.ఎస్.రామచంద్రరావు,** 0866–2470920
కీ.శే.బాలమురళీకృష్ణగారికి సన్నిహితుడు,కుటుంబ మిత్రుడు

Owned, printed & published by Samala Lakshmana Babu (9440448244) and printed at Sri Mahalakshmi Offset Printers, 16-7-20, Veera Raghavulu Street, Sharabu Bazaar, Tenali, Guntur Dist. and published from 8-386, Jivaka Bhawan, Angalakuduru Post, Tenali Mandal, Guntur Dist. - 522211. Editor: Dr. SAMALA RAMESH BABU (9848016136)
RNI-APTEL/2015/62362

# జాతీయ విద్యావిధాన ముసాయిదాను వెనక్కు తీసుకోవాలి

## -ఆంధ్రప్రదేశ్ విద్యాపరిరక్షణ కమిటీ డిమాండ్



అఖిలభారత విద్యాహక్కు వేదిక అధ్యక్షవర్గ సభ్యులు ఆచార్య అనిల్ సత్‌గోపాల్ ప్రసంగిస్తున్న దృశ్యం. పక్కన నిలబడినవారు ఆంధ్రప్రదేశ్ విద్యాపరిరక్షణ కమిటీ కార్యదర్శి రమేష్ పట్నాయక్, సభికులు

నవంబరు 25 ఆదివారం నాడు విజయవాడలో ఆంధ్రప్రదేశ్ విద్యాపరిరక్షణ కమిటీ సమ్మేళనం జరిగింది. కేంద్ర మానవవనరుల శాఖ వారు విడుదల చేసిన ముసాయిదా జాతీయ విద్యావిధాన పత్రంపై చర్చించి తీర్మానాలు చేశారు. వీటిలో భాషకు సంబంధించి చేసిన తీర్మానం ఇలా వుంది :

"ప్రభుత్వ ముసాయిదా మాతృభాషా మాధ్యమం అన్నింటికంటే ఉన్నతమైనదని అంగీకరిస్తూనే ప్రజలు అడుగుతున్నారు కాబట్టి 6వ తరగతి నుంచి ఆంగ్ల మాధ్యమాన్నే అమలు జరపాలని ప్రతిపాదిస్తుంది. 5వ తరగతి వరకు కూడా ఆయా రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలు కోరుకుంటే మాతృభాష లేదా ప్రాంతీయ భాషా మాధ్యమాలు అమలు చేయవచ్చని 'ఉదారంగా' వెసులుబాటు కల్పించింది. పార్లమెంటులో తీర్మానం చేసి ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలలన్నింటిలో మాతృభాషా మాధ్యమాన్నే అమలు చేయాలని చట్టం చేస్తే ఎవరూ ఆంగ్లమాధ్యమాన్ని అడగరు. ఒక భాషగా 1వ తరగతి నుండి సమర్థవంతంగా బోధిస్తే ఆంగ్లమాధ్యమంలో చదివిన దానికంటే ఆంగ్లం బాగా వస్తుంది. ప్రభుత్వం ముందుగా ఆంగ్లభాష బానిసత్వం నుండి బయటపడాలి. అలాగే ఈ ముసాయిదా సంస్కృతం అన్ని భాషల అభివృద్ధికి సహాయం చేసిందని ప్రకటిస్తుంది. ఇది చరిత్ర విరుద్ధమైన విషయం. సంస్కృత ఆధిపత్య కాలంలో ప్రజల భాషలు అణగారిపోయాయి అన్నది వాస్తవం. ఈ ముసాయిదా ఇటు ఆంగ్లాన్ని అటు సంస్కృతాన్ని ముందుకు తీసుకువచ్చి ప్రజల భాషలకు గోరీ కడుతుంది. ప్రభుత్వం ఈ ప్రతిపాదనలను వెనక్కు తీసుకోవాలి. మాతృభాషా మాధ్యమాన్ని అత్యున్నత స్థాయి వరకు అమలు చేయాలి. ఆంగ్లాన్ని సమర్థవంతంగా బోధించాలి. సంస్కృతాన్ని విశ్వవిద్యాలయ పరిధిలో పరిశోధన ప్రయోజనాలకై కొనసాగించాలి".

ఈ సభలో ఏపీటిఫ్ (1938), డి.టి.ఎఫ్, పిడిఎస్‌యు, ఎఐఎస్ఎఫ్, పిడిఎస్‌యు సంస్థల ప్రతినిధులతోపాటు రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఎన్.రఘువీరారెడ్డి, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ, సిపిఎం రాష్ట్ర కార్యదర్శి పి.మధు, సిపిఐ ఎం.ఎల్ న్యూ డెమోక్రసీ చిట్టిపాటి వెంకటేశ్వరరావు, సిపిఐఎం.ఎల్ న్యూడెమోక్రసీ సాంబశివరావు, పీపుల్స్ మానిటరింగ్ కమిటీ సత్యబోస్ మున్నగువారు ప్రసంగించారు.

శాసనమండలి సభ్యులు, విద్యావికాస వేదిక నాయకులు విఠపు బాలసుబ్రహ్మణ్యం కూడా పాల్గొని ప్రసంగించారు.

(2వ పుట తరువాయి)

భారతానికి వీరు రచించిన విశేషవ్యాఖ్య ఎంతోమంది ప్రశంసల్ని అందుకొన్నది. మహాభారతం మొత్తాన్ని పదిసార్లకు పైగా చదివానని వారు చెబుతూ ఉండేవారు. ఏ రచననైనా కనీసం రెండుసార్లు చదివితేనే దాన్ని చదివానని, లేకపోతే ఆ రచనను చూశానని చెప్పేవారు. పోతన భాగవతాన్ని కూడా తెలుగువారికి వచన రూపంలో అందించారు. రామాయణాన్ని కూడా ముద్రించాలనే తలపులో ఉండగా వారు ఆకస్మికంగా 23-11-2016 ఉదయం అంతిమశ్వాస విడవడం తెలుగు సాహిత్యలోకానికి తీరని నష్టం.

యార్లగడ్డ వారు శ్రీనాథుని హరవిలాసానికి, కాసుల పురుషోత్తమ కవి ఆంధ్రనాయక, హంసలదీవి వేణుగోపాల శతకాలకు వ్యాఖ్యలు రచించారు. ముద్దుపళని రాధికా సాంత్వనం పద్యాలకు తాత్పర్యాలు అందించారు. అదేరీతిలో క్రీడాభిరామానికి కూడా అందించారు.

బాలగంగాధరరావుగారికి పలు అంశాల పట్ల విశిష్టమైన అవగాహన ఉంది అని చెప్పటానికి ఆయన రచించిన కొండవీటి వాగు, పులిచింతల నిర్మాణం అనే వ్యాసాలే సాక్ష్యం.

యార్లగడ్డ వారు అరకులోయ ప్రాంతంలో ఉన్న సాధారణ వ్యవహార భాషకు నిఘంటువును నిర్మించారు. అక్కడి వయోజనులు తెలుగు నేర్చుకునే నిమిత్తం వాచకాలు, కథల పుస్తకాలు సిద్ధంచేశారు. భారతదేశంలో ఒక గిరిజన భాషపై వెలువడిన సమగ్ర నిఘంటువును రూపొందించిన కీర్తి యార్లగడ్డ వారికి, కెనడా వాస్తవ్యులు టీవెగుస్టన్ సన్ గారికి దక్కుతుంది. ఈ నిఘంటు నిర్మాణానికి స్థానిక గిరిజనులు కూడా సహకరించారు. తెలుగు ఇంగ్లీషు ఆదివాసి ఒరియాభాషలో ఆరోపాలను వాక్యవ్యవహార సరణిని కూడా చూపటం ఈ నిఘంటువు ప్రత్యేకత.

తెలుగు పదాల వ్యుత్పత్తుల్ని ప్రత్యేక ప్రతిభతో విశ్లేషించే నామ విజ్ఞాన పరిశోధక పితామహుడైన ఆచార్య బాలగంగాధర రావుగారి చివరి కోరిక ఆంధ్ర రాష్ట్రంలోని ప్రతి గ్రామ చరిత్రను నిర్మించటం. ఈ పనికి పూనుకోవటం ఆయనకు తెలుగుజాతి అర్పించే శ్రద్ధాంజలి.

-డా॥గుమ్మాసాంబశివరావు,

-ఆచార్య వెలమల సిమ్మన్న

AMMANUDI (Telugu Monthly)
December 2016, Vol.2, Issue 10

RNI-APTEL/2015/62362
Postal Reg. No.TEN/12/2015-17

